08-10Pg1exHMNWJQE MN 1 ONG_08-10Pg1exHMNWJQE.qxd 10/7/2025 11:48 PM Page 1

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

ఒంగోలు

: fb.com/vaartha Digital

Published from Ongole, Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

8-10-2025 బుధవారం సంపుటి: 31 సంచిక: 247 పేజీలు: 12 వెల: 6.50

ఫిజిక్స్‌లో ముగ్గురికి నోబెల్
క్వాంటం ప్రపంచాన్ని కళ్లకు కట్టిన శాస్త్రవేత్తలు
9లో
నాభార్య రాత్రిళ్లు నాగినిగా మారిపోతోంది!


## ప్రజాజీవితంలో పాతికేళ్లు!

### ప్రభుత్వాధినేతగా 25 యేళ్లుగా సేవలు



ప్రజల జీవితాలను బలోపేతం కోసం
దేశ ఉజ్వల ప్రగతి కోసం తపన
ప్రధాని మోడీ ఎక్స్‌లో ఆసక్తికర పోస్ట్
గుజరాత్ సిఎంగా, ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారోత్సవ ఫోటోలు జోడింపు

9లో



# డబుల్ సంక్షేమం

- పింఛన్ల నుంచి ఆటో డ్రైవర్ల సేవ వరకు పథకాలు విజయవంతంగా అమలు చేశాం
- ఆరోగ్యాంధ్రప్రదేశ్ అనేది మా విధానం
- పెట్టుబడులొస్తున్నాయ్... ఉద్యోగాలు కల్పిస్తున్నాం
- డిఎస్సీ నోటిఫికేషన్‌తో టీచర్లను నియమించాం
- ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేశాం
- సోషల్ మీడియాపై ప్రత్యేక దృష్టి
- మహిళలపై అసభ్యకర పోస్టులు పెడితే కఠినంగా వ్యవహరిస్తున్నాం
- అన్ని వర్గాల సంక్షేమం లక్ష్యంగా అడుగులు
- మీడియాతో ఇష్టాగోష్టిలో సీఎం చంద్రబాబు

**విజయవాడ, అక్టోబరు 7 ప్రభాతవార్త ప్రతినిధి:** దేశంలో మరే రాష్ట్రంలో అమలు కాని స్థాయిలో రెట్టింపు సంక్షేమం ఆంధ్రప్రదేశ్ ప్రజలకు అందు తోందని సిఎం చంద్రబాబునాయుడు స్పష్టం చేసారు. ఈ ఉదయం సిఎం చంద్రబాబు తన మజిలీ కార్యాలయంలో మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ 'ఆటో డ్రైవర్ల సేవలో' పథకం అమలు విజయవంతమైంది. అలాగే ప్రధాన ఎన్నికల హామీలుగా ఉన్న సూపర్ సిక్స్‌ను సూపర్ హిట్ చేశాం. 'పేదల సేవలో' కార్యక్రమంలో 64 లక్షల మందికి ఎన్టీఆర్ భరోసా పింఛన్లు ఇంటివద్దే పంపిణీ చేస్తూ సంక్షేమ రాజ్యానికి కొత్త అర్థాన్ని ఇచ్చాం. తన బిడ్డ చదువుకోవాలని కలలుకనే పేదింటి తల్లులకు ఆర్థిక భరోసా ఇచ్చేందుకు 'తల్లికి వందనం' పథకాన్ని తీసుకువచ్చాం. రూ.10 వేల కోట్లతో పథకాన్ని అమలు చేశాం. అన్నదాత సుఖీభవ పథకంలో మొదటి విడతగా రాష్ట్ర ప్రభుత్వం రూ.5 వేలు, కేంద్రం రూ.2 వేలు కలిపి మొత్తం రూ.7 వేలు రైతుల ఖాతాల్లో వేశాం. 47 లక్షల మంది రైతులకు రూ.3,173 కోట్లు అందించాం. దీపం పథకంకింద ఏడాదికి 3 సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నాం. ఏటా రూ.2,684 కోట్లు ఖర్చు చేస్తున్నాం. ఇప్పటికి 2 కోట్ల రాయితీ సిలిండర్లు ఇచ్చాం. స్వాతంత్ర్య దినోత్సవంసందర్భంగా ఆర్టీసీ బస్సుల్లో ఆడబిడ్డలకు 'స్త్రీ శక్తి' పేరుతో ఉచిత ప్రయాణాన్ని కానుకగా ఇచ్చాం. 16,347 పోస్టులతో మెగా డిఎస్సీ నిర్వహించి నియామకాలు చేసాం. ప్రజలకు నాడు కునుకు లేకుండా చేసిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేశాం.
పేద ప్రజల ఆకలి తీర్చేందుకు అన్నా క్యాంటీన్లు తిరిగి తీసుకువచ్చాం. 204 అన్నా క్యాంటీన్లలో 5.16 కోట్ల మందికి రూ.5లకే కడుపునింపామన్నారు. దేవాలయాల్లో పనిచేస్తున్న నాయీ బ్రాహ్మణుల కనీస వేతనం రూ.25 వేలకు పెంచాం. దేవాలయ ట్రస్ట్ బోర్డుల్లో చోటు కల్పించాం. 40 వేల సెలూన్లకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్నాం. మేనిఫెస్టోలో చెప్పినట్లు కల్లు గీత కార్మికులకు 10 శాతం మద్యం దుకాణాలు, బార్‌లు కేటాయించాం. మత్స్యకారులకు వేట విరామ సమయంలో రూ.20 వేలు ఆర్థిక సాయాన్ని ఇస్తున్నాం. మత్స్యకారుల సేవలో పథకం ద్వారా 1,29,178 మందికి రూ.259 కోట్లు అందించాం. చేనేతకు అండగా హ్యాండ్లూమ్స్‌కు నెలకు 200 యూనిట్లు, పవర్‌లూమ్స్‌కు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. ఎస్సీ సామాజిక వర్గాల్లో అంతరాలు తగ్గించేలా.. ఏ వర్గాన్ని నొప్పించకుండా, ఏ ఒక్కరూ నష్టపోకుండా ఎస్సీ వర్గీకరణతో వారి దశాబ్దాల ఆకాంక్ష నెర

>>2

ప్రజారోగ్యంపై స్పెషల్ ఫోకస్
కుప్పంలో పైలట్ ప్రాజెక్టుగా అమలు
2లో
నారావారిపల్లెలో బాబు ఫ్యామిలీ
రామ్మూర్తినాయుడు సంవత్సరీక కార్యక్రమానికి హాజరు

## తిరుపతి టూ ఢిల్లీ

# ఎర్ర చందనం



ఎర్రచందనం పట్టివేత గురించి మీడియాకు వివరిస్తున్న పోలీసు అధికారులు

### ఎపి, ఢిల్లీ పోలీసుల సంయుక్త ఆపరేషన్
### ఇద్దరు స్మగ్లర్లు అరెస్టు, ఎర్రచందనం సీజ్
### ఢిల్లీ తుగ్లకాబాద్‌లో గోదాముల్లో సోదాలు
### రెడ్ శాండిల్స్ విలువ రూ. 11 కోట్లు పైమాటే
### ఎపి డిజిపి కార్యాలయం ప్రకటన విడుదల

**విజయవాడ,అక్టోబరు 7,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపి, ఢిల్లీ పోలీసుల సంయుక్త ఆపరేషన్‌లో భారీగా ఎర్రచందనం నిల్వలను పట్టుకున్నామని స్పెషల్ టాస్క్ ఫోర్స్ పోలీసులు తెలిపారు. ఈ కథనాన్ని నిర్ధారిస్తూ ఎపి డిజిపి హరీష్‌కుమార్ గుప్తా కార్యాలయంనుంచి ఒక ప్రకటన విడుదల చేసారు. దిల్లీలో తుగ్లకాబాద్‌లోని గోదాములపై నిర్వహించిన దాడుల్లో సుమారు 10 టన్నుల దుంగలను స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. పట్టుకున్న ఏ గ్రేడ్ చందనం విలువ సుమారు రూ. 11 కోట్ల విలువ ఉంటుందని ఈ సందర్భంగా పోలీసు అధికారులు వెల్లడించారు. హైదరాబాద్, ముంబైకి చెందిన ఇద్దరు ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్ట్ చేశామనీ, హరియాణాకు చెందిన మరో నిందితుడు పరారీలో ఉన్నాడని వివరించారు. ఎర్రచందనం తిరుపతి నుంచి ఢిల్లీకి అక్రమంగా తరలించినట్టు గుర్తించామని అధికారులు పేర్కొన్నారు. ఎపి, ఢిల్లీ పోలీసుల సంయుక్త ఆపరేషన్‌లో స్పెషల్ టాస్క్ ఫోర్స్ బృందం భారీగా ఎర్రచందనం నిల్వలను స్వాధీనం చేసుకుంది. ఎపి నుంచి దిల్లీకి తరలించిన సుమారు 10 టన్నుల ఎర్రచందనాన్ని సంబంధిత సమాచారంతో పట్టుకున్నారు.
ఢిల్లీలోని తుగ్లకాబాద్‌లో ఎర్రచందనం బయటపడింది. అంతేకాకుండా ఢిల్లీ, ఎపి పోలీసులు హైదరాబాద్, ముంబయికి చెందిన ఇద్దరు ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టు చేశారు. పోలీసుల అదుపులో ఎర్రచందనం స్మగ్లర్లు ఇర్ఫాన్, అమిత్‌పవార్ ఉన్నారు. అయితే హరియాణాకు చెందిన మరో ఎర్రచందనం స్మగ్లర్ పరారీలో ఉన్నాడు. ఎర్రచందనం దుంగలను తిరుపతి నుంచి ఢిల్లీకి తరలించినట్లు సమాచారం.



మంగళవారం వెంకటాచలంలో మీడియాతో మాట్లాడుతున్న వెంకయ్య నాయుడు

### పార్టీ ఫిరాయింపుల చట్టానికి
# సవరణలు అవసరం
### మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు

**వెంకటాచలం (నెల్లూరు), అక్టోబర్ 7, ప్రభాత వార్త :** సిజెఐపై జరిగిన దాడిని న్యాయ వ్యవస్థపై జరిగిన దాడిగా తాను భావిస్తున్నట్లు మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు అన్నారు. వెంకటాచలం స్వర్ణభారతి ట్రస్ట్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. న్యాయమూర్తి పై జరిగిన దాడి శోచనీయమని దాన్ని తాను గర్హిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఇది ఎంత మాత్రం సమర్థనీయం కాదని

>>2

## పుర'పాలన'
# భేషుగ్గా ఉండాలి

### మౌలిక వసతుల కల్పనపై దృష్టిపెట్టాలి
### తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యంపై స్పెషల్ ఫోకస్
### అర్హులందరికీ టిడ్కో ఇళ్లు పంపిణీ చేయాలి
### మున్సిపల్ కమిషనర్ల వర్క్‌షాప్‌లో మంత్రి నారాయణ



**విజయవాడ,అక్టోబరు 7,ప్రభాతవార్తప్రతినిధి:** పట్టణాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని మంత్రి నారాయణ అన్నారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు సకాలంలో పూర్తయ్యేలా మున్సిపల్ కమిషనర్లు చొరవ తీసుకోవాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్లు, ఇంజినీర్లతో ఆ శాఖ డైరెక్టర్ కార్యాలయంలో మూడు రోజుల పాటు వర్క్ షాప్ జరుగుతుంది. ఈ వర్క్ షాప్‌నకు మంత్రి నారాయణ హాజరయ్యారు. రాష్ట్రంలోని 77 మున్సిపాల్టీల కమిషనర్లు, ఇంజినీర్లతో మూడు రోజుల పాటు వేర్వేరుగా వర్క్ షాప్ జరగనుంది. మొదటి రోజు వర్క్ షాప్‌నకు 29 మున్సిపాల్టీల నుంచి అధికారులు హాజరయ్యారు. పట్టణాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ఈవర్క్ షాప్‌లో ప్రధానంగా చర్చిం

>>2

### సోదరిని ప్రేమించి పెళ్లిచేసుకున్నాడని
# యువకుడి హత్య



మృతుడు గణేష్ (ఫైల్)

### గుంటూరులో ఘటన

**గుంటూరు, అక్టోబరు 7 ప్రభాతవార్త ప్రతినిధి :** సోదరిని ప్రేమించి వివాహం చేసుకున్నాడని కుర్రా గణేష్ అనే యువకుడిని యువతి సోదరుడు దారుణంగా హత్య చేసిన సంఘటన మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. గుంటూరు పొన్నూరు రోడ్డులో ఈ దారుణం జరిగింది. ఈ ఘటనలో యువతి సోదరుడుతో పాటు మరో ఇద్దరు యువకులు ఉన్నట్టు సమాచారం. తెనాలి రూరల్ మండలం కొలకలూరు గ్రామానికి చెందిన అంజలిదేవిని విద్యుత్ శాఖలో ఒప్పంద ఉద్యోగిగా పనిచేస్తున్న గణేష్ ప్రేమించి 12 రోజుల క్రితం పెళ్లిచేసుకున్నాడు. రక్షణ కావాలంటూ నల్లపాడు పోలీసులను ఆశ్రయించాడు. అప్పట్లో ఇద్దరి కుటుంబాలను పిలిచి మాట్లాడారు. అంతా సద్దుమణిగిందని భావించిన తరుణంలోనే తమకుమారుడిని దారుణంగా హతమార్చారని గణేష్ కుటుంబ సభ్యులు ఆరోపించారు. నాగ గణేష్‌ను పోలీస్ స్టేషన్లోనే చంపేస్తా అంటూ యువతి సోదరుడు దుర్గారావు హెచ్చరించాడని తెలిసింది. ఈ క్రమంలోనే గణేష్‌పై దుర్గారావు దాడి చేశాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు ప్రభుత్వ వైద్యశాల శవాగారానికి తరలించారు.

# 10 నుంచి రచ్చబండ

### మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై వైఎస్సార్సీ పోరు ఉధృతం
### ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ
### పార్టీ నేతలతో మాజీ సిఎం జగన్ సమావేశంలో కీలక నిర్ణయం
### 9న నర్సీపట్నం మెడికల్ కాలేజీని సందర్శించనున్న జగన్



**విజయవాడ,అక్టోబరు7,ప్రభాతవార్తప్రతినిధి:** రచ్చబండ కార్యక్రమాల ద్వారా ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా కోటి సంతకాలు సేకరిస్తామని వైఎస్సార్సీ అగ్రనేత, మాజీ సిఎం జగన్ వెల్లడించారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కనీసం ప్రతి పంచాయతీ నుంచి 500 మందితో సంతకాలు సేకరిస్తామన్నారు. మంగళవారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ నేతలతో ఆయన సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన పలు కీలక విషయాలను వెల్లడించారు. అక్టోబరు 9న నర్సీపట్నం మెడికల్ కాలేజీని వైఎస్సార్సీ అధినేత జగన్ సందర్శించనున్నట్లు తెలిపారు. అక్టోబరు 10 నుంచి నవంబర్ 22వరకూ రచ్చబండ కార్యక్రమం చేపట్టనున్నామన్నారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై కరపత్రాలు పంపిణీ చేయనున్నట్టు జగన్ చెప్పారు. అక్టోబరు 28న నియోజకవర్గ కేంద్రాల్లో ర్యాలీలు ఉంటాయి. నియోజకవర్గ స్థాయిలో ఉన్న అధికారికి డిమాండ్ పత్రాలను సమర్పించాలి. జిల్లా కేంద్రాల్లో నవంబరు 12న ర్యాలీలు జరుగుతాయి. ఒక జిల్లాలో నేను కూడా పాల్గొంటాను. నవంబరు 23న నియోజకవర్గ కేంద్రాల నుంచి సేకరించిన సంతకాలు జిల్లా కేంద్రానికి చేరుకుంటాయి. నవంబరు 24న సేకరించిన సంతకాలతో కూడిన వాహనాలను జిల్లా కేంద్రంలో జెండా ఊపి విజయవాడకు తరలిస్తారు. సేకరించిన ఈ సంతకాలు గవర్నర్‌కు అప్పగించే కార్యక్రమం

>>2

ఈసారి ట్రక్కులపై టారిఫ్
25శాతం సుంకాలు విధింపు
నవంబర్ 1 నుంచి అమలు
డొనాల్డ్ ట్రంప్ ప్రకటన
9లో
4 రైల్వే ప్రాజెక్టులకు కేంద్రం గ్రీన్‌సిగ్నల్
మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గుజరాత్, ఛత్తీస్‌గఢ్‌లలో 18 జిల్లాల అనుసంధానం

# ఐటి సోదాల కలకలం

### తెలుగు రాష్ట్రాల్లో 25 చోట్ల అధికారుల తనిఖీలు
### రూ.300 కోట్ల దాల్ ట్రేడ్ స్కాంపై ఆరా
### కొనుగోళ్లు చేయకుండానే నివేదికలు... గుర్తింపు
### కీలక పత్రాలు స్వాధీనం.. కొనసాగుతున్న దాడులు

**సచివాలయం,అక్టోబర్ 7,ప్రభాతవార్త :** రాష్ట్ర వ్యాప్తంగా మరోపెద్ద పప్పుల దందా వెలుగులోకి వచ్చింది. సుమారు రూ.300కోట్ల విలువైన పప్పుల వ్యాపారంలో బారీ అవకతవకలు అక్రమ నగదు లావాదేవీలు జరిగినట్లు గుర్తించిన ఆదాయపు పన్ను మంగళవారం తెల్లవారు జామునే సోదాలు ప్రారంభించింది. విజయవాడ, గుంటూరు, విశాఖపట్నం, కర్నూలు, హైదరాబాద్ నగరాల్లో ఒకేసారి సోదాలు జరిగాయి. పప్పుల సరఫరా పేరుతో ప్రభుత్వ నిధులను మలచినట్లు అనుమానం వ్యక్తమవుతోంది. ఐటి శాఖాధికారులు రాష్ట్రంలోని 25ప్రదేశాల్లో సోదాలు జరిపారు. విశాఖలో హిందూస్తాన్ ట్రేడర్స్, కర్నూల్లో వికేర్ గ్రూప్, గుంటూరులో మరికొన్ని ప్రముఖ పప్పు ట్రేడింగ్ కంపెనీలు దర్యాప్తు కిందకొచ్చాయి. ఒకేసారి పలు బృందాలు పనిచేయడంతో వ్యాపార వర్గాల్లో తీవ్ర కలకలం నెలకొంది. గత ప్రభుత్వ హాయాంలో సివిల్ సప్లయిస్ శాఖ నుంచి టెండర్లు పొంది పెద్దమొత్తంలో పప్పులు సరఫరా చేశామని చూపించి వందల కోట్లు బిల్లు వేసుకున్నట్లు తెలిసింది. చెల్లింపులు అయిన తర్వాత సరఫరా చేయకపోవడం, తక్కువ నాణ్యత గల పప్పులు అందించడం కొన్ని చోట్ల సరఫరానే నిలిపి వేయడం వంటి అంశాలపై అధికారులు విచారణ చేస్తున్నారు.

**ఎన్నికల సమయంలో భారీ క్యాష్ ఉపసంహరణలు**

దర్యాప్తులో ఐటి అధికారులు 2024ఎన్నికల ముందు పెద్దమొత్తం నగదు ఉపసంహరణలు జరిగినట్లు గుర్తించారు. ఈ లావాదేవీల వెనుక రాజకీయ సంబంధాలు ఉన్నాయా? అనే కోణంలో కూడా ఐటి వర్గాలు ఆరా తీస్తున్నాయి. ఐటి దాడుల తర్వాత సివిల్ సప్లైస్ శాఖలోనూ చురుగ్గా కదలికలు ప్రారంభమయ్యాయి. ఏపి టెండర్లు ఎవరికిచ్చారు? చెల్లింపులు ఎప్పుడు జరిగాయి.? అనే వివరాలను అధికారులు తేలుస్తున్నారు.

**రాజకీయ వర్గాల్లో చర్చ**

ఈ దాడులతో రెండు రాష్ట్రాల రాజకీయ వర్గాల్లో చర్చ మొదలైంది. ఎవరి అనుమతితో ఈ టెండర్లు కుదిరాయి? ఎవరి మార్గదర్శకత్వంలో చెల్లింపులు జరిగాయి అనేప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. పలు కంపెనీలు పన్ను ఎగవేత, బోగస్ సరఫరా, హవాలా లావాదే వీల్లో నిమగ్నమైనట్లు ఆధారాలు లభించాయి. పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తాం అని ఐటి అధికారులు స్పష్టం చేశారు.



మంగళవారం ఆది కవి వాల్మీకి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సిఎం చంద్రబాబు

## ఆదికవి వాల్మీకికి సిఎం చంద్రబాబు నివాళి

**విజయవాడ,అక్టోబరు 7,ప్రభాతవార్తప్రతినిధి:** మహర్షి,ఆది కవి వాల్మీకి జ్ఞానం సముపార్జనకు పరిమితి లేదని నిరూపించిన మహనీయుడని సిఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు.వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా ప్రజలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శుభాకాంక్షలు తెలియజేశారు.తన వ్యక్తిగత కార్యాలయంలో వాల్మీకి చిత్రపటానికి సిఎం చంద్రబాబు ఘన నివాళిని అర్పించారు.ఈ సందర్భంగా సోషల్ మీడియా ఎక్స్ వేదికగా సిఎం స్పందిస్తూ.. సృష్టి ఉన్నంత కాలం వాల్మీకి జీవితం స్ఫూర్తిని ఇస్తూనే ఉంటుంది. జ్ఞానం సముపార్జనకు పరిమితిలేదని నిరూపించిన మహనీయుడు వాల్మీకి మహర్షి అని సిఎం చంద్రబాబు కొనియాడారు.సంస్కృతంలో ఆదికవి, పవిత్ర రామాయణ ఇతిహాస రచయిత, మహర్షి వాల్మీకి జయంతి సందర్భంగా సకల జనులకు శుభాకాంక్షలు తెలియచేస్తున్నాను. జ్ఞానం సముపార్జనకు పరిమితిలేదని నిరూపించిన మహనీయుడు వాల్మీకి మహర్షి. పరిస్థితుల ప్రభావం కారణంగా కిరాతకుడిగా వ్యవహరించినా తపస్సుతో మహనీయుడుగా మారి ప్రపంచానికే జ్ఞాన జ్యోతిని చూపించిన కారుణ్యమూర్తి ఆయన. మహర్షి వాల్మీకి జీవితం ఈ సృష్టి ఉన్నంత కాలం స్ఫూర్తినిస్తూనే ఉంటుంది. ఆచంద్రతారార్కం నిలబడిపోయే మహర్షి వాల్మీకి కీర్తిప్రతిష్టల్ని ఆయన జయంతి సందర్భంగా స్మరించుకోవడం మన పూర్వజన్మ సుకృతం. వాల్మీకి మహాకవి విరచిత రామాయణ ఇతిహాసం.. సదా అనుసరణీయం.. ఆదర్శప్రాయమన్నారు. అఖండ భారతావనికి ఆదర్శప్రాయుడై నిలిచిన.. లోకభిరాముని దివ్యచరితను లోకొత్తరం చేసిన ఆదికవి వాల్మీకి మహర్షి అని తెలిపారు. కృషి ఉంటే మనుషులు.. రుషులవుతారు.. మహాపురుషులవుతారన్న మాటలకు వాల్మీకి మహర్షి జీవితం ఒక ప్రత్యక్ష నిదర్శనమని చెప్పుకొచ్చారు. ఆ మహనీయునికి ఘన నివాళిగా రాష్ట్ర పండుగగా వాల్మీకి జయంతిని నిర్వహించిన ఘనత కూటమి ప్రభుత్వానిదే అన్నారు.

## సవీందర్ రెడ్డిపై తదుపరి చర్యలొద్దు

### - సిబిఐకి సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు

**విజయవాడ,అక్టోబరు 7,ప్రభాతవార్తప్రతినిధి:** సోషల్ మీడియా యాక్టివిస్టు సవీందర్‌రెడ్డి వ్యవహారంలో సిబిఐ తదుపరి కార్యాచరణ చేపట్టొద్దని సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. సవీందర్‌రెడ్డిని అక్రమంగా అరెస్టు చేయడంపై దాఖలైన హెబియస్ కార్పస్‌పై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై సుప్రీంకోర్టు మంగళవారం విచారణ జరిపింది. ఏపీ హైకోర్టు ఉత్తర్వులను సుప్రీంకోర్టులో వ్యక్తిగత హోదాలో సవాలు చేశారు దర్యాప్తు అధికారి గన్నవరపు శ్రీనివాసరావు. ఈ పిటిషన్‌పై జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ సతీష్ చంద్ర శర్మ విచారణ చేపట్టారు. సామాజిక మధ్యమాల్లో పోస్టు పెట్టినందుకు అక్రమంగా అరెస్టు చేశారని హైకోర్టులో సవీంద్రరెడ్డి భార్య లక్ష్మీ ప్రసన్న పిటిషన్ దాఖలు చేశారు. సవీంద్రరెడ్డిని అరెస్టు చేసింది.. గంజాయి కేసులో అరెస్టు చేశారని సుప్రీంకోర్టుకు ఏపీ ప్రభుత్వం, దర్యాప్తు అధికారి తరపు న్యాయవాదులు నివేదించారు. ఒక రాజకీయ పార్టీకి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టాడని అరెస్టు చేసి... తర్వాత గంజాయి కేసులో ఇరికించారని సవీంద్రరెడ్డి తరపు న్యాయవాది న్యాయస్థానానికి తెలిపారు. అదే విషయాన్ని హైకోర్టు పరిశీలించిన తర్వాతే సీబీఐ విచారణకు ఆదేశించిందని న్యాయవాది పేర్కొన్నారు. దర్యాప్తు అధికారి వ్యక్తిగత హోదాలో పిటిషన్ ఫైల్ చేశారని, ఇది నిబంధనలకు విరుద్ధమని సవీంద్రరెడ్డి న్యాయవాది వివరించారు.గంజాయి కేసులో అరెస్టు చేస్తే... దానికి రాజకీయ కారణాలు అన్వయిస్తున్నారని ఏపీ ప్రభుత్వం తరపు సీనియర్ న్యాయవాది సిద్దార్థ లూథ్ర న్యాయస్థానానికి తెలిపారు. ఇరువురి వాదనలు పరిగణనలోకి తీసుకుని జస్టిస్ ఎంఎం సుందరేష్ ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వులను జారీ చేసింది. ప్రతివాదులకు నోటీసులు జారీ చేయడంతోపాటు... సిబిఐ తదుపరి కార్యచరణ చేపట్టవద్దని ఆదేశించింది ధర్మాసనం. ప్రతివాదులుగా ఏపీ ప్రభుత్వం, డిజిపి, సిబిఐ, రిలయన్స్ జియో సంస్థతో పాటు... మొత్తం 11 మందిని ఈ కేసులో దర్యాప్తు అధికారి చేర్చారు. ఈ కేసులో పిటిషన్ దాఖలు చేసేందుకు ఎపి ప్రభుత్వానికి అనుమతి ఇచ్చింది ధర్మాసనం. ఈ పిటిషన్‌పై తదుపరి విచారణ త్వరలోనే చేపడతామని సుప్రీంకోర్టు వాయిదా వేసింది.

## పుర'పాలన' భేషుగ్గా ఉండాలి

>> చారు. 2029 లోగా పూర్తి చేయాల్సిన అభివృద్ధి ప్రాజెక్టులపై అధికారులకు పలు సూచనలు చేసారు. ఆ తర్వాత పట్టణాభివృద్ధిపై అధికారులకు మంత్రి నారాయణ దిశానిర్దేశం చేసారు.మున్సిపాలిటీల్లో ఘన,ద్రవ వ్యర్థాల నిర్వహణ,డ్రైనేజి,రోడ్లు,వీధిదీపాల నిర్వహణ పక్కాగాచేపట్టాలని మంత్రి అధికారులకు సూచించారు. రాష్ట్రంలో పేరుకుపోయిన లెగసీ వేస్ట్ 85 లక్షల మెట్రిక్ టన్నులు ఇప్పటికే తొలగించగా.. మరో 20 లక్షల టన్నుల లెగసీ వేస్ట్‌ను డిసెంబరు నెలాఖరుకు తొలగిస్తామన్నారు. జనవరి నుంచి ఘన వ్యర్థాలు పూర్తిగా ప్రాసెస్ చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అలాగే ప్రస్తుతం ఉన్న రెండు వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లలకు అదనంగా కొత్తగా మరో 6 ప్లాంట్లను ఏర్పాటుచేస్తున్నామని. ఇవన్నీ పూర్తయితే రాష్ట్రంలోని మున్సిపాలిటీలు డంపింగ్ యార్డ్ రహితంగా మారతాయన్నారు.

**ద్రవ వ్యర్థాల నిర్వహణ అత్యంత కీలకం: మంత్రి నారాయణ**

ప్రతిరోజూ ఇళ్లలో ఉపయోగించిన నీటితో పాటు వర్షపు నీరు కోసం కాలువల నిర్మాణం చేపడుతున్నామన్నారు. అమృత్ పథకం 2 ద్వారా మున్సిపాలిటీల్లో రాబోయే రెండేళ్లలో 90 శాతం ఇళ్లకు తాగునీరు అందించేలా ముందుకెళ్తున్నామన్నారు..ఇక డ్రైనేజిలు,రోడ్లు,వీధి దీపాల కోసం వివిధ పథకాల నిధులతో పాటు మున్సిపాలిటీల నిధులు వినియోగించాల్సి ఉందన్నారు.ప్రాధాన్యతా క్రమంలో ఈ అభివృద్ధి పనులను పూర్తి చేయాలి..అమృత్,ఆసియన్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ అండ్ ఇన్వెస్ట్ మెంట్ బ్యాంక్ ,అర్బన్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ డెవలప్ మెంట్ నిధుల ద్వారా డ్రింకింగ్ వాటర్,డ్రైనేజి నిర్మాణాలు చేపడుతున్నామని తెలిపారు. మరోవైపు మున్సిపాలిటీల్లో టిడ్కో ఇళ్ల నిర్మాణం,ప్రస్తుత పరిస్థితిపైనా అధికారులకు పలు సూచనలు చేసారు. నిర్మాణాలు పూర్తవుతున్న ఇళ్లను ప్రతి శనివారం లబ్దిదారులకు కేటాయించాలని ఆదేశించారు. వచ్చే జూన్ నాటికి టిడ్కో ఇళ్ల నిర్మాణం వంద శాతం పూర్తి చేయాలని సూచించారు. బుధవారం,గురువారం మరికొన్ని మున్సిపాలిటీల అధికారులతో జరిగే వర్క్ షాప్‌లోనూ మంత్రి నారాయణ పాల్గొన్నారు. ఈ వర్క్ షాప్‌లో మున్సిపల్ శాఖ డైరెక్టర్ సంపత్ కుమార్,టిడ్కో ఎండీ సునీల్ కుమార్ రెడ్డి,ప్రజారోగ్య విభాగం ఇంజినీర్ ఇన్ చీఫ్ ప్రభాకర రావు పాల్గొన్నారు.

## సవరణలు అవసరం

>> ఆయన అన్నారు. దేశంలో పార్టీ ఫిరాయింపులు పెరిగాయని ఇది ప్రజాస్వామ్య వ్యవస్థకు చేటు అని వెంకయ్య నాయుడు అన్నారు. ఈ సమస్య ఈనాటిది కాదని దాదాపు అన్ని రాష్ట్రాల్లో ఉందని ఆయన అన్నారు. పార్టీ ఫిరాయించిన వారు తాము గెలిచిన పార్టీకి పదవికి రాజీనామా చేయాలన్నారు. లేదంటే వారిని పదవికి అనర్హులుగా ప్రకటించేలా 10 వ షెడ్యూల్ ను సవరించాలని ఆయన సూచించారు. లేదంటే ప్రభుత్వాలు కూలిపోయి రాష్ట్రాల్లో అస్థిరత నెలకొంటుందని తద్వారా ఆర్థిక భారం కూడా పెరుగుతుందని నాయుడు చెప్పారు. ఇది దేశ రాజకీయాల్లో ఆందోళన కలిగించే విషయమని ఆయన అభిప్రాయపడ్డారు. ఉచిత పథకాలు అభివృద్ధి నిరోధకాలని ఆయన అన్నారు. రాజకీయ పార్టీలు తమ ఉనికి కోసం పోటీపడి ఉచిత పథకాలను ప్రకటించడమే కాకుండా అమలు చేస్తున్నాయని వెంకయ్య నాయుడు అన్నారు. ప్రజలకు భారమైన విద్య, వైద్యం ఉచితంగా అందించగలిగినప్పుడే సమాజంలో అసమానతలు రూపు మాపవచ్చన్నారు. కోర్టులు కేసుల విషయంలో వాయిదాలు ఎక్కువగా వేసి తీర్పులు జాప్యం జరిగే విధంగా వ్యవహరిస్తున్నాయన్నారు. కేసుల విచారణలో జాప్యం జరగకుండా ఉండాలంటే మరిన్ని అదనపు కోర్టులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని వెంకయ్య నాయుడు అభిప్రాయపడ్డారు.

## 'సిజెఐ గవాయ్‌పై దాడిని ఖండించాలి'

**విజయవాడ, అక్టోబరు 7, ప్రభాతవార్త :** సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ గవాయ్‌పై అగ్రవర్ణాల వారు చెప్పుతో దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని రిపబ్లిక్ అని పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర కన్వీనర్ పేరం శివ నాగేశ్వరరావు గౌడ్ తీవ్రంగా ఖండించారు. ఇటువంటి ఘటనలు పునరావృ తం కాకుండా తీవ్రంగా శిక్షి ంచాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలో నీటి అవసరత దృష్ట్యా చెక్ డ్యాముల నిర్మాణం అవసరం ఉందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర కన్వీనర్ పేరం శివ నాగేశ్వరరావు గౌడ్ ఆధ్వర్యంలో గాంధీనగర్ స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారత చీఫ్ జస్టిస్ గవాయ్‌పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని, ఇలాంటి ఘటనలు ఇంకెప్పుడు జరగకుండా దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇది న్యాయ వ్యవస్థకే సిగ్గుచేటన్నారు.

సుప్రీం కోర్టు జడ్జికే రక్షణ కరువైందని ప్రజలు వారి మనోవేదనకు గురయ్యారన్నారు. గత 180 ఏళ్ల చరిత్రలో వరుసుగా 3 లేదా 4 సంవత్సరాలు వర్షాలు పడకపోవడం వల్ల కరువు తాండవించిన ఘటనలు ఉన్నాయన్నారు. ఈ నేపథ్యంలోనే నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్మాణం జరిగిందన్నారు. రాజధాని అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో నీటి అవసరం పెరిగిందన్నారు. లక్షల క్యూసెక్కుల నీరు వర్షాకాలంలో సముద్రం పాలవుతుందన్నారు. బిజెపి ఆధ్వర్యంలో నదులు అనుసంధానం జరుగుతుం దన్నారు. కానీ రాష్ట్రంలో నీటి ప్రాజెక్టుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం అశ్రద్ధ వహిస్తుందన్నారు. జగ్గయ్యపేట నుండి కృష్ణానదిపై చెక్ డ్యాముల నిర్మాణం ద్వారా నీటి లభ్యత పెంచుకోవచ్చు అన్నారు. ఈ విషయమై ప్రభుత్వానికి అనేక మార్లు వినతి పత్రాలు ఇచ్చామన్నారు. అయినా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పందించలేదన్నారు. యుద్ధ ప్రాతిపదికన ప్రాజెక్టుల నిర్మాణం చేయాలని విజ్ఞప్తి చేశారు. లేకుంటే రిపబ్లిక్ అన్ పార్టీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిరాహార దీక్షలు చేయాల్సిన పరిస్థితి వస్తుందన్నారు.



మంగళవారం నారావారిపల్లెలో రామ్మోహన్‌నాయుడు సమాధివద్ద చంద్రబాబు కుటుంబసభ్యుల నివాళి

## నారావారిపల్లెలో బాబు ఫ్యామిలీ

### రామ్మూర్తినాయుడు సంవత్సిరక కార్యక్రమానికి హాజరు

**చంద్రగిరి, అక్టోబరు 7 ప్రభాతవార్త:** దివంగత మాజీ ఎంఎల్ఎ నారా రామ్మూర్తి నాయుడు సంవత్సరిక (11వ నెల విస్తరి) కార్యక్రమం (మొదటి వర్ధంతి)బ్రాహ్మణులు హైందవ సంప్రదాయ పద్ధతిన జరిపించారు. తిరుపతి జిల్లా, చంద్రగిరి మండలం, నారావారిపల్లిలోని తమ నివాసంలో మంగళవారం జరిగిన సంవత్సరిక కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, నారా భువనేశ్వరీ, నారా లోకేష్ హాజరై ఆద్యంతం కార్యక్రమాన్ని తిలకించి, నివాళులర్పించారు. సినీ హీరో, రామ్మూర్తి నాయుడు తనయుడు నారా రోహిత్, నారా గిరీష్‌లు సంయుక్తంగా తండ్రి సంవత్సరిక కార్యక్రమంలో సంతర్పణలు సమర్పించారు. అనంతరం స్మృతివనం వద్దకు చేరుకున్న చంద్రబాబు, భువనేశ్వరీ, లోకేష్, రోహిత్, గిరీష్, కుటుంబ సభ్యులు దివంగత నారా రామ్మూర్తి నాయుడు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, కర్పూరహారతులిచ్చి, నివాళులర్పించారు. ఈ వేడుకలకు పెద్ద ఎత్తున నారావారి బంధుమిత్రులు హాజరై దివంగత నారా రామ్మూర్తి నాయుడుకు నివాళులర్పించారు.

## చార్జిషీట్ వేయడానికి ఇంకెన్నాళ్లు కావాలి?

### నల్లపాడు పోలీసుల తీరుపై హైకోర్టు అసంతృప్తి

**విజయవాడ,అక్టోబరు 7,ప్రభాతవార్తప్రతినిధి:** గుంటూరు జిల్లా నల్లపాడు పోలీసులపై ఎపి హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది.ఓ యువతి అనుమానాస్పద మృతి కేసులో దర్యాప్తు పూర్తి చేసినప్పటికీ అభియోగపత్రం/తుది నివేదికను సంబంధిత కోర్టులో దాఖలు చేయకపోవడంపై నల్లపాడు పోలీసుల వ్యవహార సరళి సరిగ్గా లేదని వ్యాఖ్యానించింది. భవనంపై నుండి పడిపోయినట్లు అనుమానాస్పద పరిస్థితులో చనిపోయిన మృతురాలే వాంగ్మూలం ఇచ్చినట్లు పోలీసులు కొత్త కథ అల్లారని పేర్కొంది. ఆస్పత్రికి తీసుకొచ్చే సమయానికి ఆ యువతి మృతి చెందితే ఆమె మరణ వాంగ్మూలాన్ని ఎవరు ఎలా నమోదు చేశారని పోలీసులను ప్రశ్నించింది. కోర్టులన్నా, కోర్టు ఉత్తర్వులన్నా,సిబ్బందన్నా పోలీసులకు గౌరవం లేదని ఘాటుగా వ్యాఖ్యానించింది. పోలీసులు దాఖలు చేసిన అఫిడవిట్‌ను పరిశీలించి వాదనలు వినిపించేందుకు పిటీషనర్ తరపు న్యాయవాదికి సమయం ఇస్తూ విచారణను ఈ నెల 10కి వాయిదా వేసింది. న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్ సోమవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు. గుంటూరు జిల్లా బుడంపాడు సెయింట్ మేరీ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో పాలిటెక్నిక్ మొదటి సంవత్సరం చదువుతున్న గర్నెపూడి శ్రావణసంధ్య (17) కళాశాల వసతి గృహం లోని 4వ అంతస్థు నుంచి పడిపోయారని వార్డెన్ నుండి తల్లిదండ్రులకు 2017 ఫిబ్రవరి 28న ఫోన్‌కాల్ అందింది. ఈ వ్యవహారంపై నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. వారు దర్యాప్తు సక్రమంగా చేయడం లేదని సిబీఐ లేదా సిఐడికి కేసు ఇవ్వాలని మృతురాలి తల్లి జయలక్ష్మి 2017 జులైఊలో హైకోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. ఇటీవల వ్యాజ్యంపై విచారణ జరిపిన హైకోర్టు...దర్యాప్తును సీబీఐకి ఇవ్వడానికి ఇది సముచితమైన కేసు అని అభిప్రాయపడింది. సోమవారం జరిగిన విచారణలో పోలీసుల తరపున హోం శాఖ జీపీ జయంతి వాదనలు వినిపిస్తూ కేసు దర్యాప్తు పూర్తి చేశామని తెలిపారు. అలా అయితే ఛార్జిషీట్ ఎందుకు వేయలేదని న్యాయమూర్తి ప్రశ్నించారు. హైకోర్టులో వ్యాజ్యం పెండింగ్‌లో ఉన్న కారణంగా దాఖలు చేయలేదని జిపి బదులివ్వగా అభియోగపత్రం దాఖలు చేయకూడదంటూ కోర్టు నుంచి నిషేధ ఉత్తర్వులు ఏమీ లేవు కదా అని పోలీసులను న్యాయమూర్తి ప్రశ్నించారు.

## సిజెఐపై దాడిని ఖండించిన సిఎం, డి.సిఎం

**విజయవాడ,అక్టోబరు 7,ప్రభాతవార్తప్రతినిధి:** సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బిఆర్ గవాయ్ పై కోర్టులో జరిగిన దాడిని సిఎం, డి.సిఎంలు ఖండించారు. చీఫ్ జస్టిస్ బిఆర్ గవాయ్‌పై కోర్టులో జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తునట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్‌లో చేసిన పోస్టులో ఇటువంటి చర్యలు ఆమోదయోగ్యం కాదని, నాగరిక, ప్రజాస్వామ్య సమాజంలో వాటికి స్థానం లేదని పేర్కొన్నారు. మన న్యాయవ్యవస్థ గౌరవాన్ని నిలబెట్టడం ప్రజాస్వామ్యంలో ప్రథమ కర్తవ్యమన్నారు.

**దాడికి యత్నించడాన్ని ఖండిస్తున్నాం: డి.సిఎం పవన్**

సుప్రీంకోర్టు సిజెఐపై కోర్టు లోపల దాడికి జరిగిన ప్రయత్నాన్ని తాను తీవ్రంగా ఖండిస్తున్నట్లు డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. సనాతన జ్ఞానం వ్యవహార (చట్టానికి కట్టుబడి ఉండటం), రాజ్యాంగబద్ధమైన చట్టానికి లోబడి ఉండాలని కోరుతుందన్నారు.

**దాడి సిగ్గుచేటు : లోకేష్**

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి జరగడం సిగ్గుచేటని విద్యాశాఖ మంత్రి లోకేష్ పేర్కొన్నారు. న్యాయవ్యవస్థను బెదిరించే ఇటువంటి ప్రయత్నాలకు ప్రజాస్వామ్యంలో స్థానం లేదని, వాటిని కఠినంగా ఎదుర్కోవాలని ఆయన పేర్కొన్నారు.

**అత్యున్నత న్యాయ సంస్థకు అవమానం: జగన్**

ఇది ఒక వ్యక్తిపై జరిగిన దాడి కాదని, అత్యున్నత న్యాయ సంస్థకు జరిగిన అవమానమని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేర్కొన్నారు.

**సనాతనం పేరుతో దాడి : ఆలిండియా లాయర్స్ యూనియన్ ఖండన**

సుప్రీం కోర్టు సిజెఐ గవాయ్ పై కోర్టులో దాడికి యత్నించడాన్ని న్యాయ వ్యవస్థ, రాజ్యాంగంపై జరిగిన దాడిగానే భావించాల్సి ఉంటుందని ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలు) నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర రాజేంద్రప్రసాద్, రాష్ట్ర అధ్యక్ష, జనరల్ సెక్రటరీలు కె కుమార్, ఎన్ మాధవరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఘటనను తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

## మోహిత్ రెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్ కొట్టివేత

**విజయవాడ,అక్టోబరు 7,ప్రభాతవార్తప్రతినిధి:**ఆంధ్రప్రదేశ్ మద్యం కుంభకోణం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో వైసీపీ నేత చెవిరెడ్డి మోహిత్ రెడ్డికి తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని హైకోర్టును ఆశ్రయించారు.. ఈ మేరకు మోహిత్ రెడ్డి పిటిషన్‌పై మంగళవారం విచారణ జరిగింది. విచారణ చేపట్టిన న్యాయస్థానం ముందస్తు బెయిల్ మంజూరు చేసేందుకు నిరాకరించింది. సుదీర్ఘ వాదనల అనంతరం ఇవాళ ముందస్తు బెయిల్ పిటీషన్‌ను హైకోర్టుకొట్టివేసింది. మద్యం కుంభ కోణంకేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ మోహిత్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయిం చారు. తుడా చైర్మన్‌గా ఉండగా మద్యం ముడుపులు తరలించేందుకు అధికార వాహనాలు వాడారనేది తనపై ఆరోపణలు ఉన్నాయి. తన ప్రతిష్ఠను దిగజార్చేందుకు కేసులో ఇరికించారని, దర్యాప్తుకు సహకరిస్తానని, కోర్టు విధించే షరతులకు కట్టుబడి ఉంటానని మోహిత్‌రెడ్డి తెలిపారు. ఈ అంశాలు పరిగణనలోకి తీసుకొని తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని హైకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు ఇవాళ విచారణ చేపట్టి న్యాయస్థానం పిటిషన్‌ను కొట్టివేసింది.

## ప్రజారోగ్యంపై స్పెషల్ ఫోకస్

### నేటినుంచి 45 రోజుల పాటు శిబిరాలు

**కుప్పం, అక్టోబరు 7 ప్రభాతవార్త :** సిఎం చంద్రబాబునాయుడు తన సొంత నియోజకవర్గం కుప్పంలో ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్న విషయం విదితమే. ఇప్పటికే కుప్పం ప్రజల సౌకర్యార్థం రాష్ట్రంలోనే తొలిసారిగా టాటా డిజిటల్ నెర్వ్ సెంటర్ (డిఐఎన్‌సి)ను ప్రారంభించారు. ఇప్పుడు మరో మారు కుప్పంలో సార్వత్రిక ఆరోగ్య పరీక్షలు పేరిట మరో కార్యక్రమానికి శ్రీకారంచుట్టారు. బుధవారం నుంచి కుప్పం నియోజకవర్గంలో 45 రోజులపాటు వైద్య శిబిరాలు నిర్వహిస్తారు.కుప్పం నియోజక వర్గ ంలోని తొమ్మిది పిహెచ్‌సి కేంద్రాలు, కుప్పం ఏరియా ఆస్పత్రిలో ఈ శిబిరాలు నిర్వహిస్తారు. ప్రజలకు బిపి, చక్కెర వా ్యధి, కొలెస్ట్రాల్, మూత్రపిండాలు, కాలేయం పరీక్షలు,సిబిసి పరీక్షలతో పాటు రక్తాన్నిసేకరించి 47 రకాల రక్త, ఇతర వైద్య పరీక్షలు చేయనున్నారు. తద్వారా ఎవరెవరికి ఏయే వ్యాధులు ఉన్నాయో గుర్తించి తదనంతరం వారికి అవసరమైన వైద్య చికిత్సలు నిర్వహించనున్నారు. ఈ శిబిరాలకు హాజరయ్యే ప్రజల ఆరోగ్య వివరాలన్నీ డిజిటలైజ్ చేయనున్నారు. వీటిని కేంద్ర ప్రభుత్వం యొక్క అభా కార్డుతో అనుసంధానం చేస్తారు. సుమారు తొంభై వేలమందికి వైద్య పరీక్షలు చేయాలని నిర్ణయించారు. కాగా కుప్పం ప్రాంతంలోని ప్రజల సౌకర్యార్థం ఇదివరకే సిఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలతో బసవతారకం ఇండో - అమెరికన్ కేన్సర్ ఇనిస్టిట్యూట్ ఛైర్మన్, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సహకారంతో గత నెలలో ఉచితంగా కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు సైత ంచేపట్టిన విషయం విదితమే. ఏది ఏమైనా కుప్పం ప్రజల ఆరోగ్యంపై సిఎం చంద్రబాబునాయుడు ప్రత్యేక దృష్టి సారించడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## డబుల్ సంక్షేమం

>> వేర్చాం. 'అడవితల్లి బాటలో' కార్యక్రమం ద్వారా రూ.1,000 కోట్లతో రోడ్ల నిర్మాణం చేపట్టాం. మారుమూల గిరిజన ప్రాంతాలను ప్రధాన రహదారులతో కనెక్ట్ చేస్తున్నాం. ఇమామ్‌లకు రూ.10,000, మోజన్లకు రూ.5,000 చొప్పున గౌరవవేతనం ఇస్తున్నాం అని వివరించారు.భావ ప్రకటనా స్వేచ్ఛ పేరుతో సోషల్ మీడియాలో మహిళలపై అసభ్యకర పోస్టులు పెడితే కఠినంగా వ్యవహరిస్తున్నాం. మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడుతున్నాం. 2027 డిసెంబర్ నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తాం. కేంద్ర ప్రభుత్వం రూ.12,157 కోట్ల నిధులు విడుదల చేసి సకాలంలో పనులు జరిగేందుకు సహకరించింది. ప్రకాశం జిల్లాను కరువు నుంచి బయటపడేసే వెలుగొండ ప్రాజెక్టుకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నాం. వచ్చే ఏడాది జులై కల్లా సాగునీరు ఇచ్చేలా ప్రాజెక్టు పనులు చేస్తున్నాం. రాయలసీమను సస్యశ్యామలం చేసేందుకు గోదావరి వృధా జలాలను పోలవరం నుంచి బనకచర్లకు మళ్లించాలని నిర్ణయించాం. సముద్రంలోకి వృథాగా పోయే నీటినే వినియోగిస్తాం. ఈ ప్రాజెక్టుతో ఏ రాష్ట్ర నీటి ప్రయోజనాలకు నష్టం వాటిల్లదు. ఎవరూ అభ్యంతరం చెప్పాల్సిన అవసరం లేదు. వరదలు వచ్చినప్పుడు ఎగువ రాష్ట్రాలు నీటిని విడుదల చేస్తే దిగువ రాష్ట్రంగా ఆ నష్టాలను, కష్టాలను భరిస్తున్నాం. దిగువ రాష్ట్రంగా అదే వరద నీటిని వాడుకుంటామంటే అభ్యంతరాలు ఎందుకు? వరదను భరించాలి కానీ, వరద నీటితో ప్రయోజనం పొందకూడదంటే ఎలా కుదురుతుంది? గ్రామీణ ప్రాంతాల్లో 4,000 కిలోమీటర్ల సీసీ రోడ్లు, 250 కిలోమీటర్ల బీటీ రోడ్లు నిర్మించాం. 2028 నాటికి 'జల జీవన్ మిషన్' కింద ప్రతి పల్లెకు, ప్రతి గడపకు సురక్షిత మంచినీరు అందిస్తాం. ఆరోగ్యాంధ్రప్రదేశ్ అనేది మా విధానం. ప్రివెంటివ్, క్యూరేటివ్, కాస్ట్ ఎఫెక్టివ్, రియల్ టైమ్ మానిటరింగ్ విధానాలతో ప్రజారోగ్యానికి సంజీవనిగా వైద్యశాఖను తీర్చిదిద్దాం. మానవత్వంతో స్పందించి సీఎం సహాయ నిధి నుంచి ఇప్పటివరకూ రూ.552 కోట్లు అందించాం.

రాష్ట్రానికి గ్రోత్ ఇంజిన్లుగా నగరాలు, పట్టణ ప్రాంతాలను అభివృద్ధి చేస్తున్నాం. భవన నిర్మాణాలకు అనుమతులు సులభతరం చేశాం. 100 గజాల్లోపు స్థలాల్లో ఎటువంటి బిల్డింగ్ ప్లాన్ లేకుండానే ఇంటిని నిర్మించుకునే అవకాశాన్ని కల్పించాం. ఎపి బ్రాండ్‌ను పునరుద్ధరించటమే కూటమి ప్రభుత్వ ఆశయం. పారిశ్రామికవేత్తలకు నమ్మకాన్ని కలిగించి తిరిగి రాష్ట్రానికి పెట్టుబడులు వచ్చేలా కృషి చేస్తున్నాం. ఇప్పటి వరకు 9 స్టేట్ ఇన్వెస్టిమెంట్ ప్రమోషన్ బోర్డు సమావేశాలు నిర్వహించాం.113 ప్రాజెక్టులకు సంబంధించి రూ.5.94 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపాం. వీటి ద్వారా 5.56 లక్షల ఉద్యోగాలు వస్తాయి. దేవాలయాలు సంస్కృతికి చిహ్నాలు, ఆధ్యాత్మిక కేంద్రాలు.. 6 వేలకు పైగా ఆలయాల్లో నిత్యం ధూపదీప నైవేద్యాలకు రూ.10 వేల చొప్పున నిధులు విడుదల చేస్తున్నాం. అర్చకుల వేతనాల్ని రూ.15 వేలకు పెంచాం. ఆలయాల్లో అన్యమతస్తులు లేకుండా చూస్తున్నాం. ఉచిత ఇసుకు విధానం అమలు చేసి.. భవన నిర్మాణ రంగాన్ని నిలబెట్టాం. ఇప్పటివరకు 1.5 కోట్ల మెట్రిక్ టన్నుల ఇసుక అందించాం. ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకునే మద్యం పాలసీని రూపొందించాం. నాణ్యమైన, బ్రాండెడ్ మద్యం విక్రయాలు జరిగేలా చూస్తున్నాం.నవ్యాంధ్రకు దిగ్గజ ఐటీ కంపెనీలైన గూగుల్, టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి సంస్థలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చాయి. ప్రజాపాలనలో సాంకేతికతను విస్తృతం చేశాం. వాట్సప్ గవర్నెన్స్-మన మిత్ర ద్వారా పరిపాలనలో కొత్తదనాన్ని తీసుకువచ్చాం. 700 పౌర సేవలు వాట్సప్ గవర్నెన్స్ ద్వారా అందిస్తున్నామని తెలిపారు. అనంతరం ఆయన నారా వారి పల్లె గ్రామానికి తన తమ్ముని సంవత్సరీకాల్లో పాల్గొనేందుకు వెళ్లారు.

## 10 నుంచి రచ్చబండ

>> తదుపరి జరుగుతుంది అని వైఎస్ జగన్ తెలిపారు. వైఎస్సార్సీ హయాంలో విద్యార్థుల డ్రాపౌట్లు లేవు. కూటమి పాలనలో ప్రభుత్వ స్కూళ్లలో ఐదు లక్షల మంది విద్యార్థులు తగ్గిపోయారు. రైతులు ఎరువుల కోసం రోడ్డెక్కుతున్నారు. ఎరువుల పంపిణీలో కూడా స్కాంలు జరుగుతున్నాయి. దళారీలతో చేతులు కలిపారు. ప్రజారోగ్య వ్యవస్థను పూర్తిగా దెబ్బతీశారు. పేదలను ఇంకా అన్యాయం చేస్తున్నారు. వారిని మరింత పేదరికంలోని నెడుతున్నారు అని జగన్ మండిపడ్డారు.

భవిష్యత్తులో కూడా ఉచితంగా నాణ్యమైన వైద్యం అందనీయకుండా కూటమి ప్రభుత్వం చేస్తున్నదని విమర్శించారు. ప్రతి జిల్లాల్లో గవర్నమెంటు కాలేజీ ఉండాలన్న సంకల్పంతో వైఎస్సార్సీ హయాంలో 17 మెడికల్ కాలేజీలు పెట్టాం. ప్రభుత్వం స్కూళ్లు, ఆస్పత్రులు, బస్సులు ఎందుకు నడుపుతుంది? అలా చేయకపోతే ప్రైవేటు వాళ్లు ప్రజలను దోచుకుంటారు. ఇవి నడపకపోతే ప్రజలు తీవ్రంగా నష్టపోతారు. ఈ విషయాన్ని ప్రజలకు బాగా అర్థమయ్యేలా చెప్పాలి అని జగన్ సూచించారు. అమరావతికి 50వేల ఎకరాలు సరిపోవని, మరో 50వేల ఎకరాలు సిఎం చంద్రబాబు సేకరిస్తున్నారు. మొదటి 50 వేల ఎకరాలకే మౌలిక సదుపాయాల కోసం రూ.1లక్ష కోట్లు ఖర్చు అవుతుందని చంద్రబాబు చెప్పారు. ఇప్పుడు కేవలం మౌలిక సదుపాయాలకే రూ. 2 లక్షల కోట్లు అవుతుందని చెప్తున్నారు. అలాంటి లక్షల మందికి, కోట్ల మందికి వైద్యం అందించి, చిరస్థాయిగా నిలబడే ఆస్తులైన మెడికల్ కాలేజీలను అప్పనంగా అమ్మేస్తున్నారు? ఐదేళ్లలో రూ.5వేల కోట్లు పెట్టలేరా? ఇవన్నీ ప్రజల్లోకి తీసుకెళ్లాలి, ప్రజల్లో చైతన్యం చేయాల్సిన అవసరం ఉంది అని నేతలను ఉద్దేశించి జగన్ అన్నారు.

**వైయస్ జగన్‌ను కలిసిన కాకినాడ మత్స్యకారులు**

బోటు కొనుక్కోవడానికి కన్యాకుమారి వెళ్లి, బోటుతో సహా తిరిగి వస్తుండగా, తమ జలాల్లోకి ప్రవేశించారంటూ కాకినాడకు చెందిన నలుగురు మత్స్యకారులను శ్రీలంక కోస్టుగార్డు సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. ఆ సమయంలో బోటులో చేపలు కూడా లేనప్పటికీ, వారిని శ్రీలంక కోర్టులో ప్రవేశపెట్టడంతో జైలుకు పంపారు. విషయాన్ని ఇక్కడ తమ వారికి తెలియజేయడంతో, వైయస్సార్ నాయకుడు, కాకినాడ రూరల్ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి చొరవ తీసుకున్నారు. ఇక్కడి అధికారులకు పూర్తి వివరాలు చెప్పి, శ్రీలంక అధికారులకు సమాచారం పంపించారు. దీంతో 54 రోజుల తర్వాత కాకినాడకు చెందిన నలుగురు మత్స్యకారులు శ్రీలంక జైలు నుంచి విడుదలయ్యారు.

శ్రీలంక జైలు నుంచి తమ విడుదలకు చొరవ చూపించిన ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేసిన వారు, మంగళవారం వైయస్సార్సీ కేంద్ర కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి, పార్టీ అధ్యక్షుడు వైయస్ జగన్ మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. మాజీమంత్రులు కురసాల కన్న బాబు, దాడిశెట్టి రాజా ఆధ్వర్యంలో వైయస్ జగన్‌ను కలిసిన మత్స్యకారులు పంతాడ బ్రహ్మానందం, పి. శ్రీను.. తాము శ్రీలంక చెర నుంచి వైయస్సార్సీ చొరవ వల్లే బయటపడినట్లు చెప్పారు. వైయస్సార్సీ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్.చక్రవర్తి, కృష్ణా జిల్లా మత్స్యకార సంఘం నాయకుడు కోలా హరికృష్ణ తదితరులు వైయస్ జగన్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

## వారం - వర్జ్యం

08-10-2025, బుధవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆశ్వయుజ మాసం, దక్షిణాయణం
శరదృతువు, కృష్ణపక్షం
విదియ రా.2.23
అశ్విని రా.10.44
వర్జ్యం : ఉ.7.16-8.41
దు.ఉ.11.32-12.20
శుభసమయం: ఉ.5.30-6.30
రాహుకాలం - మ.12.00-1.30

## వార్తాఫలం

**మేషం :** జీవిత భాగస్వామితో చర్చలు జరిపి కొన్ని ముఖ్య నిర్ణయాలు చేస్తారు.

**వృషభం:** ఆరాధనలు, యాత్రలు సంభవము. ఏకాంత చర్చలకు అనుకూలమైన సమయము.

**మిథునం:**విధుల నిర్వహణలో, వ్యాపార రంగాలలో అభివృద్ధి సాధిస్తారు.

**కర్కాటకం :**దూర ప్రాంతాల నుంచి ఆహ్వానాలు అందుకుంటారు. వాహన యోగం.

**సింహం:** భూములు, స్థలాలు కొనుగోలు యత్నాలు చేస్తారు. సోదరుల కలయిక.

**కన్య :**కోర్టుకేసుల నుండి బయటపడుతారు. పోటీ పరీక్షలలో విజయం సాధిస్తారు.

**తుల :** ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న అవకాశాలు లభిస్తాయి.

**వృశ్చికం:** శత్రువులు సైతం, మిత్రులుగా మారతారు. ప్రయాణాలు.

**ధనుస్సు:** మాటలచాతుర్యంతో ఎదుటి వారిని ఆకట్టుకుని పనులు పూర్తి చేస్తారు.

**మకరం:** వృత్తి, ఉద్యోగాలలో మీ బుద్ధికుశలత బాగా లాభిస్తుంది.

**కుంభం:** బంధు మిత్రుల నుండి మాట సహాయం అందుకుంటారు.

**మీనం :** వివాదాలకు, కోపతాపాలకు దూరంగా ఉండండి. ఆహార నియమాలు పాటించండి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

08-10Pg3exHMNWJQEBVTPKS G O 3RD_08-10Pg3exHMNWJQEBVTPKS.qxd 10/8/2025 12:15 AM Page 1



# స్వచ్ఛతకు పురస్కారాల పట్టం

### - ఎన్‌టిఆర్ జిల్లాకు ఎనిమిది రాష్ట్రస్థాయి అవార్డులు

### - సిఎం చేతుల మీదుగా అవార్డులు అందుకున్న ఎన్టీఆర్ జిల్లా విజేతలు..



సిఎం చంద్రబాబు చేతులు మీదుగా అవార్డు అందుకుంటున్న కలెక్టర్ లక్ష్మీశ

**విజయవాడ,అక్టోబరు 7,ప్రభాతవార్తప్రతినిధి:** పరిశుభ్రత, పారిశుధ్య నిర్వహణలో ఉత్తమ ప్రతిభకు పట్టం కడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన స్వచ్ఛాంధ్ర పురస్కారాలు2025లో ఏపీ రాజధాని అమరావతి పరిధిలోని హెడ్ క్వార్టర్ డిస్ట్రిక్ట్‌గా గుర్తింపులో ఉన్న ఎన్‌టీఆర్ జిల్లాకు ఎనిమిది రాష్ట్రస్థాయి అవార్డులు లభించాయి. నగరంలోని తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వచ్ఛాంధ్ర పురస్కారాలను విజేతలకు అందజేశారు. మొత్తం 69 రాష్ట్రస్థాయి పురస్కారాల్లో ఎనిమిది పురస్కారాలు ఎన్‌టీఆర్ జిల్లాకు లభించాయి. ప్రత్యేక కేటగిరీ అవార్డులు (స్వచ్ఛ్ సర్వేక్షణ్)లో విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్, స్వచ్ఛ కాలనీల విభాగంలో విజయవాడలోని కేపీ నగర్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్, స్వచ్ఛ ఆసుపత్రుల విభాగంలో విజయవాడ హెచ్‌బీ కాలనీ యూపీహెచ్‌సీ, పెనుగంచిప్రోలు మండలం అనిగండ్లపాడు ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల, స్వచ్ఛ అంగన్వాడీలు విభాగంలో కేదారేశ్వరపేట 3 అంగన్వాడీ కేంద్రం, స్వచ్ఛ బస్ స్టేషన్ల విభాగంలో విజయవాడ బస్ స్టేషన్, స్వచ్ఛ పాఠశాలల కేటగిరీలో విజయవాడ కృష్ణలంకలోని వీఎంఆర్‌ఆర్ (జి) మునిసిపల్ కార్పొరేషన్ హైస్కూల్, స్వచ్ఛతా ఎన్‌జీవోలు కేటగిరీలో రైజ్ సంస్థ అవార్డులు సాధించగా ఆయా సంస్థలు, పాలనా యూనిట్ల ప్రతినిధులు గౌరవ ముఖ్యమంత్రి చేతులమీదుగా అవార్డులతో పాటు అభినందనలు అందుకున్నారు. స్వర్ణాంధ్రస్వచ్ఛాంధ్ర లక్ష్య సాధనకు ముందడుగు వేస్తూ స్వచ్ఛాంధ్ర పురస్కారాల్లో ఎన్‌టీఆర్ జిల్లాను ముందు వరుసలో నిలిపినందుకు అధికారులు, సిబ్బందికి కలెక్టర్ లక్ష్మీశ అభినందనలు తెలిపారు. ఈ పురస్కారాలు స్ఫూర్తిగా జిల్లాను మరింత స్వచ్ఛత దిశగా నడిపించాలని ఆయన పేర్కొన్నారు. పారిశుద్ధం, పరిశుభ్రతలో చేసిన విశేష కృషిని గుర్తించేందుకు, స్వచ్ఛాంధ్ర మిషన్‌లో భాగస్వామ్య పక్షాలను కీలకపాత్ర పోషించేలా ప్రోత్సహించేందుకు, సంస్థలు, పాలనా యూనిట్ల మధ్య ఆరోగ్యకర పోటీని ప్రోత్సహించేందుకు, పారిశుద్ధం, పరిశుభ్రతలో అత్యుత్తమ విధానాలు, ఆవిష్కరణల ప్రదర్శనకు, స్వచ్ఛాంధ్రలో ప్రజా భాగస్వామ్యాన్ని ప్రోత్సహించేందుకు ఈ పురస్కారాలు దోహదం చేస్తాయన్నారు.

## ఆర్టీసి చైర్మన్ కొనకళ్ల నారాయణను ఎపిపిటిడి బిసి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ సత్కారం



**విజయవాడ,అక్టోబరు 7,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీఎస్‌ఆర్టీసీ చైర్మన్‌గా కొనకళ్ళ. నారాయణ పదవి బాధ్యతలు చేపట్టి సంవత్సరం పూర్తయిన సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలను ఏపీ పిటిడి (ఆర్టీసీ) బిసి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్పీ. శేషగిరిరావు ఆధ్వర్యంలో తెలిపారు. ఈ సంవత్సరంలోనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆలోచనలతో అన్ని వర్గాల మహిళలకు ప్రయోజనం చేకూర్చే ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణ పథకం శ్రీశక్తి పథకం చైర్మన్ కొనకల్ల నారాయణ ఆధ్వర్యంలో అమలు జరిగి విశేష ప్రజాదరణ పొందుతూ కోట్లాదిమంది మహిళలకు లబ్ధి చేకూరుతున్న సందర్భంగా వారికి అభినందనలు తెలియజేసారు. ఆయనను ఘనంగా సత్కరించారు.. కార్యక్రమంలో ఏపీపీటీడీ (ఆర్టీసీ) విజిలెన్స్ సెక్యూరిటీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులుడి.అంకినీడు, పి.వెంకటేశ్వరరావులు శుభాకాంక్షలు తెలిపారు.

## 9న పైడితల్లి ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన

### దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



**విజయనగరం, అక్టోబర్ 7 (ప్రభాతవార్త ప్రతినిధి);** ఈ నెల 9వ తేదీన శ్రీ పైడితల్లి అమ్మవారి ఆలయ అభివృద్ధి పనులను ప్రారంభిస్తామని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ప్రకటించారు. గోవా గవర్నర్, మాన్సాస్ ఛైర్మన్ పూసపాటి అశోక్ గజపతిరాజు చేతులమీదుగా ఈ పనులను ప్రారంభిస్తామని చెప్పారు. శ్రీ పైడితల్లి అమ్మవారి సిరిమానోత్సవం సందర్భంగా, అమ్మవారికి ప్రభుత్వం తరపున మంత్రి ఆనం పట్టు వస్త్రాలను సమర్పించారు. ఆయనకు ఆలయ అధికారులు అధికార లాంఛనాలతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం ఆశీర్వచనాలు పలికి, అమ్మవారి చిత్రపటాన్ని, ప్రసాదాలను అందజేశారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ విజయనగరంలోని మూడు లాంతర్ల కూడలిలో వెలసిన ఈ అమ్మవారి ఆలయం శతాబ్దాల చరిత్ర కలిగి ఉందని, ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పుగా, పూసపాటి రాజవంశీయుల ఇష్టదైవంగా అమ్మవారు ఆరాధింపబడుతున్నారు అంటే అమ్మవారి గొప్పతనం ఏంటో అర్థం అవుతుందని పేర్కొన్నారు. 1758లో ప్రారంభమైన సిరిమానోత్సవం, నేటికీ అదే ఉత్సాహంతో, అదే విశ్వాసంతో సాగుతోందని, ప్రతి ఏడాది లక్షలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని, తమ కోరికలు నెరవేరేలా ప్రార్థనలు చేస్తారని, ఈ ఉత్సవం కేవలం భక్తి పండుగ మాత్రమే కాదు, ఉత్తరాంధ్ర ఆత్మను ప్రతిబింబించే సాంస్కృతిక వేడుకగా కూడా నిలిచింది అని మంత్రి ఆనం వ్యాఖ్యానించారు. ఈ ఏడాది అమ్మవారి జాతర ఉత్సవాలు అంగరంగ వైభవం గా ప్రారంభం అయ్యాయని, అలాగే రాష్ట్ర ప్రభుత్వం కూడా అమ్మవారి జాతరను రాష్ట్ర పండుగగా గుర్తించి దేవాదాయ శాఖ మంత్రి హోదాలో పట్టు వస్త్రాలు సమర్పించడానికి తనను పంపిందని, అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించే అవకాశం రావడం అనేది తన పూర్వజన సుకృతంగా భావిస్తున్నానని అన్నారు. మంత్రి వెంట జిల్లా ఇంచార్జ్ మంత్రి వంగలపూడి అనిత, మంత్రి కొండపల్లి శ్రీనివాస్, శాసన సభ్యురాలు అదితి గజపతి రాజు, జిల్లా కలెక్టర్ ఎస్.రాం సుందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విజయనగరంలో ఘనంగా పైడితల్లి ఉత్సవం

### హాజరైన లక్షలాది మంది భక్తులు - వర్షం కురిసినా చెక్కు చెదరని భక్తజనం

### కోట బురుజు పైనుంచి సిరిమానును తిలకించిన గవర్నర్ అశోక్ గజపతి రాజు, మంత్రులు

**విజయనగరం,అక్టోబరు 7 ( ప్రభాతవార్త ప్రతినిధి) :** విజయనగరం ఇలవేల్పు,ఉత్తరాంధ్రా కల్పవల్లి శ్రీశ్రీశ్రీ పైడితల్లమ్మ సిరిమాను ఉత్సవం మంగళవారం అత్యంత వైభవంగా,కన్నుల పండువగా జరిగింది. విజయదశమి తర్వాత వచ్చే మంగళవారం సాంప్రదాయంగా ఏటా జరుగుతున్న సిరిమానోత్సవ సంబరం ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా భక్తుల కేరింతలు,కోలాహలం నడుమ ప్రశాంతంగా, ఉత్సాహంగా ముగిసింది.ఎప్పటిలాగానే పైడితల్లమ్మ ఆలయ పూజారి బంటుపల్లి వెంకటరావు సిరిమానుకు చివరి ఏర్పాటుచేసిన ఆసనాన్ని అధిరోహించిన తర్వాత మంగళవారం సాయంత్రం మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు పూజలు చేసిన తర్వాత సాయంత్రం 4.23 గంటలకు సిరిమాను యాత్ర ప్రారంభమయింది.సిరిమానుకు ముందు తెల్ల ఏనుగు, బెస్తవారివల, అంజలి రథం కిట కిట లాడిన బక్తులతో కదలగా వాటిని అనుసరించి సిరిమాను కదిలింది.ఆలయ పూజారి వెంకటరావు అధిరోహించిన తర్వాత సిరిమాను పైడితల్లిమ్మ దేవాలయం వద్ద ప్రారంభమై కోట ముఖ ద్వారం వద్దకు వెళ్లి తిరిగి వెనక్కు తిరిగింది. సాయంత్రం 5.40 గంటల సమయంలో మూడో సారి సిరిమాను ఊరేగింపు తర్వాత యాత్ర ముగిసింది. గట్టిపోలీస్ బందోబస్తు మధ్య ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ఉత్సవం విజయవంతంగా ముగియడంతో అధికార యంత్రాంగం ఊపిరిపీల్చుకుంది. ప్రతి ఏటా లాగానే ఈ ఏడాది కూడా సిరిమానోత్సవానికి వచ్చిన భక్తుల సంఖ్య అధికంగా కనిపించింది.



సిరిమానోత్సవం ప్రారంభానికి ముందు , మూడో సారి సిరిమాను తిరిగిన తర్వాత వర్షం కురిసినప్పటికి భక్తులు మాత్రం కదలకుండా సిరిమానును తిలకించడం గొప్ప విషయం. విధుల్లో ఉన్న పోలీసులు, మీడియా ప్రతినిధులు, ఇతర శాఖల ఉద్యోగులు తడిసి ముద్దయ్యారు. పైడితల్లమ్మ దేవస్థానం అనువంశిక ధర్మకర్త, గోవా గవర్నర్ పూసపాటి అశోక్‌గజపతిరాజు తన కుటుంబీకులతో కలిసి కోట బురుజు పై నుంచి సిరిమానోత్సవాన్ని తిలకించారు. పూసపాటి వంశీయులు ఏటా కోట బురుజుపై ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదిక నుంచి ఉత్సవాన్ని తిలకించడం ఆనవాయితీగా వస్తున్నది.

### వేడుకగా ఇంద్రకీలాద్రి

# గిరి ప్రదక్షిణ

**ఇంద్రకీలాద్రి, అక్టోబర్ 7, ప్రభాతవార్త** అమ్మల గన్న అమ్మ బెజవాడ దుర్గమ్మ ఆలయంలో మంగళవారం నాడు ఉదయం పౌర్ణమి సందర్భంగా ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ వైభవంగా జరిగింది. శ్రీ స్వామి అమ్మవార్లు ప్రత్యేక రథం పై ఆసీనులై భక్తులను అనుగ్రహించారు. ఇఒ వికె శీనా నాయక్ తో పాటు వేదపండితులు, అర్చకస్వాములు, ఆలయ సిబ్బంది, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఉదయం 5.55లకు శ్రీ కామధేను మాత ఆలయం వద్ద ప్రారంభమై విద్యాధరపురం, కుమ్మరిపాలెం, నాలుగు స్థంబాల సెంటర్, సితార, పాలఫ్యాక్టరీ, కెబిఎన్‌కాలేజ్, బ్రాహ్మణవీధి ల గుండా తిరిగి ఆలయానికి చేరుకున్నారు. భక్తులు విరివిగా పాల్గొన్నారు. దుర్గమ్మవారికి భక్తులు దసరా ఉత్సవాల్లో హుండీల ద్వారా సమర్పించిన కానుకలను రెండవరోజు మంగళవారం లెక్కించగా రు.6,73,02,813 ల నగదు, 387 గ్రాముల బంగారం, 9కెజిల 450గ్రాముల వెండి, లభించాయని ఇఒ వికె శీనా నాయక్ తెలిపారు.

# తిరుమల సమాచారం


## 20న దీపావళి ఆస్థానం - ఆర్జితసేవలు రద్దు



**తిరుమల, అక్టోబర్ 7ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఆలయంలో దీపావళి ఆస్థానం ఈనెల 20వతేదీ సోమవారం నిర్వహిస్తున్నారు. దీపావళిపండుగ సందర్భంగా ఈ వైదిక కార్యక్రమం చేపడతారు. దీపావళిరోజు 20వతేదీ సోమవారం ఉదయం బంగారువాకిలిలో ఘంటా మండపంలో ఈ కార్యక్రమం జరగనుంది. ఆస్థానంలో భాగంగా మలయప్పస్వామి శ్రీదేవిభూదేవులతో కలసి ఘంటా మండపంలో ఏర్పాటుచేసిన సర్వభూపాల వాహనంలో గరుడాళ్వార్‌కు అభిముఖంగా వేంచేపుచేస్తారు. సేనాధిపతి విశ్వక్సేనులు స్వామివారి ఎడమపక్కన మరొక పీఠంపై దక్షిణ అభిముఖంగా వేంచేపుచేస్తారు. ఆ తరూవాత స్వామికి ప్రత్యేక పూజ,హారతి, ప్రసాద నివేదనలను అర్చకులు ఆగమోక్తంగా నిర్వహిస్తారు. దీంతో దీపావళి ఆస్థానం పూర్తవుతుంది.

సాయంత్రం ఉత్సవర్లు సహస్ర దీపాలంకారసేవలో పాల్గొని ఆలయ మాఢవీధుల్లో ఊరేగి భక్తులను కటాక్షిస్తారు. కాగా సోమవారం దీపావళి ఆస్థానం సందర్భంగా ఆలయంలో జరిగే కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం సేవలు రద్దయ్యాయి. సుప్రభాతం, అర్చన,తోమాల సేవలు ఏకాంతంగా జరుగుతాయి.

## నిండు పున్నమిన గరుడునిపై గోవిందుడు



**తిరుమల,అక్టోబర్ 7ప్రభాతవార్తప్రతినిధి:** ఆశ్వయుజ మాసం పౌర్ణమివేళ మంగళవారం సాయంత్రం మలయప్పస్వామి గరుడ వాహనాన్ని అధిరోహించి భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం నిత్యకైంకర్యాలు ముగించుకుని సహస్రదీపాలంకరణసేవలో వయ్యారంగా పూజలందుకున్న మలయప్ప అక్కడ నుంచి బయలుదేరి వాహనమండపం చేరుకున్నారు. వాహనమండపం వద్ద ఆలయ అర్చకులు విశేషఅలంకారభూషితుడైన మలయప్పను కొలువుదీర్చి వేదమంత్రాల నడుమ కర్పూర హారతులిచ్చారు. అనంతరం భక్తుల గోవింద నామస్మరణల మధ్య గరుడవాహనం మెల్లగా ఆలయం ముందునుంచి కదులుతూ మాఢవీధుల్లో ఊరేగారు. ఈ వాహనసేవలో టిటిడి ఆలయ అధికారులు పాల్గొన్నారు. కాగా పదిరోజుల వ్యవధిలో మళ్ళీ మంగళవారం 108 వైష్ణవదివ్యదేశాలలో గరుడసేవ భక్తులకు మోక్షం కలిగిస్తుంది.

## శాస్త్రోక్తంగా దత్తమందిరంలో చండీహోమం



**తిరుపతి,అక్టోబర్ 7ప్రభాత వార్తప్రతినిధి:** ఆశ్వయుజ పౌర్ణమి సందర్భంగా మంగళవారం ఉదయం నుండి సాయంత్రం వరకు మొగిలి చెర్ల దత్తాత్రేయమందిరంలో శాస్త్రోక్తంగా ఛండీహోమం జరిగింది. ఉదయం ఆలయ అర్చకులు గణపతి హోమం, పుణ్యాహవచనం చేసిన తరువాత వేదమంత్రోచ్చరణల నడుమ గృహస్థ భక్తులతో హోమాన్ని జరిపించారు. భక్తులే స్వయంగా పాల్గొని ఛండీహోమం చేయడంతో భక్తితో ముక్తిని పొందారు. హోమంలో పాల్గొన్న భక్తులకు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పవని నాగేంద్రప్రసాద్ ,ఇడి విష్ణుకౌశిక్‌లు ప్రసాదం అందించారు. అనంతరం దత్తాత్రేయస్వామి దర్శనం భాగ్యం కల్పించారు. మధ్యాహ్నం, సాయంత్రం అన్నప్రసాద వితరణ జరిగింది.

## తిరుమలలో భారీ వర్షం



**తిరుమల,అక్టోబర్ 7ప్రభాతవార్తప్రతినిధి:** బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడనం ప్రభావంతో మంగళవారం మధ్యాహ్నం ఉన్నఫళంగా రెండుగంటల పాటు భారీ వర్షం కురిసింది. ఒక్కసారిగా కురిసిన వర్షంతో తిరుమల ఆలయం ముందు, మాఢవీధులు వర్షపునీటితో నిండిపోయాయి. ఆలయం మాఢవీధులు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రాంభగీచా అతిధిగృహాలు, హెచ్‌టి కాంప్లెక్స్, ఎస్వీ షాపింగ్ కాంప్లెక్స్,ఎస్‌ఎన్‌సి ప్రాంతాల్లో వాననీరు చేరింది. భారీ వర్షంతో తిరుమల పూర్తిగా వాతావరణం మారిపోయింది. మధ్యాహ్నం ఒంటి గంటనుండి మూడుగంటల వరకు జోరువాన కురిసింది. ఆలయంలోనికి వెళ్ళే భక్తులు వర్షానికి తడుస్తూ స్వామివారి దర్శనానికి చేరుకోవాల్సి వచ్చింది. ఆలయం నుండి వెలుపలకు వచ్చిన భక్తులు తడిసి ముద్దయ్యారు. గదులకు చేరుకోవడానికి ఇబ్బందులు పడ్డారు. భారీ వర్షానికి తిరుమల నుండి తిరుపతికి వెళ్ళే మొదటి ఘాట్‌లో,తిరుమలకు చేరుకునే రెండోఘాట్‌లో వాననీరు జోరుగా ప్రవహించింది. వాతావరణం పూర్తిగా మారిపోయి చల్లటిగాలులు వీస్తున్నాయి.

# ‘తులాభారం’ కానుకల స్కామ్ పురోగతి ఏదీ?

**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** వడ్డీకాసుల వేంకటేశ్వరస్వామికి భక్తులు తమ కోరికలు తీరినవెంటనే చెల్లించుకునే తులాభారం కానుకలు స్కామ్ జరిగిందనే ఆరోపణలపై పురోగతి ఏమైందనేది పెద్దసంఖ్యలో శ్రీవారి భక్తుల్లో చర్చమొదలైంది. అసలు ఈ స్కామ్ దర్యాప్తు ఉలుకూపలుకూలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఆపదమొక్కులవాడు... ఏడుకొండల వేంకటేశ్వరస్వామికి భక్తులు చెల్లించే తులాభారం కానుకలు గత ఐదేళ్ళ వైసిపి పాలనలో పక్కదారిపట్టాయంటూ ఏకంగా తాజా బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి చేసిన ఆరోపణలు టిటిడిలో గతమేనెలలో సంచలనం కలిగించింది. దేశవిదేశాల్లో ఉన్న వెంకన్న భక్తులు తమ కోరికలు నెరవేరిన వెంటనే తులాభారం త్రాసులో ఓ వైపు భక్తుడు, మరోవైపు నాణేలు, చక్కెర, బెల్లం, కలకండ,డ్రైఫ్రూట్స్,బియ్యం ఇలా ఏదైనా వారి బరువుకు తగ్గట్లు మొక్కుబడులుగా వేస్తారు. అంతే బరువుకు సరిపడే నగదును టిటిడికి అందిస్తారు. ఇక్కడ రెండు, ఐదురూపాయలు నాణేలు ఉంచి బరువు తూకం వేస్తారు. భక్తుడు ఎంత బరువుంటే అంత సొమ్ము నగదు రూపంలో అక్కడ సిబ్బందికి అప్పగించి మొక్కులు తీర్చుకోవడం పరిపాటి. ఈ చెల్లించిన నగదు గత ఐదేళ్లలో సగంవరకు వెంకన్న ఖజానాకు చేరలేదనేది బహిరంగమైన ఆరోపణలు. ఇలా రోజుకు ఐదులక్షల నుండి 10లక్షల రూపాయల వరకు తులాభారంకానుకలు అందుతాయనేది టిటిడి

> **- ఐదునెలలుగా ఉలుకూపలుకూలేని విచారణ !**

సమాచారం. ఈ మొత్తాన్ని ఏరోజుకారోజు దేవుని ఆదాయం లెక్కల్లో చూపాలి. అయితే గత ఐదేళ్లలో సగం ఆదాయం టిటిడికి జమకాలేదనేది ఇప్పటికే సంచలనంగా మారినా దానిపై విచారణ ఎంతవరకు వచ్చిందనేది భక్తుల్లోనూ ఆసక్తికరమైన అంశంగా మారింది. టిటిడి బోర్డు సభ్యుడు జి.భానుప్రకాష్‌రెడ్డి తులాభారం కానుకలు స్వాహా చేశారంటూ ఆధారాలతో సహా ప్రభుత్వ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంకు గత మేనెలలోనే ఫిర్యాదు చేయడం హాట్‌టాఫిక్ అయ్యింది. శ్రీవేంకటేశ్వరస్వామికి భక్తులు తమ మొక్కుబడుల్లో భాగంగా సమర్పించుకునే కానుకల్లో నిలువుదోపిడీ మొక్కులు, తలనీలాలు, కాలినడక,తులాభారం అంటే ఎంతో ప్రియం. భక్తులు తమ మొక్కులను తీర్చుకోవడానికి రోజువారీగా లక్షమంది వరకు తిరుమలకు వస్తున్నారు. దేశవ్యాప్తంగానేగాక విదేశాల్లో ఉన్న భక్తులు ,ప్రముఖులు కూడా తమకు ఏదేనికష్టం వస్తే ముడుపుకట్టి తిరుమలేశునికి మొక్కుకుంటారు. కష్టాల నుండి బయటపడగానే కొండకు చేరుకుని మొక్కుతీర్చుకుంటున్నారు. ఇలా రోజువారీగా హుండీకి సుమారుగా 4కోట్ల రూపాయలు కానుకలు చేకూరుతుంటాయి. ఇక తులాభారం మొక్కుల్లో 10లక్షల వరకు ఆదాయం వస్తుందని టిటిడి వర్గాలు చెబుతున్న లెక్కలు. ఆలయంలోపల మహాద్వారం దాటగానే ధ్వజస్తంభానికి పక్కన తులాభారం ఉంటుంది. కోరికలు నెరవేరిన భక్తులు పిల్లలకేగాకుండా పెద్దలకు కూడా తులాభారం వేస్తారు. గత ఐదేళ్లలో తులాభారం కానుకలు సగానికిపైగా గత టిటిడి పాలకమండలి పెద్దల జేబుల్లోకి వెళ్ళిందని భానుప్రకాశ్‌రెడ్డి ప్రధాన ఆరోపణ. వందమంది వరకు భక్తులు ప్రతిరోజూ తులాభారం మొక్కులు తీర్చుకోవచ్చని అంచనా. గతంలో తులాభారం వద్ద బ్యాంకు కాంట్రాక్టు సిబ్బంది విధులు నిర్వహించేవారన్నారు.

## ఆపన్న హృదయం పథకానికి విరాళాల సేకరణ

**తిరుమల,అక్టోబర్ 7ప్రభాతవార్తప్రతినిధి:** ధార్మిక సంస్థ తిరుమలతిరుపతిదేవస్థానం విద్య,వైద్య రంగాల్లోనూ అందిస్తున్న సేవలకు ధీటుగా తిరుపతిలోని పద్మావతి చిన్నపిల్లల హృదయాలయంలో నిరుపేద పిల్లలకు ఉచిత గుండె శస్త్రచికిత్సలు నిర్వహిస్తోంది. ఇందుకోసం అయ్యే ఖర్చును టిటిడి దాతల నుండి సేకరించే దిశగా ఆలోచన చేసింది.గుండె శస్త్రచికిత్సల కోసం దేశవ్యాప్తం నుండి కూడా తిరుపతిలోని టిటిడి పద్మావతి చిన్నపిల్లల హృదయాలయలకు పెద్ద సంఖ్యలో వస్తున్నారు. ఇప్పటికే దాదాపు 2వేలకుపైగా ఉచిత గుండె శస్త్రచికిత్సలు, గుండె మార్పిడి చేసింది. ఇప్పటికే పద్మావతి చిన్నపిల్లల హృదయాలయంలో అమలవుతున్న శ్రీవేంకటేశ్వర ఆపన్న హృదయం పథకం క్రింద ఒకలక్ష రూపాయలు(1లక్ష)దాత విరాళం అందిస్తే , నిరాదరణకు గురైన నిరుపేద వర్గాలకు చెందిన ఒక పిల్లవాడికి ఉచితంగా అవసరమైన ఆపరేషన్ చేసే సదుపాయం ఉంది. నూతనంగా చిన్నపిల్లల వైద్యసేవల కోసం ప్రత్యేక ట్రస్టు ఏర్పాటుకు సంబంధించి కూడా టిటిడి ఆలోచన చేస్తోంది. చిన్నపిల్లలను దైవసమానులుగా భావించి, ఆస్పత్రికి వైద్యం కోసం వచ్చే చిన్నారులకు చక్కటి వైద్యసేవలు మెరుగుపరిచేందుకు ఈ పథకం దోహదపడుతుంది. చిన్నపిల్లలకు సంబంధించి గుండె చికిత్సలతో బాటు చిన్నపిల్లల గుండె సర్జరీల సంఖ్యను పెంచేందుకు అవసరమైన వైద్యపరికరాలు, మౌళిక సదుపాయాలు, అత్యవసర మందులు ఏర్పాట్లుకు దాతలు విరాళాలందించేలా టిటిడి ప్రోత్సాహిస్తోంది. దక్షిణభారతదేశంలోనే చిన్నపిల్లలకు ఉచిత గుండె శస్త్రచికిత్సలు, గుండె మార్పిడి చికిత్సలందించేందుకు గతంలోని వైసిపి ప్రభుత్వం తిరుపతిలో టిటిడి ఆధ్వర్యంలో పద్మావతి చిన్నపిల్లల హృదయాలయంను నెలకొల్పింది.

## స్వచ్ఛాంధ్ర పురస్కారాల్లో మెప్మాకు అరుదైన గౌరవం



సిఎం చేతుల మీదుగా అవార్డులు అందుకుంటున్న మెప్మా అధికారులు,ఇతరులు


**విజయవాడ,అక్టోబరు 7,ప్రభాతవార్తప్రతినిధి:** సామాజిక అభివృద్ధిలో తమదైన ముద్ర వేస్తూ, పట్టణ పేదల సాధికారత కోసం కృషి చేస్తున్న మెప్మా సంస్థ, ప్రతిష్టాత్మకమైన స్వచ్ఛాంధ్ర పురస్కారాల్లో సరికొత్త రికార్డు సృష్టించింది. ఒకే వేదికపై ఏకంగా నాలుగు రాష్ట్ర స్థాయి అవార్డులను కైవసం చేసుకుని, ఆ సంస్థ నిబద్ధత, ఆధునికత కోసం చేసే కృషిని మరోసారి చాటి చెప్పింది. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఈ పురస్కారాలను ప్రదానం చేశారు.బెస్ట్ సోషల్ మీడియా మేనేజ్‌మెంట్‌లో మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రభుత్వ కార్యక్రమాలను, పేదలకు అందుబాటులో ఉన్న అవకాశాలను వేగంగా ప్రజల్లోకి తీసుకెళ్లడంలో మెప్మా ప్రదర్శించిన చురుకుదనం ప్రశంసలు అందుకుంది. మెప్మాకుబెస్ట్ సోషల్ మీడియా మేనేజ్‌మెంట్‌అవార్డు లభించడం, డిజిటల్ యుగంలో ప్రభుత్వ సంస్థలు ప్రజలతో ఎలా అనుసంధానం కావాలనేదానికి ఒక ఆదర్శంగా నిలిచింది. మెప్మా మిషన్ డైరెక్టర్, ఎన్. తేజ్ భారత్, ముఖ్యమంత్రి నుండి ఈ అత్యుత్తమ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ విజయం, క్షేత్రస్థాయి సిబ్బంది, సామాజిక కార్యకర్తల అంకితభావానికి, సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించుకున్నందుకు నిదర్శనం. పట్టణ ప్రాంతాల్లో పారిశుధ్యం, జీవనోపాధి కల్పనలో కీలకపాత్ర పోషిస్తున్న మహిళా సంఘాల (స్లమ్ లెవెల్ ఫెడరేషన్ ఎస్‌ఎల్‌ఎఫ్) ప్రకాశం, విశాఖ, శ్రీకాకుళం జిల్లాల సమర్థ నిర్వహణకు గాను మరో మూడు ముఖ్యమైన అవార్డులను

## రాష్ట్ర ప్రభుత్వంతో అంతరిక్ష రంగ ఒప్పందానికి రష్యా సుముఖత

### - సైన్స్ సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సిఇఒ వెంకటేశ్వర్లు

**విజయవాడ,అక్టోబరు 7,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ ప్రభుత్వంతో సైన్స్,విద్య,అంతరిక్ష రంగాల్లో ఒప్పందం చేసుకునేందుకు రష్యన్ సైన్స్ అండ్ కల్చర్ ప్రతినిధులు సుముఖత వ్యక్తం చేశారని సైన్స్ సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సీఈఓ వెంకటేశ్వర్లు,కేశినేని తెలిపారు. ఢిల్లీలో జరిగిన వరల్డ్ స్పేస్‌వీక్ కార్యక్రమంలో సోమవారం ఆయన పాల్గొన్నారు. ‘ఈ సందర్భంగా రష్యన్ కాస్మొనాట్ డెనిస్ మాట్వీవ్,ఫెడరేషన్ ప్రతినిధులతో మాట్లాడారు.రాష్ట్రంలో మౌలిక సదుపాయాల కల్పనకు,పరిశ్రమల ఆకర్షణకు రాష్ట్రప్రభుత్వ చేస్తున్న కృషి వివరించారు. ఏపీ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకోవడానికి వారూ ఆసక్తి చూపించారు. త్వరలో రాష్ట్రంలో పర్యటిస్తామని తెలిపారు’ అని వెంకటేశ్వర్లు పేర్కొన్నారు.

# విజయవాడలో పాలస్తీనాకు మద్దతుగా సాంస్కృతిక కార్యక్రమాలు



**విజయవాడ,అక్టోబరు 7,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడలో పాలస్తీనాకు మద్దతుగా సాంస్కృతిక సాయంత్రం కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పాలస్తీనా ప్రజల విమోచనా పోరాటానికి మద్దతుగా, గాజాపై గత రెండేళ్లుగా ఇజ్రాయెల్ చేస్తున్న జినోసైడ్ కు నిరసనగా పాటలు, కవితలు, నినాదాలతో విజయవాడ లెనిన్ సెంటంలో స్వరాలు దిక్కులు పిక్కటిల్లేలా ధ్వనించాయి. ఇండియన్ పీపుల్ ఇన్ సాలిడారిటీ విత్ పాలస్తీనా దేశవ్యాప్తంగా చేస్తున్న నిరసన కార్యక్రమాల్లో భాగంగా విజయవాడలో ఈ సాంస్కృతిక సాయంత్రం కార్యక్రమాలను నిర్వహించింది. ఇందులో కార్యకర్తలు, విద్యార్థులు, యువత, ప్రొఫెషనల్స్ హాజరై పాటలు, కవితలు, నినాదాలు, పోస్టర్లు, సందేశాలు, ప్రసంగాల ద్వారా పాలస్తీనాకు సంఘీభావం తెలియజేశారు.ఇండియన్ పీపుల్ ఇన్ సాలిడారిటీ విత్ పాలస్తీనా కార్యకర్త అమూల్య మాట్లాడుతూ గత రెండేళ్లగా ఇజ్రాయిల్ గాజాపై చేస్తున్న మారణకాండలో 60 వేల మందికి పైగా ప్రజలు మరణించారని, అందులో 20 వేల మంది చిన్నారులేనని అన్నారు. ఈరోజు మనమంతా మనుషు లుగా ఉండడం అంటే ప్రాణాలు కోల్పోతున్న గాజా పిల్లలు పక్షాన నిలబడడమేనన్నారు. ఈ అమానవీయ హత్యాకాండకు సాయ పడుతూ, ఇజ్రాయిల్ దురాక్రమణ వల్ల లాభపడుతున్న కంపెనీలను బాయ్‌కాట్ చేయాలనే పిలుపునిస్తూ ప్రపంచవ్యాప్తంగా బిడిఎస్ ఉద్యమం జరుగుతుందనీ, ఇందులో అందరూ భాగం అవ్వాలని పిలుపునిచ్చారు. ఆర్. రఘు మాట్లాడుతూపిల్లలను, స్త్రీలను చంపడంభావితరం లేకుండా చేస్తున్నారన్నారు.

వార్త


శ్రమతో సంపాదించిన సంపదను అనుభవించడమంత మాధుర్యం మరొకటి లేదు.

-గోథే

# మానవత్వంలోనూ అత్యున్నతమే!

అత్యున్నత స్థానాల్లో ఉన్నవారి గౌరవ ప్రతిష్టలను కాపాడడం ఈ దేశ సంస్కారం. భారత దేశ సంస్కృతీ సంప్రదాయాలు కూడా అదే చెబుతున్నాయి. దేశ స్థాయిలోనే వారు అలంకరించిన స్థానం అత్యున్నతమైనది. అలాంటి భారత దేశ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ మీద ఓ సీనియర్ న్యాయవాది బూటు విసిరే ప్రయత్నం చేసాడు. కోర్టులో తమకనుకూలమైన తీర్పులు రానివారు ఆ న్యాయమూర్తుల పట్ల కసితో రగిలిపోయిన సందర్భాలు చూశాం. కొన్ని ఉదంతాలు కూడా మనకు తెలుసు. కానీ ఏకంగా అత్యున్నత ధర్మాసనం అధిష్టించిన ప్రధాన న్యాయమూర్తిపై ఈ రకమైన దాడి ఇదే తొలిసారి. సభ్యసమాజం హర్షించలేనిది. 'ఈ దాడి భారతీయులందరినీ ఆగ్రహానికి గురిచేసింది. ఇలాంటి చర్యలకు మన సమాజంలో చోటు లేదు' ఈ మాటన్నది ఎవరో కాదు, ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌ని ఫోన్‌లో పరామర్శించిన అనంతరం ప్రధాని నరేంద్రమోడీ అన్న మాటలివి. ఘటన జరిగిన సమయంలోనూ, అదే సందర్భంలోనూ ఆ తర్వాత ప్రశాంతతను కాపాడుతూ సిజెఐ స్పందించిన తీరును ప్రధాని అభినందించారు. ఉన్నత ధర్మాసనాన్ని ఎంతో హుందాగా నిర్వహించడంలో గవాయ్ ఎన్నోసార్లు తన వ్యక్తిత్వాన్ని నిలుపుకున్నారు. అనేక సంచలనాత్మక నిర్ణయాలను తమ తీర్పుల్లో ప్రవచించేవారు. అంతేకాదు కాల మాన పరిస్థితులకు అనుగుణంగా నేటి తీర్పులుండాలని పదేపదే తమ న్యాయమూర్తులకు బోధించేవారు. న్యాయస్థానాల్లో పెండింగ్ కేసుల విచారణ కోసం ఎదురు చూసేవారు కాలాతీతమవుతోందని భావించే ఆందోళనే తప్ప సుప్రీం తీర్పులను విమర్శించేవారు బహు తక్కువ. న్యాయచట్టాల పరిధిలో తీర్పులు, అప్పీళ్లు, పునశ్చరణ, పునః ప్రస్తావన వంటి ఎన్నో ప్రక్రియలు న్యాయస్థానం గౌరవాన్ని పెంచేటట్లుగానే ఉంటాయి. తుది తీర్పుల్లో న్యాయం అందే తీరుతుందని భారతీయులంతా మెచ్చుకుంటూ న్యాయస్థానాలను, న్యాయాధిపతులను గౌరవిస్తూనే ఉన్నారు. కానీ విచిత్రంగా సోమవారం సుప్రీం కోర్టులో ప్రధాన న్యాయమూర్తిపై జరుగబోయిన అఘాయిత్యాన్ని జాతి యావత్తూ ఖండిస్తోంది. ఈ దాష్టీకానికి ప్రయత్నించింది పరాయి దేశస్థుడో, జాతికుల మత ద్వేషాలున్నవారో కాదు. అతనూ భారతీయుల్లో ఒకరే. ఆయనెలా విమర్శించినా, ఎన్ని ఎత్తుగడలు గుప్పించినా అతని మీద ఎలాంటి కేసు నమోదు చేయవద్దని సిజెఐ ఆదేశించడం ఆయనలోని వ్యక్తిత్వమే చెబుతోంది. ఉన్నత ధర్మాసనాధిపతిగా తీసుకునే ప్రతి చర్యా ఆ స్థానంగౌరవ ప్రతిష్టలను ఇనుమడింప చేసేవిగానే ఉంటాయి. సాధారణంగా తమ ముందుకొచ్చిన కేసుల్లోని వాస్తవాలను, లోతుపాతుల్ని వెలికితీసేందుకు న్యాయమూర్తులు బెంచి మీద నుంచి ప్రశ్నలు వేయడం ద్వారా కక్షిదారుల తరపు న్యాయవాదుల వాదనలు, వాటిలోని పసను రాబట్టుకునే ప్రయత్నం చేస్తుండడం సహజం న్యాయ ప్రక్రియలో అదీ ఒక భాగమే. అంతేకాదు కొన్ని సందర్భాల్లో వ్యాఖ్యలు చేస్తుంటారు. అది సానుకూల వ్యాఖ్యలు కావొచ్చు. కాకపోవచ్చు.అవన్నీ న్యాయాన్వేషణలో భాగంగానే చూడాలి. 'సనాతన ధర్మాన్ని అవమానిస్తే సహించబోనంటూ' కోర్టు హాల్‌లోని సీనియర్ న్యాయవాది రాకేష్ సురేష్ ఒక్కసారిగా ప్రధాన న్యాయమూర్తి వైపు లంఘించబోగా వేదిక వద్దకు చేరకుండానే భద్రతా సిబ్బంది అతన్ని పట్టుకొని వారించారు. ఆ సమయంలో కోర్టు నెం.1 బెంచి మీద జస్టిస్ గవాయ్, జస్టిస్ కె. వినోద చంద్రన్‌లు కేసులు నిర్వహిస్తున్నారు.సిజెఐ గవాయ్ మాత్రం ఇలాంటివ్యాఖ్యలు తనను ప్రభావితం చేయబోవని వ్యాఖ్యానించారు. ఇటీవల ఖజురాహోలో విష్ణుమూర్తి విగ్రహ పునఃస్థాపన విషయంలో కోర్టులో సిజెఐ వ్యాఖ్యలకు నిరసనగానే ఇలాంటి ప్రయత్నం జరిగినట్లు తెలిసింది. కేసును కొట్టేసి 'ఆ దేవుడినే ఏదైనా చేయమని అడగండి' అన్న వ్యాఖ్యలపై కొందరికి అసంతృప్తి కలిగిన మాట నిజమే. అది తీర్పులో భాగం కాదు. వ్యాఖ్యానప్రస్తావన మాత్రమే. ఈ అంశాలేవీ తీర్పును ప్రభావితం చేయవు. న్యాయప్రక్రియలో దీనికి పెద్ద దోషమేమీ అంటదు. నిజానికది పురావస్తు శాఖ స్థలం కనుక వారే అనుమతినివ్వాలని తాను చేయగలిగేదేమీ లేదని అన్నారు. ఆ తర్వాత ఒక సందర్భంలో సిజెఐ తాను అన్ని మతాలను గౌరవిస్తానని స్పష్టం చేశారు కూడా. సుప్రీంకోర్టు రిజిస్ట్రీ నిందితుడు రాకేశ్ మీద ఎలాంటి చర్యలు తీసుకోవద్దని ఆదేశించగానే పోలీసులు ఆయనను ప్రశ్నించి వదిలేశారు. ఇప్పుడాయన టీవీ ఛానల్స్‌కు తన చర్యలను సమర్థించుకుంటూ వరుస ఇంటర్వ్యూలు ఇస్తున్నారు. 'ఆ బూటు విసిరించి నేను కాదు, దేవుడేనని' రాకేష్ చేస్తున్న వ్యాఖ్యలు హర్షించదగినవి కావు. సిజెఐ వ్యాఖ్యల నాటి నుంచి తనకు నిద్రపట్టడం లేదని, తనను 'గమ్మునుంటా వెందుకని ఆ దేవుడు తట్టి లేపాడ'ని ఇలా అర్థం లేని వాగుడుతో 'ఏదో దైవికశక్తి నాతో ఆ పనిచేయించిందం' టూ తన తప్పు కప్పిపుచ్చుకోవాలని సంజాయిషీ చెప్తు న్నాడు. జైలుకైనా సిద్ధమట. బార్‌కౌన్సిల్ ఈ ఉదం తంపై స్పందిస్తూ రాకేశ్ దేశంలోని ఏ కోర్టులోనూ వాదిం చకుండా అతడి సభ్యత్వాన్ని తాత్కాలికంగా రద్దు చేసింది. ఈ ఘటన అన్ని రాజకీయ పక్షాల అగ్రనేతలూ ఖండించారు.ప్రధాన న్యాయమూర్తి తనపై దాడియత్నం మీద మానవత్వంతో స్పందించారన్న ప్రశంసలు అందుకున్నారు. తుచ్ఛమైన ప్రచారం కోసం ఓ వ్యక్తి ఇలాంటి చర్యకు పాల్పడ్డారని కొట్టిపారేశారు. ఈ సంఘటన దురదృష్టకరం. భారతీయ సమాజం ఖండిస్తున్న సంఘటన.

ఉన్నత లక్షణాలు కలిగి ఉంటే సరిపోదు. వాటిని నిలబెట్టుకోవడానికి తగిన సామర్థ్యం కూడా కలిగి ఉండాలి.



సెయింట్ థెరిస్సా

దేశసేవ అంటే ఉపన్యాసాలు దంచడం కాదు. ఎవరి విధిని వారు సక్రమంగా నిర్వర్తించడమే.



మహాత్మా గాంధీ

## ప్రజావాక్కు



### నిరంతర పర్యవేక్షణ అవసరం

ప్రభుత్వ బాలికల గురుకులంలో ఒకేసారి 120 మంది బాలికలు అనారోగ్యంపాలవడం ఆందోళనకరం. అందులో 80 మందికి పైగా స్థానిక,జిల్లా ఆసుపత్రుల్లో చికిత్స పొందుతుండగా,30 మందిని మెరుగైన చికిత్స కోసం విశాఖ కేజీహెచ్‌కి తరలించారు. వీరంతా పచ్చ కామెర్ల బారిన పడ్డారు.ప్రాథమికంగా అది హెపటైటిస్ ఏ వైరస్ కారణంగా వచ్చిందని వైద్యులు అభిప్రాయపడుతున్నారు. ఆ వైరస్ కలుషిత మంచినీరు లేదా ఆహారం తీసుకోవడం వల్ల వస్తుంది. ఆ పాఠశాలలో రక్షిత మంచి నీరు ప్లాంట్ పనిచెయ్యడం లేదని,ఈ ఉదంతం బయట పడ్డాక కొత్త ప్లాంట్‌ని అధికార యంత్రాంగం సమకూర్చిందని వార్త. అదృష్టవశాత్తూ అస్వస్థతకు గురైన పిల్లలు వైద్యుల పర్యవేక్షణలో కోలుకొంటున్నారు. శుభ్రమైన వాతావరణం, రక్షిత మంచినీరు, పౌష్టికాహారం,దోమలు,కీటకాల నుండి రక్షణఅన్నవి అన్నిహాస్టళ్లకు ప్రాథమిక అవసరాలు.

- డా.డి.వి.జి. శంకరరావు, పార్వతీపురం

### అమెరికాపై ఆధారపడడం తగ్గించాలి

భారతఐటీరంగం ఎంతోవేగంగా అభివృద్ధి చెందుతున్నా, హెచ్1బి వీసాలపై అధిక ఆధారపడటం భవిష్యత్తుకు ప్రమాదకరంగా మారుతోంది. ప్రపంచ వలస విధానాలు క్రమంగా కఠినతరమవుతున్న ఈ పరిస్థితుల్లో, స్థిరమైన వ్యూహాలను అవలంబించడం అనివార్యం. స్థానిక నియామకాలనుపెంచడం,రిమోట్ డెలివరీ విధానాలను అభివృద్ధి చేయడం, అంతర్జాతీయ భాగస్వామ్యాలను బలోపేతం చేయడం ద్వారా సంస్థలు తమ స్వావలంబనను నిర్ధారించుకోవాలి. అదే సమయంలో స్వదేశీ ప్రతిభను పెంపొందించడం అత్యంత ప్రాధాన్యం కలిగిన అంశం.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### వికసిత భారత్ సాధ్యమా?

పన్నెండవ పంచ వర్షప్రణాళికలో పేర్కొన్నట్టు వేగవంతం అయిన సమ్మిళిత ఆర్థిక వృద్ధేభారత్ లాంటి దేశాలకు శ్రీరామ రక్షఎందుకని భారత్ ఇప్పటికి వ్యవసాయ ఆధారిత ఆర్థికవ్యవస్థతో,గ్రామీణ ఆర్థికవ్యవస్థతో ముడిపడి ఉంది. కాబట్టి గ్రామీణ అభివృద్ధి లక్ష్యంగా బడ్జెట్ కేటాయింపులు జరగాలి. భారత్ ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం చేపుతున్నట్టు వికసిత భారతం వైపు అడుగులు వేయాలి.

- భారత అవినాష్, జనగామ

### కల్తీ నూనె విక్రయాల జోరు

వంటనూనెల ధరలు విపరీతంగా పెరిగిపోతుండటంతో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలలో కల్తీ నూనె విక్రయాలు జోరుగా సాగుతున్నాయనే ఆరోపణలు వినవస్తున్నాయి. కొంతమంది వ్యాపారులు కల్తీనూనె విక్రయిస్తున్నారు. అధికారులు మొక్కుబడిగా తనిఖీలు నిర్వహించి వెళ్తున్నారే తప్ప కల్తీ నూనె విక్రయాలను అరికట్టలేకపోతున్నారనే విమర్శలు ఉన్నాయి. హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, వివిధ ప్రాంతాల నుంచి డ్రమ్ములు, క్యాన్లలో నూనెను వివిధప్రాంతాలకు తరలించి విక్రయిస్తున్నారు. అలాగే లూజు నూనె పేరుతో విక్రయిస్తున్నారు. కొన్ని ప్రాంతాలలో గిరిజనుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని కొంతమంది వ్యాపారులు నకిలీ నూనెను విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. విజిలెన్స్, రెవెన్యూ, ఫుడ్ ఇనస్పెక్టర్ అధికారు లు విస్తృతంగా తనిఖీలు నిర్వహించి కల్తీనూనె విక్రయిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి..

- కామిడి సతీశ్ రెడ్డి,భూపాలపల్లి జిల్లా

### న్యాయస్థాన గౌరవానికి దెబ్బ

దేశ రాజధానిలోని సుప్రీంకోర్టులో జరిగిన ఘటన దేశాన్ని కలవరపరిచింది. ఢిల్లీకి చెందిన న్యాయవాది రాకేష్ కిశోర్ ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్. గవాయి గారిపై కోర్టు మధ్యలో చెప్పు విసిరిన ఘటన తీవ్ర ఆగ్రహానికి కారణమైంది. సనాతన ధర్మానికి అవమానం సహించను" అని నినదిస్తూ ఈ ఘటన జరగడంతో కోర్టు వాతావరణం క్షణాల్లో ఉద్రిక్తమైంది. వెంటనే భద్రతా సిబ్బంది ఆ న్యాయవాదిని అదుపులోకి తీసుకున్నారు. ఈ చర్యను బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఖండిస్తూ, ఆయన న్యాయవృత్తి అనుమతిని తాత్కాలికంగా రద్దు చేసింది. న్యాయ వ్యవస్థ పట్ల అసంతృప్తి లేదా విభిన్నాభిప్రాయాలు ఉన్నా, వాటిని చట్టపరమైన మార్గాల్లోనే వ్యక్తపరచాలి.

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

### ప్రతిభను ప్రోత్సహించాలి

తల్లిదండ్రులు తమ పిల్లలను బాగా చదివి పైకిరావాలని ఆశించడం సహజమైనప్పటికీ వారికి ఏరంగంలో ఆసక్తిగలదో తెలుసుకోవాల్సిన అవసరంఉంది.అందుకు ఉపాధ్యాయులు విలువగల విద్యను అందించి విద్యార్థుల్లో దాగివున్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలి. చిన్న చిన్న తప్పులను క్షమించి మరోసారి పునరావృతం కాకూడదని గట్టిగా హెచ్చరించాలి. పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ విద్యార్థుల భవిష్యత్‌కు కీలకం కావాలి.

-ఆర్.వెంకటేష్ చరన్, బెంగళూరు

మనవి
ఎడిట్ పేజీకి..
ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# 'చేనేత'కు అక్కరకు రాని జిఎస్‌టి

*నిజానికి చేనేత వస్త్రాలు విలాసవంతమైన వస్తువులు కావు. అవి సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతీక. ముఖ్యంగా, లక్షలాది మందికి జీవనోపాధి. అలాంటి వస్తువులపై జిఎస్‌టిని తీసివేయాలి. లేదా ధరల సీలింగ్ లిమిట్‌ను పెంచాలి. స్వదేశీ వస్తువులనే ప్రోత్సహించాలి. వోకల్ ఫర్ లోకల్, స్వదేశంలోనే ప్రతి వస్తువును తయారు చేయాలంటూ 'మేక్ ఇన్ ఇండియా'. ఆత్మనిర్భర్ భారత్ వంటి పథకాలకు శ్రీకారంచుట్టింది కేంద్ర ప్రభుత్వం. కానీ స్వదేశీ సంప్రదాయాలకు నిలువుటద్దంగా నిలిచే చేనేత వస్త్రాలపై 18 శాతం జిఎస్‌టి విధించడం సరికాదు. జిఎస్‌టి పెంపు ద్వారా చేనేత రంగంపై ఆధార పడ్డ కార్మికుల జీవనోపాధిని దూరం చేయడమే కాకుండా శతా బ్దాలుగా వారసత్వ సంపదగా వస్తున్న చేనేత సంస్కృతిని అడ్డుకోవడమే. ఒకవిధంగా ఈ నిర్ణయంతో గ్రామీణ జీవన విధానాలలో భాగమైన చేనేత వృతి కనుమరుగవడం కాయం. అందుకే, కేంద్ర ప్రభుత్వం చేనేత వస్త్రాలపై జిఎస్టని పునఃసమీక్షించాలి.*



డాక్టర్ రామకృష్ణ బండారు

మన దేశంలో చేనేత పరిశ్రమ అత్యంత పురాతనమైన వృత్తి. దీనిని దేశ వారసత్వ సంపదగా కూడా గుర్తిస్తారు. వ్యవసాయ రంగం తరు వాత దేశంలో ఎక్కువమంది గ్రామీణ ప్రజలు ఆధారపడ్డ రంగం చేనేత రంగం. ముఖ్యంగా, ఎక్కువ మంది మహిళలు ఆధారపడ్డ రంగం ఇది. గ్రామీణ మహిళా సాధికారతకు అండ గా నిలిచేది చేనేత రంగం మాత్రమే చేనేత పరిశ్రమ మీద ఆధారపడి దేశం లో కొన్ని లక్షల మంది జీవనం సాగిస్తు న్నారు. 2019-20 జాతీయ హ్యాండ్లూమ్ సెన్సస్ ప్రకారం సుమారు 26,73, 891 మంది నేతకార్మికులు మన దేశంలో ఉన్నారు. వారిలో 88.7 శాతం గ్రామీణ ప్రాంతాలవారు కాగా 11.3 శాతం పట్టణ ప్రాంతానికి చెందినవారు. మొత్తం చేనేత కార్మికుల లో 71.6 శాతం మహిళలు, 28.4 శాతం పురుషులు.సుమారు 2,10,751 మంది పరోక్షంగా ఈ రంగంపై ఆధారపడి ఉన్నారు. తెలుగు రాష్ట్రాలలో కూడా చేనేత కార్మికుల సంఖ్య ఎక్కువే. తెలంగాణలో సుమారు 27,916 కుటుం బాలు చేనేత పరిశ్రమ మీద ఆధారపడి ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాలలో 19,417 కుటుంబాలు, పట్టణ ప్రాంతాలలో 8,499 కుటుంబాలు చేనేత వృత్తినే నమ్ముకున్నాయి. అలాగే,ఆంధ్రప్రదేశ్‌లో 1,22,644 కుటుంబాలు ఉండగా,గ్రామీణ ప్రాంతాలలో 77,065,పట్టణ ప్రాంతాలలో 45,579 చేనేత కుటుంబాలు ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల చేనేత వస్త్రాలకు దేశవ్యాప్తంగా ఎంతో ప్రాముఖ్యత ఉన్నది. పోచంపల్లి, గద్వాల్, ఉప్పాడ, వేంకటగిరి మంగళగిరి ధర్మవరం వంటి ప్రాంతాలు చేనేత వస్త్రాల తయారీకి పెట్టింది పేరు. అలాగే ఈ ప్రాంతాలలు జియోగ్రాఫికల్ ఇండికేషన్ ట్యాగ్ సైతం కలిగివున్నాయి. దేశ వ్యాప్తంగా చేనేత వస్త్రాలు ఎంతో ప్రాముఖ్యత ఉన్నది. కానీ ఇటీవల వస్తు సేవల పన్ను (జిఎస్‌టి)లో కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన మార్పులలో భాగంగా చేనేత,టెక్స్టైల్ రంగంపై ఏకంగా 18 శాతం జిఎస్‌టిని విధించడంతో ఆయా రంగాల పై పెనుభారం పడనుంది. ఇప్పటికే 5శాతం జిఎస్‌టి వలన చేనేత పరిశ్రమ భారీగా నష్టపోతోంది. జిఎస్‌టి 20 లో చేనేత దుస్తులను 18 శాతం స్లాబ్‌లో చేర్చడంపై పరిశ్రమ వర్గాలే కాకుండా ఇటు వినియోగదారులు సైతం అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం 1000 రూపాయల కంటే తక్కువ ధర ఉన్న చేనేత వస్త్రాలపై 12 శాతం జిఎస్‌టిని విధిస్తున్నారు. నూతన జిఎస్‌టి మార్పులలో భాగంగా, 2500 రూపాయల కంటే తక్కువ ధర ఉండే వస్త్రాలపై 5 శాతం,2500 రూపాయల కంటే ఎక్కువ ధర ఉండే చేనేత, ఇతర వస్త్రాలపైఉన్న 12 శాతం జిఎస్‌టిని 18 శాతంకు పెంచారు. ఈ నెల 22నుండి నూతన రేట్స్ అమలులోకి వచ్చాయి. వాస్తవానికి, జిఎస్‌టి మార్పులలో భాగంగా చేనేత వస్త్రాలపై పన్నును ఎత్తివేస్తారు అనిభావించిన పరిశ్రమ వర్గాలకు జిఎస్‌టిని 12 శాతం నుండి 18 శాతంకు పెంచడం ఆశ్చర్యానికి గురి చేసింది. జిఎస్‌టి పెంపుతో దేశవ్యాప్తంగా చేనేత వస్త్రాల ధరలుపెరుగుతాయి. ఫలితంగా డిమాండ్ తగ్గి చేనేత పరిశ్రమకు నష్టాలు వాటిల్లే అవకాశం ఉన్నది. మొదటి నుండి చేనేత రంగానికి జీఎస్టీ



భారంగా మారింది. 5శాతం పన్నుతో ఈ రంగం మనుగడ కోల్పోతున్న పరిస్థితి నెలకొంది. దేశంలో కొన్ని రాష్ట్రాలు ముడి సరుకుపై సబ్సిడీని, చేనేత వస్త్రాలపై జిఎస్‌టి పన్ను భారాన్ని భరించడానికి ముందుకు వచ్చినప్పటికీ దేశవ్యాప్తంగా చేనేత కార్మికులు, సంఘాలు, పరిశ్రమ పన్నుల భారంతో నష్టాలు ఎదుర్కుంటున్నారు. చేనేత కార్మికులు చేతితో తయారు చేసే వస్త్రాలు భారతీయ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతిబింబాలు. చేనేత వస్త్రాలను తయారు చేయడం అంత సులభమైన ప్రక్రియకాదు. ఒక్కో చీరను తయారు చేయడానికి సుమారు 4 నుండి 5 గంటల సమయం పడుతుంది. సహజ సిద్ధమైన దారాలు, రంగులు వంటి ఇతర ముడిసరుకులను ఉపయోగించి భారతీయత కనిపించేలా చేనేత వస్త్రాన్ని తయారు చేస్తారు. అయితే గత కొన్నేళ్లుగా, మార్కెట్‌లో ముడి సరుకుల ధరలు విపరీతంగా పెరిగాయి. ఫలితంగా వస్త్రాలధరలు పెంచడం ద్వారా 5 శాతం స్లాబ్ నుండి 12 శాతం స్లాబ్‌లోకి రావడంతో పన్నుభారం పెరిగి, ధరలు పెరిగి వస్త్రాలకు మార్కెట్‌లో డిమాండ్ లేకుండా పోతుంది.ఫలితంగా ఆదాయం లేక ఇప్పటికే చాలా కుటుంబాలు చేనేత వృత్తిని వదిలి ఇతర వృత్తులను ఎంచుకుంటున్నారు. ఇక ప్రస్తుత 12శాతం నుండి 18 శాతానికి జిఎస్‌టి పెంచడంతో రానున్న రోజుల్లో చేనేత పరిశ్రమ మరింత నష్టాలను ఎదుర్కోక తప్పదు. ఇప్పటికే, చేనేత వృత్తి లాభదాయకం కాకపోవడంతో యువత ఈ రంగాన్ని ఎంచుకోవడంలేదు. భవిష్యత్‌లో పన్నులు పెరగడంతో చేనేత వస్తువులకు ధరలు పెరిగి,మార్కెట్‌లో డిమాండ్ పడిపోయి మరింత నష్టాలు రావడం. తద్వారా చేనేత పరిశ్రమ కనుమరుగయ్యే అవకాశాలు లేకపోలేదు. కార్మికుడి శ్రమతో యంత్రాలు ఉపయోగించకుండా, చేతులతో తయారు చేసే చేనేత ఎంతో మన్నికైనవి. సహజ సిద్ధమైన ముడి సరుకుల ధర కూడా అధికం. ఎంతో కష్టంతో కూడుకుని ఉన్న చేనేత వస్త్రాలు 2500రూపాయల కంటే తక్కువ ధరతో మార్కెట్‌లో అమ్మడం సాధ్యమేనా? దేశంలో పేరొందిన పోచంపల్లి, కంచి, బెనారస్, ధర్మవరం, గద్వాల్ వంటి ఇతర చేనేత వస్త్రాలు కేవలం 2500 రూపాయలకు మార్కెట్‌లో దొరుకుతాయా? కొత్త జిఎస్‌టి ప్రకారం 2500 పైన ధర ఉండే వస్త్రాలపై 18 శాతం పన్ను విధింపపడతాయి. అంటే, భవిష్యత్‌లో ముడిసరుకు,ఇతర కారణాలతో చేనేత వస్త్రాల ధరలు పెరగక తప్పదు. ఫలితంగా, 5 శాతం పన్ను నుండి 18 శాతం పన్ను స్లాబ్‌లోకి రావడంతో ధరలు పెరిగి ఆ భారం వినియోగదారుని మీద పడుతుంది. అప్పుడు చేనేత వస్త్రాలకు మార్కెట్‌లో కొనుగోలు తగ్గి వాటి మీద ఆధార పడ్డ చేనేత కార్మికులకు నష్టాలు వస్తాయి. గమనించదగ్గ విషయం ఏమిటంటే,చేనేత వస్త్రాలపై జిఎస్‌టిని 18 శాతానికి పెంచిన కేంద్రం, ఎటువంటి శ్రమ లేకుండా కృత్రిమ దారాలతో, యంత్రాల సహాయంతో తయారు చేసే పాలిస్టర్ వంటి వస్త్రాలపై జిఎస్‌టిని 12 శాతం నుండి 5 శాతంకు తగ్గించింది. యంత్రాల సహాయంతో తయారు చేసిన వస్త్రాలు తక్కువ ధరలకు లభించడంతో వినియోగదారులు వాటి పై మొగ్గు చూపే అవకాశం ఉంటుంది. ఫలితంగా చేనేత పరిశ్రమకు మరింత నష్టాలు తప్పవు. నిజానికి చేనేత వస్త్రాలు విలాసవంతమైన వస్తువులు కావు. అవి సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతీక. ముఖ్యంగా, లక్షలాది మందికి జీవనోపాధి. అలాంటి వస్తువులపై జిఎస్‌టిని తీసివేయాలి. లేదా ధరల సీలింగ్ లిమిట్‌ను పెంచాలి. స్వదేశీ వస్తువులనే ప్రోత్సహించాలి. వోకల్ ఫర్ లోకల్, స్వదేశంలోనే ప్రతి వస్తువును తయారు చేయాలంటూ 'మేక్ ఇన్ ఇండియా'. ఆత్మనిర్భర్ భారత్ వంటి పథకాలకు శ్రీకారంచుట్టింది కేంద్ర ప్రభుత్వం. కానీ స్వదేశీ సంప్రదాయాలకు నిలువుటద్దంగా నిలిచే చేనేత వస్త్రాలపై 18 శాతం జిఎస్‌టి విధించడం సరికాదు. జిఎస్‌టి పెంపు ద్వారా చేనేత రంగంపై ఆధార పడ్డ కార్మికుల జీవనోపాధిని దూరం చేయడమే కాకుండా శతా బ్దాలుగా వారసత్వ సంపదగా వస్తున్న చేనేత సంస్కృతిని అడ్డుకోవడమే. ఒకవిధంగా ఈ నిర్ణయంతో గ్రామీణ జీవన విధానాలలో భాగమైన చేనేత వృతి కనుమరుగవడం కాయం. అందుకే, కేంద్ర ప్రభుత్వం చేనేత వస్త్రాలపై జిఎస్టని పునఃసమీక్షించాలి. •

# ప్రపంచ దేశాల నెత్తిన ఆర్థిక అస్థిరత్వం

ఐ.ప్రసాదరావు

కోవిడ్ 19 సంభవించిన నాటి నుంచి నేటివరకు దాదాపు అన్నిదేశాలు ఆర్థిక అస్థిరత్వంతో తల్లడిల్లుతున్నాయి. నేటికీ చాలా దేశాల్లో పూర్తిస్థాయిలో వ్యవసాయ పారిశ్రామిక సేవారంగాలు పుంజుకోలేదు. ప్రజల్లో కొనుగోలు శక్తి క్షీణించింది. ముఖ్యంగా మన దేశంలో పేద మధ్యతరగతి ప్రజలు కరోనా వైరస్ సృష్టించిన విలయతాండవం నుంచి నేటికీ తేరుకోలేదు. వలస వెళ్ళినవారు స్వస్థలాలకు చేరుకుని, తిరిగి వెళ్ళలేదు.దీంతో ఉద్యోగ ఉపాధి అవకాశాలు కోల్పోయిరి. అల్ప ఉపాధితో కాలం గడుపుతున్నారు. దీనికి తోడు అధిక ధరలు, ద్రవ్యోల్బణం పెరుగుదలతో బ్రతుకులు బహు భారంగా మారింది. నిన్నటి వరకూ జి.యస్.టి భారం. ఇదే సమయంలో విద్యా, వైద్య వైద్యం ప్రైవేటీకరణ జరుగుటచే,సంపాదించిన ఆదాయం కాస్త వీటిపై ఖర్చు చేయడం ద్వారా, దాదాపు డెబ్బై శాతం కుటుంబాలు అప్పులు ఊబిలో చిక్కుకుపోయాయి. గతంలో పారు ( మొండి) బకాయిలు ఎక్కువగా బడా పారిశ్రామిక సంస్థలు, పారిశ్రామిక వేత్తల పేర్ల మీద ఉండేవి. వీటికితోడు, నేడు ఈ బకాయిలు ఎక్కువగా వ్యక్తిగత ఖాతాల్లో నమోదు అవుతున్నాయి.ఈ పరిణామాలు ఆందోళనకరమైనవి.దీనికి ప్రధాన కారణం ఉపాధి అవకాశాలు లేకపోవడం. నిరుద్యోగం పెరుగుతుంది. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. అన్నిటికీ మించి 'పొదుపు' కరువైంది. దీనికితోడు 'అనవసర వినియోగం' అనగా 'వినిమయ సంస్కృతి' పెరుగుతుంది. దీంతో మధ్య తరగతి ప్రజల్లో పొదుపు కరువైంది. అప్పులు కుప్పలుగా కుటుంబాలు నెలవు అవుతున్నాయి. ఇక పేద ప్రజల కష్టాలు వర్ణనాతీతం. దేశంలో నేటికీ ఎనభై శాతం మంది ప్రభుత్వాలు ఇచ్చే పెన్షన్, ఉచిత బియ్యం పథకం పై జీవనం సాగిస్తున్నారు. అయితే విచిత్రంగా దేశంలో మిలియనీర్లు, బిలియనీర్ల సంఖ్యపెరిగింది.. సంపద కేంద్రీకృతమైంది. ముఖ్యంగా జి.డి.పి పెరుగుతుంది. దీంతో ప్రపంచంలోనే అతిపెద్ద నాలుగో ఆర్థిక వ్యవస్థగా భారత్ కొనసాగుతోంది. వాస్తవానికి ఈ జీ.డి.పికి, దేశంలో ఎనభై శాతం ఉన్న పేద మధ్యతరగతి ప్రజల ఆదాయానికి, జీవన ప్రమాణాలకు,ఆర్థిక పరిస్థితులకు చాలా వ్యత్యాసం ఉంది. ఒక్కమాటలో చెప్పాలంటే నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా.ఇక్కడే పాలకులు, మేధావులు, వివిధ ఆర్థిక సర్వే సంస్థలు, ఆర్థికవేత్తలు బహు జాగ్రత్తగా పరిశీలించాలి. నేటికీ పేదరికం భారీస్థాయిలో ఉంది. చాలామంది వేతనాలు కనీసం మూడుపూటలా భోజనం చేయడానికి సరిపోవడం లేదు అనేది కఠోరవాస్తవం. బడా పారిశ్రామిక సంస్థలకు వ్యక్తుల కు కారుచౌకగా ప్రకృతి వనరులు ధారాదత్తం చేయరాదు. ఋణ మాఫీలు, రాయితీలు ఆర్థిక వ్యవస్థను బలహీన పరుస్తోంది. ముఖ్యంగా పాలకులుఆర్థిక వ్యవస్థను బలోపే తం చేసేందుకు సన్నాహాలు చేయాలి. ప్రజలకు, యువతకు ఉద్యోగఉపాధి అవకాశాలు మెరుగుపరచాలి. వ్యవసాయ పారిశ్రామిక రంగాలను అభివృద్ధి పరుచుకోవాలి. ఇక ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక వ్యవస్థలు ఆందోళనకరంగా మారడానికి కరోనా వైరస్ సృష్టించిన విలయతాం డవం ఒక కారణం అయితే, తదుపరి రష్యా, ఉక్రెయిన్ యుద్ధం, ఇజ్రాయెల్, పాలస్తీనా గాజాపై యుద్ధం, ఇటీవల అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీసుకుంటున్న 'టారిఫ్ నిర్ణయాలు' మొత్తం ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తున్నాయి. సాక్షాత్తూ అమెరికాలో కూడా 'షట్ డౌన్' అవుతుంది. అమెరికా డాలర్ విలువ క్షీణిస్తుంది. అమెరికా ఆంక్షల వల్ల యూరోపియన్ యూనియన్ దేశాలు కూడా గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటున్నారు.చైనాలో పరిస్థితి గోప్యంగా ఉన్నా, కొంతమేరకు అక్కడ వస్తు ఎగుమతులు లేక పరిశ్రమలు మూతపడ్డాయి అని నిఘా వర్గాలు తెలుపుతున్నాయి.ఇక మన ఆసియా ఖండంలో ముఖ్యంగా మన ఇరుగు పొరుగు దేశాలైన శ్రీలంక, బంగ్లాదేశ్,నేపాల్, పాకిస్థాన్, మయన్మార్ రాజకీయ అస్థిరత్వంతో ఆర్థిక వ్యవస్థ కుప్పకూలింది. మరోవైపు భూకంపాలు,వరదలు వలనఎంతో నష్టం చవిచూస్తున్నాయి. రష్యా గత నాలుగు సంవత్సరాలుగా యుద్ధం చేయడంవల్ల, ఆర్థికపరిస్థితి దెబ్బతింటున్నది. వేళ్ళమీద లెక్కపెట్టే కొన్నిదేశాలు మినహా,దాదాపు ప్రపంచంలోని అన్నిదేశాలు ఆర్థిక అస్థిరత్వంతో తల్లడిల్లుతున్నాయి. ఇటువంటి విపత్కర పరిస్థితుల్లో ప్రపంచ దేశాల్లో ఆర్థిక పరిస్థితులు మెరుగుపరుచుకోవాలి అంటే ముఖ్యంగా దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు, స్నేహసంబంధాలు మెరుగు పరుచుకోవాలి. ఆధిపత్యధోరణి తగ్గించుకోవాలి.గ్లోబలైజేషన్ వలన ప్రపంచం అంతా కుగ్రామంగా మారిన ప్రస్తుత పరిస్థితుల్లో అన్ని దేశాలు ఒకరికి ఒకరు సహకారించుకోవాలి. ఎగుమతి దిగుమతి సుంకాలు అందరికీ ఆమోదయోగ్యమైన రీతిలో ఉండాలి. వలస వ్యతి రేకత ఉండరాదు. ప్రతీకార సుంకాలతో పగలు పెంచుకోరాదు. ముఖ్యంగా యుద్ధాలు జోలికి పోకుండా, సమస్యలను చర్చల ద్వారా పరిష్కారించుకోవాలి.ఏ ఉద్దేశంతో అయితే 1945లో ఐక్యరాజ్యసమితి ఏర్పాటు చేయడం జరిగిందో, ఆ ఆశయాలు లక్ష్యాలు నెరవేర్చడానికి అన్ని దేశాలు ప్రయత్నాలు చేయాలి. •

# జపాన్ ప్రధాని ముందున్న సవాళ్లు

డి జె మోహన రావు

జపాన్ రాజకీయం మరోసారి కల్లోలంలో పడింది. మధ్యలోనే ప్రధాని పదవి ముగియడం, పార్టీలో అంతర్గత గొడవలు, ఆర్థిక సంక్షోభం, ప్రజల నమ్మకం కోల్పోవడం వంటి కారణాలతో దేశం అస్థిరతలోకి జారుకుంది. అయితే, ఈ సంక్షోభం ఒక చారిత్రక పరిణామానికి నాంది పలికింది. సనే తకైచి జపాన్ తొలి మహిళా ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ రాజకీయ సంక్షోభంలో పదవిని కోల్పోయిన మాజీ ప్రధాని షిగేరు ఇషిబా. 2024 అక్టోబర్‌లో ప్రధాని అయిన ఆయన, కేవలం ఒక సంవత్సరంలోనే రాజీనామా చేయాల్సి వచ్చింది. అవినీతి ఆరోపణలు, ఎన్నికల్లో ఘోర పరాజయాలు, లిబరల్ డెమోక్రటిక్ పార్టీ (ఎల్‌డిపి)పై ప్రజల్లో పెరిగిన అసంతృప్తి ఇందుకు ప్రధాన కారణాలు. దశాబ్దాల తర్వాత, ఎల్‌డిపి పార్లమెంట్‌లో తన మెజారిటీని కోల్పోయింది. యెన్ విలువ పడిపోవడం, నిత్యావసరాల ధరలు పెరగడం, జీతాలు పెరగకపోవడం వంటి ఆర్థిక సమస్యలు ప్రజల కోపానికి కారణమయ్యాయి. ఈ అంశాలతో పాటు, పార్టీలోని వారి ఒత్తిడి కారణంగా ఇషిబా రాజీనామా తప్పనిసరి అయ్యింది.ఇషిబా రాజీనామాతో ఎల్‌డిపిలో హోరాహోరీ పోటీ జరిగింది. ఈ పోటీలో సనే తకాయచి విజయం సాధించి, అక్టోబర్ మధ్య నాటికి పార్లమెంట్ ఆమోదంతో ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఆమె గెలుపు కేవలం జపాన్ తొలి మహిళా ప్రధాని కావడమే కాదు, కఠిన సంప్రదాయవాద భావజాలం కలిగిన నాయకురాలు అధికారంలోకి రావడం కూడా ఒక చారిత్రక ఘట్టం. ఆమె దివంగత ప్రధాని షింజో అబేకు అత్యంత సన్నిహితురాలు.అబే జాతీయవాద విధానాలను ముందుకు తీసుకెళ్లాలనే లక్ష్యం ఆమెకు ఉంది. దేశం మార్పు కోరుకుంటున్న సమయంలో, ఆమె విజయం మరింత గంభీరమైన రాజకీయ మార్పుకు సంకేతం.నూతన ప్రధాని ముందు ఉన్న సవాళ్లు చిన్నవి కావు. దేశంలో రాజకీయ స్థిరత్వాన్ని తీసుకురావడం, ఆర్థిక ఒత్తిళ్లను తట్టుకోవడం, సామాజిక సమస్యలను పరిష్కరించడం ఆమెకు అత్యంత కీలకం. జపాన్ చరిత్రలో తరచుగా ప్రధానులు తక్కువ కాలంలోనే పదవీ విరమణ చేయడం సర్వసాధారణం. ఇప్పుడు అదే పరిస్థితి మళ్లీ ఎదురవుతుందేమోనని జపనీయులు ఆందోళన చెందుతున్నారు. తకాయచి ముందు ఉన్న అతిపెద్ద సవాలు ఇదే. ముఖ్యమైన చట్టాలు, బడ్జెట్ ఆమోదం పొందాలంటే ప్రతిపక్షం మద్దతు అనివార్యం.ప్రతిపక్షంతో కలిసి పనిచేస్తూ, ప్రభుత్వాన్ని స్థిరంగా నడిపించ



గలిగితేనే ఆమె నాయకత్వం నిలబడుతుంది. జపాన్ ఆర్థిక వ్యవస్థ దశాబ్దాలుగా స్తబ్దంగా ఉంది. యెన్ విలువ తగ్గిపోవడంతో జీవన వ్యయం పెరిగింది. అబే తరహాలోనే తకాయచి కూడా ప్రభుత్వవ్యయాన్ని పెంచేందుకు మొగ్గు చూపినా, ప్రజలు కోరుకునేది మాత్రం జీతాల పెంపు, మెరుగైన జీవన ప్రమాణాలు. ఈ దిశగా ఆమె తీసుకునే చర్యలుఆమె పాలనకు కీలకం కానున్నాయి. పెరిగిన వృద్ధ జనాభా వల్ల సామాజిక సంక్షేమ ఖర్చులు పెరుగుతూ, దేశంపై మరింత ఆర్థిక భారం పడుతోంది. ఎన్నికల ఓటములు పార్టీ నాయకత్వంపై నమ్మకాన్ని దెబ్బతీశాయి. 'జపాన్ ఫస్ట్' అనే నినాదంతో వలసలు, భద్రత, సైనిక బలోపేతంపై కఠిన వైఖరిని కోరుకునే వర్గాలు పార్టీలో బలంగా మారుతున్నాయి. తకాయచి కఠిన వైఖరి ఈ వర్గానికి అనుకూలంగా ఉన్నప్పటికీ, ప్రజల అసంతృప్తిని తగ్గించాలంటే ఆమె సమన్వయం సాధించాల్సి ఉంటుంది. దేశీయ సవాళ్ల మాదిరిగానే విదేశాంగ విధానం కూడా తకాయచికి కీలకం. ఆమె జపాన్ భద్రత కోసం బలమైన సైన్యం, అమెరికాతో పటిష్టమైన భాగస్వామ్యం, చైనాపై కఠిన వైఖరిని కోరుకుంటారు. అమెరికాతో సంబంధాలు బలంగానే కొనసాగే అవకాశం ఉన్నా,తిరిగి అధికారంలోకి వచ్చిన డొనాల్డ్ ట్రంప్ వల్ల కొత్త చిక్కులు తలెత్తవచ్చు. జపాన్ రక్షణ ఖర్చులను జీడీపీలో 3.5శాతం వరకు పెంచాలని ట్రంప్ డిమాండ్ చేసే అవకాశంఉంది. ఈ ఒత్తిడిని సమర్థంగా ఎదుర్కొంటూ, అమెరికా మద్దతును నిలుపుకోవడం తకాయచికి ఒక సవాలు.ఆసియా పొరుగు దేశాలైన చైనా, దక్షిణ కొరియా పట్ల ఆమె వైఖరి కఠినంగా ఉండవచ్చు. అబే జాతీయవాదానికి మద్దతు, రాజ్యాంగంలోని ఆర్టికల్ 9 మార్పు సూచనలు, యాసుకుని మందిర సందర్శన వంటి అంశాలు ప్రాంతీయ ఉద్రిక్తతలను పెంచవచ్చు.అయినప్పటికీ, చైనా జపాన్‌కు ప్రధాన వ్యాపార భాగస్వామి కాబట్టి, తకాయచి తన మాటల్లో కొంత మృదుత్వాన్ని పాటించే అవకాశం ఉంది. ఆమె భారతదేశం, ఆస్ట్రేలియా వంటి దేశాలతో సంబంధాలు బలోపేతం చేసి,క్వాడ్ కూటమిలో జపాన్ పాత్రను మరింత పెంచాలనుకుంటున్నారు. సనే తకాయచి అధికారంలోకి రావడం రాజకీయంగా అనివార్యమైనప్పటికీ, ఇది పాత సంప్రదాయవాదానికి కొత్త చారిత్రక మలుపుగా మారింది. ఎల్‌డిపి తన పట్టును నిలుపుకునే ప్రయత్నం చేస్తూనే, ఒక మహిళా నాయకురాలిని ప్రోత్సహించడం జపాన్ రాజకీయ మార్పుకుసంకేతం. తకాయచికి ముందు ఉన్న పరీక్షలు కఠినమైనవి. ప్రతిపక్షంతో సయోధ్య, ఆర్థిక స్థిరత్వం, విదేశాంగ సమతుల్యత. ఈ పరీక్షల ఫలితమే ఆమెను జపాన్ 'ఐరన్ లేడీ'గా మారుస్తుందా లేదా మరో తాత్కాలిక ప్రధానిగా మిగిలిపోతుందా అన్నది నిర్ణయిస్తుంది. యుద్ధానంతర రాజకీయ స్థిరత్వం ముగిసిన తర్వాత, జపాన్‌లో ప్రారంభమైన ఈ కొత్త అధ్యా యం ఎంతవరకు కొనసాగుతుందో చూడాలి. •

## చీమకుర్తికి స్వచ్ఛ ఆంధ్ర అవార్డులు

**చీమకుర్తి, అక్టోబర్ 7, ప్రభాతవార్త**









రాష్ట్రస్థాయిలో స్వచ్ఛ గ్రామంగా చీమకుర్తి మండలం ఆర్ ఎల్ పురం పంచాయతీ ఎంపికయింది. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ అవార్డులను సోమవారం సాయంత్రం అందజేశారు. రాజుపాలెం లక్ష్మీపురం సర్పంచ్ పుల్లగూర రవణమ్మ, పంచాయతీ కార్యదర్శి శంకర్, జిల్లా పంచాయతీ అధికారి లు ముఖ్యమంత్రి వద్ద నుంచి స్వచ్ఛ పంచాయతీ అవార్డును స్వీకరించారు. స్వచ్ఛ ప్రభుత్వ ఆసుపత్రిగా చీమకుర్తి వైద్యశాల( సిహెచ్ సి) ఎంపికైంది. ఈ అవార్డును డాక్టర్ వేణుగోపాల రెడ్డి ముఖ్యమంత్రి చేతుల మీదుగా స్వీకరించారు.

## పచ్చని చెట్లను నరికేస్తున్నారు..ఎండు చెట్ల కొట్టివేత సాకుగా విజృంభన

**చీమకుర్తి, అక్టోబర్ 7, ప్రభాతవార్త**





పచ్చని చెట్ల కొమ్మలను నిర్దాక్షిణ్యంగా నరికేస్తున్నారు. వాహనదారులకు గొడుగులా నిలబడి నీడనిచ్చే పెద్ద పెద్ద కొమ్మలను యంత్రాలతో కోసి అమ్మేసుకుంటున్నారు చీమకుర్తి నుంచి ఒంగోలు వెళ్లే కర్నూలు రహదారికి పక్కనే ఉన్న పెద్ద పెద్ద వృక్షాలను నరికేసి అమ్ముకుంటున్నప్పటికీ ఆర్ అండ్ బి అధికారులు ఆ వైపుగా చూడటం లేదు. చీమకుర్తి సంతనూతల పాడు మధ్యలో గత వారం రోజులుగా కొమ్మలు నరికేసి తరలించుకునే దందా జరుగుతోంది. ఎండు చెట్ల తొలగింపు అనుమతులు మాటున కాంట్రాక్టర్ పచ్చని చెట్ల కొమ్మలను దారుణంగా కోసి అమ్ముకుంటున్నాడు. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు ఎలా ఉన్నాయి చీమకుర్తి ఒంగోలు రహదారికి ఇరువైపులా గత 40, 50 ఏళ్ల నుంచి పెద్ద పెద్ద చెట్లు మానులుగా పెరిగి వాహనదారులకు నీడను, పర్యావరణ పరిరక్షణకు అండగా నిలుచున్నాయి. ఇందులో అక్కడక్కడ కొన్ని చెట్లు ఎండిపోవడం గమనించిన బిజెపి నాయకులు గుండా శ్రీనివాసరావు కలెక్టర్కు ఫిర్యాదు చేశారు. ఈ చెట్లు హఠాత్తుగా పడిపోతే ప్రజలకు గాని వాహనదారులు గాని ప్రమాదం సంభవిస్తుందని వారు ఫిర్యాదుల పేర్కొన్నారు. తక్షణ అనుమతి ఇచ్చి ఈ ఎండు చెట్ల వరకు తొలగించాలని వారు కోరారు. అయితే దీనికి జిల్లా యంత్రాంగం ఆర్ అండ్ బి శాఖ ద్వారా అనుమతి ఇచ్చారు. రెండు మూడు రోజులపాటు కాంట్రాక్టర్ సిబ్బంది ఎండుచెట్లను తొలగించేశారు. సందట్లో సడే మియా లాగా భారీగా పెరిగిన పెద్ద పెద్ద చెట్లపై వాళ్లు కన్నేశారు. నరుకుడు యంత్రాలతో పెద్ద పెద్ద కొమ్మలను కోసి దుంగలుగా మార్చి అమ్మేసుకుంటున్నారు. ఇదేంటని అడుగుతుంటే అధికారులే అనుమతించారు అని వాళ్ళు సమాదానం చెప్తున్నారు . ఈ వ్యవహారం తప్పుడు దారిలో వెళ్తుందని తెలుసుకున్న బిజెపి నాయకుడు గుండా శ్రీనివాసరావు ఆర్ అండ్ బి అధికారులకు, జాయింట్ కలెక్టర్కు మంగళవారం సాయంత్రం ఫిర్యాదు చేశారు ఎండు చెట్ల తొలగింపు పేరుతో పచ్చని చెట్ల కొమ్మలను కోసి అమ్ముకోవడాన్ని తక్షణమే ఆపివేయాలని వారు డిమాండ్ చేశారు. దీనికి అధికార యంత్రాంగం స్పందించి తగు చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు.

## జైలు జీవితం గడపడం దురదృష్టకరం

**ఒంగోలు, ప్రభాతవార్త**




క్షణికావేశంలో తప్పులు చేయటం వలన నేరస్తులుగా మారి కుటుంబానికి మరియు సమాజానికి దూరంగా జైలు జీవితం గడపడం ఎంతో దురదృష్టకరమని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి మరియు సీనియర్ సివిల్ న్యాయమూర్తి షేక్ ఇబ్రహీం షరీఫ్ అన్నారు. మంగళవారం ఒంగోలు పట్టణంలోని జిల్లా జైల్ సందర్శించిన న్యాయమూర్తి అక్కడ ఖైదీలతో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో భాగంగా న్యాయవాదులను నియమించుకోలేని ఖైదీలకు లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం ద్వారా ఉచితంగా న్యాయసహాయం అందించడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని అవసరమున్న ప్రతి ఒక్క ఖైదీ వినియోగించుకోవాలని అన్నారు. అదేవిధంగా ప్రతి ఒక్క ఖైదీ తమ కుటుంబంలో ఉన్న తల్లిదండ్రులను తమ పిల్లా పాపలను గుర్తు చేసుకుని నేరాలకు దూరంగా ఉండాలని అన్నారు. అదే విధంగా కారాగారాలు ఖైదీల శిక్షణాలయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ జైలు ఎల్లమందరావు డిప్యూటీ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ పి. వీరరాఘవులు జైలు శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు ఒంగోలు వ్యవసాయ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్‌గా చిట్టెం ప్రసాద్ ప్రమాణ స్వీకారం

**ఒంగోలు, ప్రభాతవార్త**



ఒంగోలు వ్యవసాయ మార్కెట్ యార్డ్ వైస్ ఛైర్మన్‌గా జనసేన జిల్లా ఉపాధ్యక్షులు చిట్టెం ప్రసాద్ నేడు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. నగర పరిధిలోని ఏ1 కన్వెన్షన్ హాల్లో బుధవారం సాయంత్రం 4 గంటలకు ప్రమాణ స్వీకార వేడుక జరగనుంది. టిడిపి, జనసేన, బిజెపి శ్రేణులు భారీ సంఖ్యలో ఏఎంసి పాలక మండలి ప్రమాణ స్వీకారానికి తరలిరానున్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా అధ్యక్షులు, ఒడా ఛైర్మన్ షేక్ రియాజ్‌కు మొదటి నుండి చిట్టెం ప్రసాద్ వెన్నుదన్నుగా నిలిచారు. జనసేన ఆవిర్భావం నుండి పార్టీ బలోపేతానికి తన వంత కృషి చేశారు. రియాజ్ వెంటే ఉండి జిల్లాలో పార్టీ కార్యక్రమాలు విజయవంతం చేయడంలో కీలక భూమిక పోషించారు. 2024 కూటమి అభ్యర్థి దామచర్ల జనార్ధన్ గెలుపులో జనసేన తరుపున ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో ముమ్మరంగా చిట్టెం పాల్గొన్నారు. చిట్టెం ప్రసాద్ కష్టపడే తత్వాన్ని గుర్తించిన జనసేన అధిష్టానం ఏఎంసి వైస్ ఛైర్మన్గా నామినేటెడ్ పదవి కేటాయించింది. జనసేన జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్ సూచనతో ఒంగోలు శాసన సభ్యులు దామచర్ల జనార్ధన్ సిఫారస్సుతో జనసేన అధినేత, డిప్యూటి సిఎం పవన్ కల్యాణ్ ఆశీస్సులతో నేడు చిట్టెం ప్రసాద్ ఒంగోలు వ్యవసాయ మార్కెట్ యార్డ్ వైస్ ఛైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

# ప్రకాశం

తెలుగు జాతీయ దినపత్రిక వార్త

## నేడు ఏయంసి చైర్మన్‌గా రాచగండ్ల వెంకట్రావు ప్రమాణ స్వీకారం

**ఒంగోలు, ప్రభాతవార్త**



టీడీపీ సీనియర్ నాయకులు రాచగండ్ల వెంకట్రావు ఒంగోలు వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్మన్‌గా ప్రమాణ స్వీకార కార్యక్రమం బుధవారం సాయంత్రం 4.00 గంటలకు ఒంగోలు నగరంలోని ఎ1 ఫంక్షన్‌హాల్ జరుగుతుందని టిడిపి నాయకులు తెలిపారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మరియు ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్ రావు అధ్యక్షతన ఒంగోలు నగరంలోని మిని స్టేడియం వద్ద నుండి గుంటూరు రోడ్డు ఎ1 ఫంక్షన్ హాల్ వరకు బైక్‌ర్యాలీ నిర్వహిస్తారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా మంత్రులు ఆనం రాంనారాయణరెడ్డి, కొలుసు పార్థసారధి, గొట్టిపాటి రవికుమార్, డోలా బాల వీరాంజనేయ స్వామి, ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డి, ఉమ్మడి జిల్లా శాసనసభ్యులు, నియోజకవర్గ ఇంచార్జిల, కార్పొరేషన్ చైర్మన్లు, ముఖ్య నాయకులు పాల్గొంటారు. కావున నియోజకవర్గంలోని నగర కమిటీ నాయకులు, డివిజన్ అధ్యక్షులు,కన్వీనర్లు, మహిళా నాయకులు, పార్టీ కార్యకర్తలు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# చీరాలలో ఇసుక మాఫియా రాజ్యం..

- అధికారుల అండదండలతో రాత్రి పగలు తేడా లేకుండా ఇసుక అక్రమ తవ్వకాలు
- ఇసక దొంగల రాజ్యానికి మోనసాక్షి ప్రభుత్వం
- ఇసక మాఫియా 24గంటలు ఇసుక తవ్వకాలు
- చీరాల ఇసుక అక్రమాలకు సర్కారు సైలెన్స్
- ఇసుక మాఫియా దాడిని ఆపేవారేరి..?

**చీరాల టౌన్, అక్టోబర్ 7, ప్రభాతవార్త**







చీరాల నియోజకవర్గం ప్రజా వనరులు బీభత్సంగా దోచుకుపోతున్న ప్రాంతంగా మారిపోయింది. రాత్రి పగలు తేడా లేకుండా జరుగుతున్న అక్రమ ఇసుక తవ్వకాలు ఇప్పుడు బహిరంగ రహస్యంగా మారాయి. ఈ అక్రమ ఇసుక తవ్వకాలు అంతా బాపట్ల కు చెందిన శివ అనే బిల్డర్ సహకారంతో స్థానిక రాజకీయ నాయకుల ప్రమేయంతో అధికారుల అండదండలతో జోరుగా తవ్వకాలు కొనసాగుతున్నాయని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. చీరాల నియోజకవర్గంలో ప్రభుత్వ భూములు, చెరువులు, కాలువలు – ఏ చోటా దొరికితే ఆ చోట ఇసుక తవ్వకాలు జరిపి ట్రిప్పర్లు, లారీలు, ట్రాక్టర్లుతో వరుసగా చీరాల చుట్టుపక్కల గ్రామాలకు ఇతర ప్రాంతాలకు దర్జాగా తరలిస్తున్నారు. దీని ద్వారా ప్రభుత్వ ఖజానా నష్టపోగా, ఇసుక మాఫియా కోట్ల రూపాయలు కాజేస్తోంది. ప్రజల కళ్లముందే జరుగుతున్న ఈ దందాకు మైనింగ్ అధికారులు, రెవిన్యూ శాఖ సిబ్బంది, స్థానిక పోలీసు అధికారులు అండగా ఉన్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అధికారుల మోనం, మాఫియా బలగాల చురుకుదనం చీరాల పరిసర ప్రాంతాల ప్రజల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. రాత్రి వేళల్లో ఇసుక లారీలు వరుసగా పోతుంటే, పోలీసులు కనపడరు... ఉదయం అయితే రోడ్లపై ఇసుక ట్రాక్టర్లు జోరుగా తిరుగుతా ఉంటాయిని స్థానికులు తీవ్రంగా విమర్శిస్తున్నారు. చెరువుల అంచులు, ప్రభుత్వ పంట భూములు గుంతలుగా మారి పర్యావరణ సమతుల్యతకు పెద్ద ప్రమాదంగా మారింది. రైతులు నీటికొరతతో ఇబ్బందులు పడుతుండగా, మాఫియా మాత్రం అధికార అనుమతుల పేరుతో దోపిడీ కొనసాగిస్తోంది. ప్రజలు ఈ అక్రమ తవ్వకాలపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, మైనింగ్ డైరెక్టర్లను కోరుతున్నారు. అయితే ఇప్పటి వరకు ఎలాంటి స్పష్టమైన చర్యలు కనిపించడంలేదు. ప్రజల ఆస్తిని కాపాడే అధికారులే లాభాల దాహంలో భాగస్వాములు అవుతుంటే, న్యాయం ఎక్కడ..?చీరాల ప్రజలు ఇసుక దందాపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్య తీసుకోవాలని కోరుతున్నారు.

# అంతరిక్ష వారోత్సవాల్లో భాగంగా అంతరిక్ష నడక








**ఒంగోలు, ప్రభాతవార్త**

- ఇస్రో , క్విస్ విద్యాసంస్థలు సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహణ
- ర్యాలీని జెండా ఊపి ప్రారంభించిన డీఎస్పీ శ్రీనివాసరావు
- కార్యక్రమంలో పాల్గొన్న క్విస్ స్కూల్, కళాశాల, నవోదయ విద్యార్థులు

సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్), ఇస్రో, ఒంగోలు క్విస్ విద్యాసంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఒంగోలులో అంతరిక్ష వారోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. వారోత్సవాల్లో భాగంగా మొదటి రోజు మంగళవారం అంతరిక్ష నడక (స్పేస్ వాక్)ను నిర్వహించినట్లు క్విస్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి తెలియజేశారు. ఒంగోలులోని ఎస్పీ ఆఫీస్ నుంచి అద్దంకి బస్టాండ్ వరకు ర్యాలీ సాగింది. ఒంగోలు డీఎస్పీ శ్రీనివాసరావు, షార్ డిప్యూటీ డైరెక్టర్ గోపీకృష్ణ, క్విస్ విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ డాక్టర్ నిడమానూరి శ్రీ గాయత్రి దేవి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యి పచ్చజెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. క్విస్ కళాశాల విద్యార్థులు, స్కూల్ విద్యార్థులు, నవోదయ స్కూల్ విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొని భారత్ మాతాకీ జై, ఇస్రో గొప్పదనం గురించి, అంతరిక్ష పరిశోధనల గురించి నినాదాలు చేశారు. ఇస్రో ప్రయోగించే రాకెట్లు, ఉపగ్రహాల నమూనాలను ఊరేగించారు. అనంతరం మాట్లాడిన డీఎస్పీ శ్రీనివాసరావు అంతరిక్ష పరిశోధనలు, రాకెట్లు వాటి పనితీరు ప్రజలకు, విద్యార్థులకు తెలియజేసే విధంగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ఆనందంగా ఉందని అన్నారు. విద్యార్థులకు అంతరిక్ష పరిశోధన, అంతరిక్షప్రయోగాలు, ప్రయోజనాలు తెలియజేయాలని ఆయన అభిప్రాయపడ్డారు. అనంతరం మాట్లాడిన షార్ డిప్యూటీ డైరెక్టర్ గోపీకృష్ణ విద్యార్థులతో పాటు సామాన్య ప్రజానికానికి అంతరిక్షం, అంతరిక్ష పరిశోధనలు, వాటి వల్ల మనకు కలిగే ప్రయోజనాల గురించి తెలియజేయాలనే ఉద్దేశంతో స్పేస్ వాక్ నిర్వహించినట్లు చెప్పారు. క్విస్ కళాశాల దానికి వేదిక అయ్యిందని, ఈ సందర్భంగా క్విస్ కళాశాల యాజమాన్యానికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అంతరిక్ష ప్రయోగాలు మానవాళి శ్రేయస్సుకు ఎంతగా ఉపయోగపడుతున్నాయి, అంతరిక్ష ప్రయోగాలపై విద్యార్థులకు ప్రజలకు అవగాహన కల్పించే విధంగా షార్ ఇలాంటి కార్యక్రమం చేయడం అందరికీ చాలా ఉపయోగకరమని, ముఖ్యంగా విద్యార్థులకు రాకెట్ పనితీరు తదితర అంశాలపై అవగాహన కల్పించేందుక ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని క్విస్ విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ డాక్టర్ నిడమానూరి శ్రీగాయత్రి దేవి అన్నారు. ఇలాంటి గొప్ప కార్యక్రమానికి క్విస్ ఇంజనీరింగ్ కళాశాల వేదిక అవ్వడం గర్వకారణంగా ఉందని అన్నారు. క్విస్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యమం నిర్వహించడం ఇది రెండో సారని, మళ్లీ మళ్లీ ఇలాంటి గొప్ప కార్యక్రమాలు చేయడం చాలా ఆనందంగా, గర్వంగా కూడా ఉందని ఆమె అభిప్రాయపడ్డారు. ఈ ర్యాలీలో క్విస్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై.వి. హనుమంతరావు, డీపీఎస్ ఆర్ డైరెక్టర్ డాక్టర్ సుబ్బారావు, సీఎస్ సీడీఈ డీన్ డాక్టర్ భార్గవ్, వరల్ట్ స్పేస్ వీక్ 2025 ఒంగోల్ సబ్ కమిటీ ఛైర్మన్ లీలా నాగ శ్రీనివాసరావు, మెంబర్ సెక్రటరీ ఆదిత్య ఎన్ ఎస్ ఎస్, ఎన్ సీసీ విభాగాధిపతులు, ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు, క్విస్ కళాశాల, స్కూల్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### ప్రారంభోత్సవానికి షార్ డైరెక్టర్, జిల్లా కలెక్టర్

అంతరిక్ష వారోత్సవాల్లో భాగంగా 8వ తేదీ బుధవారం క్విస్ కళాశాలలో జరగనున్న ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఈఎస్ పద్మ కుమార్, జిల్లా కలెక్టర్ రాజాబాబు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. 8వ తేదీన 1వ తరగతి నుంచి 5వ తరగతి విద్యార్థులకు అంతరిక్షం అంశంపై డ్రాయింగ్ పోటీలు, 9వ తేదీన 6 నుంచి 12వ తరగతి విద్యార్థులకు పోస్టర్ ప్రజంటేషన్ పోటీ నిర్వహించనున్నారు. దాంతో పాటుగా 8, 9 తేదీల్లో కళాశాల విద్యార్థులకు టెక్నికల్ ఎక్స్‌పో నిర్వహించనున్నారు. వీటితో పాటుగా విద్యార్థులకు అంతరిక్షం, అక్కడి పరిస్థితులు, శాటిలైట్లు, ఇస్రో లాంచ్ వెహికల్స్ తదితర అంశాల గురించి ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయనున్నారు.

## మహానుభావుడు మహర్షి వాల్మీకి: కలెక్టర్



**ఒంగోలు, ప్రభాతవార్త**

మానవాళికి రామాయణం లాంటి మహత్తరమైన గ్రంథాన్ని అందించిన మహానుభావుడు మహర్షి వాల్మీకి అని, వారి జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని ముందుకు పోవాలని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు పేర్కొన్నారు. మంగళవారం మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఘనంగా జరిగింది. ముందుగా జిల్లా కలెక్టర్ రాజాబాబు జ్యోతి ప్రజ్వలన చేసి మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాల్మీకి రచించిన రామాయణం నేడు యావత్ ప్రపంచానికే ఆదర్శమని కొనియాడారు. వాల్మీకి మహర్షి జయంతిని పురస్కరించుకుని వారి జీవిత చరిత్రను ఒక సారి స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. మహానుభావుల జయంతులు, ఉత్సవాలు జరుపుకోవడమంటే కేవలం వారిని స్మరించుకోవడంతో పాటు వారు సమాజానికి చేసిన సేవలు ప్రజలందరికి తెలియచేసుకోవడమేనని అన్నారు. ఈ రోజు రాష్ట్ర వ్యాప్తంగా మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను జరుపుకుంటున్నారన్నారు. వారి జీవితంలో జరిగిన మార్పు ఒక వేటవానిగా జీవితం ప్రారంభించి, ఋషి అయి, ఋషి నుండి రామాయణం వంటి మహాకావ్యాన్ని రచించిన మహనీయులు వాల్మీకి అని అన్నారు. అన్నదమ్ముల మధ్య ఎట్లా సంబంధాలు ఎలా ఉండాలి, కుటుంబ సంబంధాలు ఎలా ఉండాలి, సమస్యలను ఎట్లా పరిష్కరించాలి, ఎన్ని కష్టాలు వచ్చినప్పటికి ధర్మం వైపు ఎట్లా ఉండాలి అని సమాజానికి తన కావ్యం ద్వారా ఎతలియజేసిన మహా వ్యక్తి మహర్షి వాల్మీకి అని అన్నారు. ఈ రోజుకు వారు రచించిన రామాయణ మహా కావ్యం అజరామంగా విరాజిల్లుతుందని అన్నారు. ఈ కావ్యం మనందరికి ఆదర్శం కాబట్టి వారి జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి నిర్మలా జ్యోతి, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు, పలు బీసీ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో జీఎస్టీపై వ్యాసరచన పోటీలు

**యర్రగొండపాలెం రూరల్, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త**



యర్రగొండపాలెం ప్రభుత్వం మోడల్ డిగ్రీ కళాశాల నందు మంగళవారం కామర్స్,ఎకనామిక్స్ డిపార్ట్మెంట్లు సంయుక్తంగా సూపర్ జీఎస్టీ 2.వీ సూపర్ సేవింగ్స్ ప్రోగ్రామ్ మీద వ్యాసరచనా పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డా.జి.శ్రీధర్ నాయుడు అధ్యక్షత వహించారు. వైస్ ప్రిన్సిపాల్ డా.పి.ప్రదీప్ జీఎస్టీ సవరణ ఆవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ డా.రహమత్ ఉన్నిసా బేగం, బోధన బోధనేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.




6_6.qxd 10/7/2025 11:57 PM Page 1



## మదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషిచేయాలి



**అద్దంకి, ఆక్టోబరు 7, ప్రభాతవార్త**
హెచ్ఐవి ఎయిడ్స్ వ్యాధి నిర్మూలన లక్ష్యంతో మదక ద్రవ్యాల నిర్మూలన అక్రమ రవాణా నియంత్రణ నిర్మూలన కొరకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ప్రాజెక్ట్ డైరెక్టర్ బివి సాగర్ అన్నారు. పని చేసే ప్రదేశాల్లో ఎవరైనా హెచ్ఐవి ఎయిడ్స్ బాధితులు ఉంటే వారికి మెరుగైన వైద్య సేవలు ఎక్కడ అందుతున్నాయో సమాచారాలు తెలుసుకుని వారికి వైద్య సేవలు అందించడంలో మనందరం కృషి చేయాలని వారి పట్ల వివక్షత చూపించకూడదని హెల్ప్ స్వచ్ఛంద సంస్థ టీ ఐ ప్రాజెక్ట్ డైరెక్టర్ బివి సాగర్ పేర్కొన్నారు. మంగళవారం వి ఎన్ ఎస్ కోల్డ్ స్టోరేజ్ లోని చిల్లీస్ గ్రేడింగ్ పాయింట్ లోని మహిళలకు ముఠా కార్మికులకు ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, బాపట్ల జిల్లా హెచ్ఐవి ఎయిడ్స్ నియంత్రణ సమీకృతయో బాపట్ల జిల్లా హెచ్ఐవి ఎయిడ్స్ నియంత్రణ సమీకృత వ్యూహం దిశ హెల్ప్ స్వచ్ఛంద సంస్థ టీఐ ఆధ్వర్యంలో ఇంటర్ స్ప్రెడర్ ఐఐసి అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. హెచ్ఐవి ఎయిడ్స్ నిర్మూలన కొరకు తగు సూచనల కొరకు హెచ్ఐవి ఎయిడ్స్ టోల్ ఫ్రీ 1097 పై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగించాలని హెచ్ఐవి ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకి ఏ ఆర్ టి ద్వారా వైద్య సేవలు గురించి తెలియజేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హెల్ప్ టి ఐ మేదరమెట్ల ప్రోగ్రాం మేనేజర్ బి దుర్గా సురేంద్ర, అద్దంకి కొరిశపాడు నాగులప్పలపాడ మండలాల హెల్ప్ టి ఐ ఔట్రీచ్ వర్కర్స్ కృష్ణవేణి, ఎం మల్లేశ్వరి, టీ దుర్గాభవాని, ఏఎన్ఎం రాధమ్మ పాల్గొన్నారు.

## మైనర్ బాలికపై అత్యాచార కేసులో నిందితుడికి జైలు శిక్ష

**- 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, - 12 వేల నగదు జరిమాన**

**- ఒంగోలు ఫోక్సో కోర్టు న్యాయమూర్తి తీర్పు వెల్లడి**

**- దర్యాప్తు సిబ్బందికి ఎస్.పి. అభినందనలు**

**అద్దంకి, ఆక్టోబరు 7 ,ప్రభాతవార్త**
మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.12,000 / నగదు జరిమాన, విధిస్తూ ఒంగోలు ఫోక్స్ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి కె. శైలజ తీర్పు వెల్లడించింది. మైనర్ బాలికకు రాష్ట్ర ప్రభుత్వం తరుపున 3 లక్షలు నగదు పరిహారం చెల్లించే విధంగా తీర్పు వెలువరిస్తూ ఆదేశాలను జారీ చేసింది. ఈ కేసు విషయంలో వేగవంతమైన దర్యాప్తు, ట్రయల్ లు నిర్వహించి, నిందితులకు శిక్షలు పడే విధంగా కృషి చేసిన పోలీస్ అధికారులు, సిబ్బందిని అభినందించిన జిల్లా ఎస్పీ ఉమామహేశ్వరారవు అభినందించారు.మహిళలు చిన్నారులపై అఘాయిత్యాలకు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటాం ప్రత్యేక ఫోక్సో కోర్టు న్యాయమూర్తి వెలువడించిన తీర్పే దీనికి నిదర్శనం జిల్లా ఎస్పీ బి.ఉమా మహేశ్వర్ వెల్లడించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలలోకి వెళితే 2021 సంవత్సరం జనవరి 1న బాపట్ల జిల్లా మేదరమెట్ల, పోలీస్ స్టేషన్ పరిధిలో మేదరమెట్ల గ్రామం పతుల కాలనీలో నివాసంవుంటున్న దంపతులకు 2 సంవత్సరాలు వయసు గల చిన్నారి మైనర్ బాలికపై అదే ప్రాంతానికి చెందిన 28సం॥ల వయస్సు గల గురజాల మహేష్ సాయంత్ర సమయంలో చిన్నారిని ముద్దాడుతూ మచ్చిక చేసుకొని అద్దంకి రోడ్డులోని సిటీ కేబుల్ ఆఫీసు వున్న పోలాలోకి తీసుకొని వెళ్ళి వివస్త్రని చేసి, అత్యాచారానికి పాల్పడుతుండగా కొందరు అక్కడికి వెళ్ళిన వారిని చూసి, ముద్దాయి మహేష్ పారిపోయాడు. ఈ సంఘటనపై బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశారు. అప్పటి ఒంగోలు మహిళా పోలీస్ స్టేషన్ డిఎస్పి ఎం. ధనుంజయుడు నేర స్థలాన్ని పరిశీలించి, ప్రత్యక్ష సాక్షులను విచారించి, భౌతిక సాక్షాధారాలను సేకరించి, ముద్దాయి నేరం చేసినట్లు నిరూపించి, ఆరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. కేసు విచారణలో జిల్లా ఎస్పి బి.ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు చీరాల డిఎస్పి ఎం.డి.మొయిన్ పర్యవేక్షణలో అద్దంకి రూరల్ సి.ఐ. డి. మల్లికార్జునరావు, మేదరమెట్ల ఎస్.ఐ. షేక్ మహ్మద్‌రఫీ, కోర్టు లైజనింగ్ సిబ్బంది. స్వామి, కోర్టు కానిస్టేబుల్ ఎం. వెంకటేశ్వర్లు, పిసిలు పివి నారాయణలు, సాక్షులను సరైన రీతిలో నిర్భయంగా సాక్షం చేపే విధంగా సరైన సమయానికి కోర్టుకు హజరు పరిచారు. పిపి గొట్టిపాటి శ్రీనివాసరావు, కోర్టులో వాదోపవాదాలను వినిపించి, నిందితుడుపై మోపపడిన నేరాన్ని తగిన సాక్ష్యాధారాలతో నిరూపించి, నిందితుడుకి శిక్ష పడేవిధంగా విధులు నిర్వహించారు. ప్రత్యేక ఒంగోలు ఫోక్స్ కోర్టు న్యాయమూర్తి కె. శైలజ నిందితుడికి 20సం॥, కఠినకారాగార శిక్ష, 12వేల రూపాయాల నగదు జరిమానను విధించింది. ఈకేసు దర్యాప్తులో పద్భందీగా విధులు నిర్వహించిన పోలీస్ సిబ్బంది అందరిని జిల్లా ఎస్.పి. బి.ఉమామహేశ్వరరావు ప్రత్యేకంగా అభినందించారు.

## అంబేద్కర్ విగ్రహ స్థాపనకు వినతి



**మార్టూరు, అక్టోబర్ 7, ప్రభాతవార్త**
దేగరమూడి గ్రామంలో అంబేద్కర్ విగ్రహాన్ని ప్రతిష్ట చేసుకొనుటకు గ్రామస్తులందరం ఏకాభిప్రాయంతో ఉన్నామని దేగరమూడి గ్రామస్తులు ఆర్డీఓను కలిసి ఇందుకు సంబంధించి వినతిపత్రం అందజేసి కోరారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామంలో సర్వే నెంబరు 162లో అంబేద్కర్ విగ్రహ స్థాపనకు గ్రామంలోని అన్ని వర్గాలు, కులాల వారికి ఆమోద యోగ్యమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జే.శ్రీనివాసరావు,సమూయేలు,పున్నయ్యతదితర గ్రామస్తులు ఉన్నారు.

## అంగన్వాడి పోషణపై కేజీబీవీలో విద్యార్థులకు పోటీలు

**- పోటీలు పర్యవేక్షించిన సీడీపీఓ సుధ**

**- విజేతలకు బహుమతులు అందజేసిన ఎంఈఓ వేమవరపు కోటేశ్వరరావు**



**సంతమాగులూరు అక్టోబర్ 7, ప్రభాతవార్త**



అంగన్వాడి పోషణ మహోత్సవాలలో భాగంగా మంగళవారం సంతమాగులూరు మండలంలోని ఏల్చూరు కస్తూరిబా బాలికల విద్యాలయంలో విద్యార్థులకు పోషణ దాని ప్రాముఖ్యతపై అవగాహన కల్పించిన అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. విద్యాలయంలోని 8,9,10 తరగతుల విద్యార్థులకు కిషోర బాలకలకు అవసరమయ్యే పోషణ,పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. అనంతరం సూక్ష్మ స్థూల పోషకాలు, సమతుల్య ఆహారం,విటమిన్ల లోపం వల్ల వచ్చేవ్యాదుల గురించి క్విజ్ పోటీలకు ప్రశ్నా వలి రూపొందించి నాలుగుబృందాలుగా విభజించి క్విజ్ పోటీలు నిర్వహించారు.విజేలకు మండల విద్యాశాఖఅధికారి వేమవరపు కోటేశ్వరరావు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమానికి న్యాయనిర్ణేతలుగా సంతమాగులూరు సీడీపీఓ సుధ,పాఠశాల ఉపాధ్యాయురాలు సునీత,బాపట్ల జిల్లాసమగ్రశిక్ష కౌన్సిలర్ వినోలియా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి-2 దినేష్‌కుమార్,బాలికా విద్యాలయ సిబ్బంది,ఐసీడీఎస్ సూపర్ వైజర్ ప్రమీలరాణి, ఏల్చూరు అంగన్వాడీ కార్యకర్తలూయాలు పాల్గొన్నారు.

## యోగాపై విద్యార్థులకు అవగాహన



**బల్లికురవ, అక్టోబర్ 7, ప్రభాతవార్త**
ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక కస్తూరిబా బాలికల గురుకుల విద్యాలయంలో విద్యార్థినులకు యోగాపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి మానసిక ఆరోగ్య కౌన్సిలర్ ప్రియ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థినులతో మమేకమవుతూ వారి మానసిక పరిస్థితులను అంచనా వేయగలిగారు. ఆరోగ్యకర జీవనశైలి, మానసిక పరివర్తన, యోగ ధ్యానంపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ప్రారంభ వేళ మానసిక ఆరోగ్య పరిస్థితిపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. విద్యార్థినుల మానసిక పరిస్థితి అలవాట్లు మొదలైన వాటి గురించి ప్రత్యేకంగా ఆరా తీశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సరళ మాట్లాడుతూ సామాజిక కలంకాన్ని తగ్గించటం, మానసిక ఆరోగ్యానికి మద్దతుగా ఆరోగ్యకరమైన వాతావరణాన్ని ప్రోత్సహించడం ప్రధాన లక్ష్యమన్నారు. అన్ని వాతావరణాలలోనూ మానసిక ఆరోగ్యానికి మద్దతుగా ఆరోగ్యకరమైన వాతావరణాన్ని సృష్టించటం ఈ రోజు యొక్క ప్రధాన లక్ష్యమన్నారు. విద్యార్థులచే పలు యోగ భంగిమలు సాధన చేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## 108 అంబులెన్స్‌లో కాన్పు .. మగ బిడ్డ జననం

**మార్టూరు, అక్టోబర్ 7, ప్రభాతవార్త**



మార్టూరు మండలం కొలలపూడి గ్రామానికి చెందిన లావణ్య తీవ్రమైన పురిటి నొప్పులతో ఇబ్బంది పడుతుండగా సమాచారం అందుకున్న కొరిశపాడు 108 సిబ్బంది సకాలంలో అక్కడకు చేరుకొని ఈఎంటీ తనకు ఉన్న మెలుకువలతో గర్భిణీకి సుఖకాన్పు నిర్వహించారు. కాన్పులో పండంటి మగ బిడ్డ జన్మించాడు. అనంతరం క్షేమంగా ఉన్న తల్లి, నవజాత శిశువును మార్టూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. కాన్పు నిర్వహించిన 108 సిబ్బంది ఈఎంటీ ఆనంద్, పైలెట్ వేణుగోపాల్‌ను స్థానికులు అభినందించారు.

## 6 మంది పేకాట రాయుళ్లు అరెస్ట్

**రాచర్ల, అక్టోబర్ 7 ప్రభాతవార్త**



మండలంలోని పలుగుంటిపల్లి గ్రామ పొలాల్లో పేకాట ఆడుతున్న 6మంది పేకాటరాయుళ్ళను అదుపులోకి తీసుకొని అరెస్ట్ చేసినట్లు రాచర్ల ఎస్ఐ పి కోటేశ్వరరావు మంగళవారం తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు తమకు అందిన సమాచారంతో గ్రామ పొలాల్లో పేకాట శిబిరంపై దాడి చేశామని, దాడుల్లో పట్టుబడిన వారి వద్ద నుండి రూ.13,450 నగదు స్వాధీనం చేసుకున్నామని అన్నారు. పేకాట, కోడి పందెం, మట్కా లాంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ దాడుల్లో కానిస్టేబుళ్ల మణికంఠ, సురేష్, శ్రీనివాసులు, హోంగార్డులు తదితరులు పాల్గొన్నారు.

## జీఎస్టీపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలి

**రాచర్ల, అక్టోబర్ 7, ప్రభాతవార్త**




జిఎస్టి 2.0పై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని మండల విద్యాశాఖ అధికారులు వి గిరిధర్ శర్మ, షేక్ మొయినుద్దీన్‌లు అన్నారు. మండలంలోని అనుమలవీడు జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు మంగళవారం 2.0జిఎస్టిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్టేషనరీ, పెన్సిల్లు, డ్రాయింగ్ కలర్ బాక్సులు, తదితర వస్తువుల కొనుగోళ్లపై జీఎస్టీ ద్వారా పొదుపు లభిస్తుందని, పాఠ్యపుస్తకాలపై జిఎస్టి పూర్తిగా తొలగించడం జరిగిందన్నారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు జీఎస్టీ ద్వారా కలిగే ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## క్రీడల్లో ప్రతిభ చూపిన తురిమెళ్ళ కళాశాల విద్యార్థి

**కంభం, అక్టోబరు 7, ప్రభాతవార్త**



స్కూల్ గేమ్ ఫెడరేషన్ (ఎస్‌జిఎఫ్) అండర్19 విభాగంలో అక్టోబర్ 7, 2025న సింగరాయకొండలో జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ క్రీడా పోటీలలో తురిమెళ్ళ ప్రభుత్వ జూనియర్ కళాశాల సీనియర్ హెచ్‌ఈసి విద్యార్థి టి మహేష్ అత్యుత్తమ ప్రతిభను ప్రదర్శించాడని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి సోనీ ఒక ప్రకటనలో తెలిపారు. డిస్కస్ త్రో పోటీలో ద్వితీయ బహుమతిని, 800 మీటర్ల పరుగు పందెంలో తృతీయ బహుమతిని సాధించి కళాశాల కీర్తిని పెంచాడని కొనియాడారు. టి. మహేష్‌ను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి సోనీ, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది హర్షాతిరేకాలతో అభినందించారు. ఈ సందర్భంగా డాక్టర్ జి సోనీ మాట్లాడుతూ కళాశాలలో ఫిజికల్ డైరెక్టర్ లేని పరిస్థితుల్లో కూడా మా అధ్యాపకులు, సిబ్బంది క్రీడాపట్ల విద్యార్థుల్లో ఆసక్తిని పెంపొందిస్తున్న తీరుకు అభినందనలు తెలియజేశారు. టి మహేష్ రాష్ట్ర స్థాయిలో కూడా మెరిసి, మన కళాశాల గౌరవాన్ని మరింత పెంచాలని ఆకాంక్షి స్తున్నామన్నారు.

## ఉపాధిహామీ కూలీలందరూ ఈకెవైసి తప్పనిసరిగా చేయించుకోవాలి

**- ఉపాధిహామీ ఏపిఓ జీవరత్నం**

**కంభం, అక్టోబరు 7, ప్రభాతవార్త**



కంభం మండలంలో ఉపాధి హామీ పథకం కింద కూలీలందరూ ఈ కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని ఉపాధి హామీ ఏపీవో జీవరత్నం తెలిపారు. మంగళవారం మండలంలోని ఎల్‌కోట గ్రామంలో ఉపాధి కూలీలు ఈకేవైసీ కార్యక్రమం నిర్వహించారు. ఈ ఏపీవో జీవరత్నం మాట్లాడుతూ మండలంలో మొత్తం 16,198 మంది ఉపాధి హామీ కూలీలు ఉన్నారని, ఇప్పటివరకు 14 గ్రామపంచాయతీలలో 6033 మంది ఈ కేవైసీ చేయించుకున్నారని తెలిపారు. మిగిలిన వారందరూ సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్ ద్వారా ఈనెల 20వ తేదీలోగా ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్, ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛాంధ్ర పురస్కారం అందుకున్న ఏపిఎం పిచ్చయ్య

**మార్కాపురం రూరల్, అక్టోబరు 7, ప్రభాతవార్త**



వివిధ రంగాల్లో సేవలందించిన వారికి సోమవారం జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు స్వచ్ఛాంధ్ర పురస్కారాలందించారు. మార్కాపురం వెలుగు ఏపీఎం డి పిచ్చయ్య, రాయవరం కేజీబీవీ పాఠశాల ప్రిన్సిపల్ జి విజయలక్ష్మి అందుకున్నారు. పొదిలి తహసీల్దార్ ఎంవివి కృష్ణారెడ్డి,వెలుగు ఏపీఎం గోపాలకృష్ణ స్వచ్ఛ అవార్డులు తీసుకున్నారు. పారిశుద్ధ్య కార్మికుడు జి నాగేశ్వరరావుకు స్వచ్ఛ వారియర్ పురస్కారం అందించారు. అవార్డు తీసుకున్న వారికీ,మార్కాపురం వెలుగు ఏపీఎం డి పిచ్చయ్యకు పలువురు అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

## శ్రీ ప్రసన్నాంజనేయస్వామికి లక్ష తమలపాకుల పూజ

**అద్దంకి, ఆక్టోబరు 7, ప్రభాతవార్త**



బాపట్ల జిల్లా, అద్దంకి మండలం, శింగరకొండ పుణ్యక్షేత్రంలో కొలువై ఉన్న శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి వారికి మంగళవారం రేవతి నక్షత్రం, ఆశ్వయుజ పూర్ణిమ సందర్భంగా లక్ష తమలపాకుల పూజ అత్యంత వైభవోపేతంగా జరిగింది. ప్రాతఃకాల సుప్రభాతం గోపూజ బిందెతీర్థం అనంతరం స్వామి వారికి అభిషేక కార్యక్రమం అలంకరణ తదుపరి వేదపండితులు అర్చకులు ఉభయ దాతలు వేదస్వస్తి మంగళవాయిద్యములతో ఆలయ ప్రదక్షిణ వినాయకస్వామి,సుబ్రహ్మణ్యస్వామి వారికి జీవధ్వజస్థంభమునకు నారికేళఫల సమర్పణ తదనంతరం 11 ఆవృత్తములుగా దేవస్థానం వేదపండితులు అర్చకులు లక్ష తమలపాకుల పూజ కార్యక్రమము నిర్వహించారు. శ్రీ ప్రసన్నాంజనేయస్వామివారికి మహానివేదన పంచహారతులు కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఉభయ దాతలుగా వలపర్ల వాస్తవ్యులు తవ్వా సురేష్ బాబు, వెంకట లక్ష్మీ పద్మావతి దంపతులు పాల్గొన్నారు. పూజ అనంతరం దేవస్థానం వేదపండితుల అర్చకులు ఉభయదాతలను భక్తులను ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందజేశారు పూర్ణిమమంగళవారము కలిసిరావడంతో భక్తులు అధికసంఖ్యలో విచ్చేసిస్వామి వారిని దర్శించుకున్నారు.

## ఘనంగా గిరి ప్రదక్షిణ మహోత్సవం

**సింగరాయకొండ, అక్టోబర్ 7,ప్రభాతవార్త**



మండలంలో దక్షిణ సింహాచలంగా ప్రసిద్ధి గాంచిన పాత సింగరాయకొండ గ్రామం శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో మంగళవారం అశ్వయుజ పౌర్ణమి సందర్భంగా గిరి ప్రదక్షిణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు.ముందుగా రాజ్యలక్ష్మి, గోదాదేవి సమేత శ్రీవరాహ లక్ష్మీ నరసింహస్వామి, యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి, స్వయంభు ఆంజనేయస్వామి వార్లుకు ప్రత్యేక పూల అలంకరణతో విశేషా పూజలు నిర్వహించారు. స్వామి వారి ప్రధాన మెట్ల మార్గం వద్ద గల మండపం నుండి గిరి ప్రదక్షిణను భక్తులు హరి నామస్మరణతో భజన చేస్తూ ఆలయం చుట్టురా గిరి ప్రదక్షిణ చేశారు. అనంతరం స్వామి వారి తీర్థ ప్రసాదాలును భక్తులుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని, స్వామి వారిని దర్శించుకున్నారు.

## అంగరంగ వైభవంగా శ్రీ వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు

**మార్కాపురం రూరల్, అక్టోబరు 7, ప్రభాతవార్త**





మార్కాపురం పట్టణంలోని కోర్టు సెంటరులో మంగళవారం పూల సుబ్బయ్య భవనంలో శ్రీ వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమం ప్రారంభంలో వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు మండ్ల రామాంజనేయులు మాట్లాడుతూ ఆదికవి వాల్మీకి మహర్షి ఒక సాధారణ వ్యక్తిగా జీవితం ప్రారంభించి రామాయణాన్ని రచించిన గొప్ప సాహిత్య కర్తగా యువతకు ఆదర్శంగా నిలిచారన్నారు. ఆయన మన వాల్మీకి కులంలో పుట్టడం ఎంతో గౌరవకరమైన విషయమని ఇది ఎన్నో జన్మల పుణ్యఫలమని తెలిపారు. అలాగే రాష్ట్రంలో వాల్మీకి బోయలు అభివృద్ధి చెందకపోవడం బాధాకరమని, విద్య, వైద్యం, రాజకీయ పరిజ్ఞానం ద్వారా అన్ని రంగాల్లో వాల్మీకి సంతతికి ప్రాతినిధ్యం పెంచుకోవాలని పిలుపునిచ్చారు. ఈ దేశంలో వృత్తిలేని ఏకైక కులం వాల్మీకులేనని అందుకే మనం అన్ని రంగాల్లో ముందుకు సాగాలి అన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు బూపని కాశయ్య (అడ్వకేట్), కోశాధికారి నల్లబోతుల మల్లికార్జున, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతుల కొండయ్య, రిటైర్డ్ ఎస్‌బిఐ మేనేజర్ నల్లబోతుల అచ్చయ్య, మండ్ల మార్కాపురం పట్టణ బీజేపీ ఉపాధ్యక్షుడు శివప్రసాద్, పట్టణ ప్రధాన కార్యదర్శి భోగం కాటంరాజు,సర్పంచ్ డి గురుబ్రహ్మం, ప్రకాశం జిల్లా జనరల్ సెక్రటరీ మండ్ల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరాముని దివ్య చరితాన్ని జగతికి అందించిన ఆదికవి వాల్మీకి మహర్షి

**- టీడిపి సీనియర్ నాయకులు ముత్తుముల కృష్ణకిషోర్ రెడ్డి**

**రాచర్ల, అక్టోబరు 7 ,ప్రభాతవార్త**



శ్రీరాముని దివ్య చరితాన్ని జగతికి అందించిన ఆదికవి వాల్మీకి మహర్షి అని గిద్దలూరు నియోజకవర్గ సీనియర్ టిడిపి నాయకులు ముత్తుముల కృష్ణ కిషోర్ రెడ్డి అన్నారు. మండల కేంద్రమైన రాచర్ల సచివాలయంలో మంగళవారం ఆయన వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల నాయకులు, అధికారులతో కలిసి ఆయన వాల్మీకి చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాల్మికి మహర్షి జయంతిని ప్రభుత్వం అధికారికంగా జరపడం అభినందించదగిన విషయమన్నారు. అనంతరం ఆయన తన దృష్టికి వచ్చిన వివిధ సమస్యలకు సంబంధించిన అర్జీలను మండల అధికారులు దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని,రాచర్ల సచివాలయంలో ప్రత్యేక కార్యక్రమం ద్వారా సంబంధిత అధికారులను కలిసి అర్జీలను అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్ వెంకటరామిరెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో ఐ వెంకటేష్, డిటి వై స్వాతి, ఎంఈఓలు వి. గిరిధర శర్మ, షేక్ మొయినుద్దీన్, కార్యదర్శి ఎంవి నాయక్, రాష్ట్ర గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ కె యోగానంద్, నాయకులు జి జీవనేశ్వర్ రెడ్డి, ఏ.శ్రీనివాసరెడ్డి, ఎన్ శ్రీనివాసులు, పి సుధీర్ కుమార్ రెడ్డి,డి.కాశిరెడ్డి, ఎం.రాజశేఖర్‌రెడ్డి, బి పుల్లారెడ్డి,డి. సయ్యద్‌మియా,బి.రామకృష్ణ, వై.లక్ష్మీరెడ్డి ఎస్ వెంకటపతి, ఎస్ నరసింహులు, జి రంగస్వామి రెడ్డి,ఎస్టీ తాహెర్ బాషా, పి.మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

## PAC సభ్యుడు సురేష్‌కు పరామర్శ

**సింగరాయకొండ,అక్టోబర్ 7,ప్రభాతవార్త**



ఇటీవల స్వల్ప అనారోగ్యంతో హైదరాబాద్ లోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ PAC సభ్యులు, కొండేపి నియోజకవర్గ ఇంఛార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్‌ని సింగరాయకొండ మండల వైసీపీ నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్యపరిస్థితి, యోగ క్షేమాలును అడిగి తెలుసుకున్నారు. డాక్టర్ సురేష్ త్వరగా కోలుకోని ప్రజా సేవలో తిరిగి పాల్గొనాలని వారు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో వైసీపీ మండల ప్రధాన కార్యదర్శి కె.సాయి కోటి, పంచాయతీరాజ్ అధ్యక్షుడు చొప్పర శివ, సాయి రెడ్డి, అంబటి పవన్‌కుమార్, శివారెడ్డి పాల్గొన్నారు.

## సూపర్ జిఎస్టి సూపర్ సేవింగ్స్‌పై విద్యార్థులకు అవగాహనా కార్యక్రమం

**పొన్నలూరు అక్టోబర్ 7, ప్రభాతవార్త**



మండల కేంద్రమైన పొన్నలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సూపర్ జిఎస్టి, సూపర్ సేవింగ్స్ అంశంపై మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈసందర్భంగాపాఠశాల ప్రధానో పాధ్యాయులు వై.వెంకటేశ్వరరావు, ఎంపిడివో సుజాత మాట్లాడుతూ పన్ను విధానాలను సరళీకృతం చేయడం ద్వారా సామాన్య ప్రజలకు, రైతులకు కార్మికులకు, విద్యార్థులకు, వైద్య సేవలు పొందే వారికి ఎలాంటి ప్రయోజనాలు కలుగుతున్నాయో వివరించారు. వస్తు సేవలపన్ను ప్రాధాన్యత,నూతన జిఎస్టీ విధానం ద్వారా ఆర్థిక ప్రయోజనం ఎలా కలుగుతుందో అవగాహన కల్పించారు. అనంతరం నూతన జిఎస్టీ అంశంపై విద్యార్థులకు వ్యాసరచన, పెయింటింగ్, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎంపిడివో కె. సుజాత,మండల విద్యాశాఖాధికారులు ఇ. రవిచంద్రబాబు, టి. హరిబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రోడ్డుకు ఇరువైపులా కంప చెట్లు తొలగించాలి

**రాచర్ల, అక్టోబర్ 7, ప్రభాతవార్త**
రాచర్ల నుండి పలుగుంటిపల్లి బస్టాండ్ వరకు ఆర్అండ్‌బి రోడ్డుకు ఇరువైపుల ఉన్న చిల్ల కంపచెట్లు తొలగించాలని మండల టిడిపి నాయకుడు స్పందన విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ పేర్ల సుధీర్ కుమార్ రెడ్డి మండల అధికారులకు విజ్ఞప్తి చేశారు.ఈ మేరకు ఆయన మంగళవారం స్థానిక ఎంపీడీవో ఎస్ వెంకట్రామిరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. జాతీయ రహదారిపై తిరిగే వాహనాలకు చిలకంప చెట్లు ఇబ్బందికరంగా ఉన్నాయని వాటిని తొలగిస్తే ప్రమాదాలు నివారించవచ్చని, చెట్లుతొలగించి రోడ్డు ప్రక్క స్థలాన్ని శుభ్రం చేస్తే వాకింగ్ చేసే వారికి అనుకూలంగా ఉంటుందన్నారు. ఒకవేళ అధికారులకు నిధుల కొరత ఉండి తక్షణమే చేయలేకపోతే అధికారులు తమకు అనుమతిస్తే తమ విద్యా సంస్థ తరపున సొంత నిధులతో చెట్లు తొలగించి రోడ్డు ప్రక్క అనుకూలమైన రాస్తా ఏర్పాటు చేసి వాకింగ్ చేసే వారికి తోడ్పాటు అందిస్తానని తెలిపారు.

7_7.qxd 10/7/2025 11:58 PM Page 1



# ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలి



**సంతనూతలపాడు, అక్టోబర్ 7, ప్రభాతవార్త**
ఆశా కార్యకర్తల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించాలని కోరుతూ మంగళవారం సంతనూతలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పేర్నమిట్ట పరిధిలోని పీర్లమాన్యం యుపీహెచ్‌సీలోనూ ఆశా కార్యకర్తలు, వైద్యులకు అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయు జిల్లా కార్యదర్శి బంకా సుబ్బారావు మాట్లాడుతూ ఆశా కార్యకర్తలకు పని ఒత్తిడి పెరిగిందని ఒత్తిడిని తగ్గించాలని, పనికి తగ్గ కనీస వేతనాలు ఇవ్వాలని, ప్రభుత్వం ఇస్తున్న జాతీయ సెలవులు పండుగ సెలవులు వారాంతపు సెలవులు ఆశాలకు వర్తింపచేయాలని కోరారు. 2 జీ మొబైల్ స్థానంలో 5 జి మొబైల్ సీమ్ ఇవ్వాలని, దహన సంస్కారాలకు 20 వేలు రూపాయలు ఇవ్వాలని అన్నారు. పీహెచ్‌సీకి వెళ్ళిన ప్రతి సందర్భంలోనూ టీఏడీఏలు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వాలు యజమానులు కనుగుణంగా మార్చుతూ 8 గంటల పని దినాన్ని 10 గంటలకు పెంచుతూ చేసిన చట్టాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు డి.మాధవి, పిచ్చమ్మ, సుజాత, సుకన్య, పద్మ, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

# అండర్ - 19 బాల బాలికల జిల్లా హాకీ జట్టు ఎంపికలు





**సంతనూతలపాడు, అక్టోబర్ 7, ప్రభాతవార్త**
సంతనూతలపాడు మండలంలోని మేనంపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో అండర్-19 బాల బాలికల జిల్లా హాకీ జట్ల ఎంపికలు మంగళవారం జరిగాయి. ఈ ఎంపికల్లో పాల్గొన్న క్రీడాకారుల మధ్య పోటీలు నిర్వహించి క్రీడా నైపుణ్యం ప్రదర్శించిన వారిని జిల్లా జట్టుకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు టి.రవికుమార్ , డి.శ్రీనివాసరావులు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు త్వరలో వివిధ జిల్లాలో జరగబోయే రాష్ట్ర స్థాయి టోర్నమెంట్‌లో పాల్గొంటారని ప్రకాశం జిల్లాఅండర్-19 ఎస్‌జీఎఫ్ సెక్రటరీ చింపారెడ్డి తెలిపారు. ఈ ఎంపికలను ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు డీవీఎల్ నరసింహారావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో మైనంపాడు గ్రామ పంచాయతీ సెక్రటరీ పి.రవికుమార్, డైట్ లెక్చరర్ తిరుపతయ్య, ఉపాధ్యాయులు హనుమచారి, పీడీలు వనజ, కౌసల్య, సౌజన్య, కోటిరెడ్డి పాల్గొన్నారు.

# ఆరోగ్యం, విద్య పట్ల అవగాహన



**సంతనూతలపాడు, అక్టోబర్ 7, ప్రభాతవార్త**
ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవాల సందర్భంగా మంగళవారం నాడు సంతనూతలపాడు మండలం పేర్నమిట్ట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంచి ఆరోగ్యం- మంచివిద్య వల్ల మానసిక స్థిరత్వం అనే అంశాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సమగ్ర శిక్ష వారి ఆధ్వర్యంలో మానసిక నిపుణురాలు అయిన పెద్దపూడి గ్రేస్ పుష్యరాగం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండే విధానం, ఆరోగ్యకరమైన ఆహారం ప్రాముఖ్యత వ్యాయామం, ధ్యానం, ఫిజికల్ ఫిట్నెస్ వంటి అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## స్వామిత్ర సర్వేను పరిశీలించిన ఎంపీడీవో సురేష్‌బాబు



**సంతనూతలపాడు, అక్టోబర్ 7, ప్రభాతవార్త**
సంతనూతలపాడులో జరుగుతున్న స్వామిత్ర సర్వేను మంగళవారం నాడు ఎంపీడీవో డి.సురేష్‌బాబు పరిశీలించారు. సంతనూతలపాడులో ఆరు టీములు స్వామిత్రలో ఇళ్ల కొలతల పక్రియను చేపట్టినట్లు ఎంపీడీవో సురేష్‌బాబు పేర్కొన్నారు. ప్రభుత్వం పంపించిన మ్యాపులు ద్వారా వర్క్ ముమ్మరంగా జరుగుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. సర్వేను పగడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీవో సురేష్‌బాబు సర్వే బృందానికి సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో పి.రవికుమార్, సంతనూతలపాడు పంచాయతీ కార్యదర్శి ఎన్.ప్రతాప్ కుమార్, కామేపల్లి వారిపాలెం పంచాయతీ కార్యదర్శి శ్రీకళ, సర్వే బృందం ప్రతినిధులు కళ్యాణ్, గీతా మాధురి, నీలిమ, హరికృష్ణ, సుభాషిణి, తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన అధికారులు, పలు పార్టీల నేతలు



**సంతనూతలపాడు, అక్టోబర్ 7, ప్రభాతవార్త**
సంతనూతలపాడులో మాజీ సర్పంచ్ బాపట్లపార్లమెంట్ టీడీపీ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి రంపతోటి అంకారావు సోదరుడు శ్రీనివాసరావు కుమార్తె వివాహ రిసెప్షన్ వేడుకల్లో నూతన వధూవరులైన పావని, రాజేష్‌లను చీమకుర్తి ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.సుకన్య సంతనూతలపాడు ఎస్సై వేజెండ్ల అజయ్‌బాబు, రాష్ట్ర టీడీపీ కార్యదర్శి అడకా స్వాములు, మండల టీడీపీ అధ్యక్షులు మద్దినేని హరిబాబు, మండల టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్బూరి శ్రీనివాసరావు తదితరులు ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పారిశ్రామిక వేత్త కొప్పోలు రామారావు, జిల్లా ఆర్యవైశ్య నాయకులు పబ్బిశెటిట శ్రీనివాసరావు, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి రావులపల్లి వెంకట సురేష్ బాబు, మండల టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షులు గోపికృష్ణ, ఎనికపాడు సర్పంచ్ తలారి వెంకటరావు, చెన్నకేశవస్వామి ఆలయ చైర్మన్ దుంపా సుబ్బారెడ్డి, మాజీ జడ్పీటీసీ తన్నీరు శ్రీనివాసరావు, పంచాయతీ రాజ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కృష్ణ మోహన్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దుంపా యలమందరెడ్డి, టీడీపీ, జనసేన నాయకులు బొడ్డపాటి చంద్రశేఖర్, షేక్ నాయబ్, మద్దిరాల శ్రీనివాసరావు, మనబోతు బ్రహ్మయ్య, శ్రీనివాసరావు, ఎస్.కొండలరావు, కోతి కోటేశ్వరరావు, జే.లక్ష్మీనారాయణ, నంద్యాల రామయ్య, ఆర్.శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ రంపతోటి అంకారావు, అంబేద్కర్ సంఘ నాయకులు ప్రకాశం, మార్పుడి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు. పాస్టర్ టి.జాషువా, ఈ సందర్భంగా ప్రార్ధనలు నిర్వహించారు.

## డొంక పోరంబోకు ఆక్రమణపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు వినతి

**సంతనూతలపాడు, అక్టోబర్ 7, ప్రభాతవార్త**
సంతనూతలపాడు మండలం ఎండ్లూరు డొంక పరిధిలో గల సర్వే నంబర్ 393 లో డొంక పోరంబోకు భూమిని ఆక్రమించిన రియల్ ఎస్టేట్ దారులపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజా బాబుకు పేర్నమిట్టకు చెందిన మందా శేఖర్‌బాబు వినతిపత్రాన్ని అందజేశారు. ఎండ్లూరు డొంక పరిధిలోని అంబేద్కర్ కాలనీ సమీపంలో డొంక పోరంబోకు భూమిని సదరు రియల్ ఎస్టేట్ దారుడు దర్జాగా ఆక్రమించినను నేటి వరకు చర్యలు చేపట్టలేదని శేఖర్‌బాబు తదితరులు కలెక్టర్‌కు విన్నవించారు. ఇకనైనా డొంక పోరంబోకు భూమికి సర్వే నిర్వహించి ఆక్రమణ ను నివారించాలని వారు కోరారు.

# 9 నుండి 13 వరకు బ్యాంకు సేవలు నిలిపివేత

**బల్లికురవ, అక్టోబర్ 7, ప్రభాతవార్త**
ఈ నెల 9నుండి 13వ తేదీ వరకు ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు సేవలు నిలిచిపోనున్నట్లు బ్యాంకు సీనియర్ మేనేజర్ సీనా నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. గ్రామీణ బ్యాంకుల విలీనం సందర్భంగా కోర్ బ్యాంకింగ్ సొల్యూషన్స్ అనుసంధానంలో భాగంగా నిర్వహించే సాంకేతిక పక్రియ కారణంగా ఖాతాదారులకు ఈ అసౌకర్యం కలుగుతుందని వివరించారు. ఎంతో విలువైన ఖాతాదారులు బ్యాంకింగ్ సేవలు నిలిచిపోవడంతో ఇబ్బంది పడకూడదని, సేవలు పునరుద్దరించబడే వరకు తమ ఆర్థిక లావాదేవీలకు ప్రత్యేకమైన ప్రణాళిక రూపొందించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఖాతాదారులకు కలుగుతున్న ఈ అసౌకర్యానికి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు తీవ్ర విచారం వ్యక్తం చేస్తుందని ఆయన వివరించారు.

# సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్‌పై అవగాహన



**మార్టూరు, అక్టోబర్ 7, ప్రభాతవార్త**
మార్టూరులోని రాయల్ హైస్కూల్ నందు సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ పై అవగాహన కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఎంఈఓ వస్త్రం నాయక్, బాపట్ల జీఎస్‌టీఓ శ్రీనివాస్ పరిశీలించారు. విద్యార్థులకు జీఎస్టీ గురించి సోషల్ ఉపాధ్యాయులు నారాయణ, నాగేశ్వరరావులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఎస్సే రైటింగ్, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. సంస్థ సెక్రటరీ, కరస్పాండెంట్ పి.రవీంద్రబాబు, ఇన్‌చార్జి మధుబాబు పాల్గొన్నారు.

# జీఎస్టీపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలి



**వెలిగండ్ల, అక్టోబర్ 7, ప్రభాతవార్త**
మండల పరిషత్ అభివృద్ధి అధికారి షేక్ మహబూబ్ భాషా, మండల విద్యాశాఖాధికారి ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో మంగళవారం జీఎస్టీపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రమైన వెలిగండ్ల జిల్లా పరిషత్ హైస్కూల్, కస్తూర్బా స్కూళ్లలో విద్యార్థినీ, విద్యార్థులకు జీఎస్టీపై అవగాహన కల్పించడం జరిగింది. అనంతరం విద్యార్థినీ, విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీలు, పెయింటింగ్స్ లో అత్యుత్తమ ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు ఎంపీడీవో షేక్ మహబూబ్ భాషా, మండల విద్యాశాఖ అధికారి దాస్ ప్రసాద్ చేతుల మీదుగా బహుమతులు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ జీఎస్టీపై అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీవో సూచించారు. సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రమైన వెలిగండ్ల పంచాయతీ పరిధిలో ర్యాలీ నిర్వహించి మానవహారం ఏర్పాటు చేశారు. వినియోగదారులకు దుకాణదారులకు సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై కరపత్రాలు పంచుతూ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో షేక్ మహబూబ్ భాషా, మండల విద్యాశాఖ అధికారి దాస్ ప్రసాద్, ఉపాధ్యాయులు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### పాలుట్ల రహదారికి ఫారెస్టు అనుమతులు ఇప్పించాలని ఉపముఖ్యమంత్రి

## ఓఎస్డికి వినతి పత్రం అందించిన ఎమ్మెల్యే



**యర్రగొండపాలెం,అక్టోబర్ 7,ప్రభాతవార్త**
రాజదానిఅమరావతిలోనిసచివాలయంనందు గలఉపముఖ్యమంత్రి కార్యాలయానికి యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ సందర్శించారు , యర్రగొండ పాలెం నియోజక వర్గంలోని ప్రదానా సమస్య అయిన నలమల అటవీ ప్రాంతంలోని పాలుట్ల గ్రామానికి రహదారి నిర్మించేదుకు ఫారెస్ట్ అనుమతులు ఇప్పించాలని ఉపముఖ్యమంత్రి ఓఎస్డీ కె. వెంకటకృష్ణకు నియోజకవర్గ నాయకులతో కలిసి వినతి పత్రాన్ని అందించారు. అదేవిధంగా యర్రగొండపాలెం నియోజక వర్గంలోని పలు గ్రామాల సర్పంచులకు సమాచారం అందించకుండగా సర్పంచుల అమోదం లేకుండగా పంచాయితీ కార్యాదర్శులు అక్రమంగా అయా పంచాయితీల నిధులను డ్రా చేసుకోవాడం పై చర్యలు తీసుకోవాలని కోరారుబీవినతి పత్రాన్ని అందుకున్నా ఓస్డీడి సానుకులంగా స్పందించారని , పంచాయితీలలో పనులు చెయకుండగా అక్రమంగా నిధులను డ్రాచేసిన వారిపై చర్యలు గైకొంటామని హామీ ఇచ్చినట్లు వైసీపి సర్పంచుల బృంధం తెలిపారు .ఎమ్మెల్యేతో పాటు యర్రగొండపాలెం మండల పార్టీ అధ్యక్షులు ఏకుల ముసాలరెడ్డి , నాయుడుపాలెం సర్పంచ్ కోటిరెడ్డి , చెన్నంపల్లి సర్పంచ్ సత్తిరెడ్డి , పుల్లల చెరువు మాజీ యంపిపి సుబ్బారెడ్డి తదితరులు ఉన్నారు .

### ఏజీపీ బత్తుల రామకోటయ్యను అభినందించిన సీనియర్ జర్నలిస్ట్ కృష్ణారెడ్డి

## - పాతమాగులూరు గ్రామస్తులు



**అద్దంకి రూరల్ ,అక్టోబర్ 7, ప్రభాతవార్త**
రాష్ట్ర విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ సిఫార్సు మేరకు ప్రభుత్వం అద్దంకి జూనియర్, సీనియర్ సివిల్ న్యాయ స్థానాలలో ఏజీపీ గా నియమించిన బత్తుల రామకోటయ్య ఇటీవల భాద్యతలు స్వీకరించగా మంగళవారం సీనియర్ జర్నలిస్ట్ కృష్ణారెడ్డి, పాతమాగులూరు గ్రామానికి చెందిన గుంజి మస్తాన్‌రావు, మల్లేశ్వరి, బత్తుల అంజమ్మ, రమేష్ తదితరులు రామకోటయ్యకు దుశ్శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. పేదలకు న్యాస్థానంలో అండగా నిలచే రామకోటయ్య భావి జీవితంలో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని వారు ఆకాంక్షించారు.

### ఏజీపీ బత్తుల రామకోటయ్యను అభినందించిన ఆలూరి శ్రీనివాసరావు

## - వెల్లలచెరువు నాయకులు



**సంతమాగులూరు అక్టోబర్ 7,ప్రభాతవార్త**
ప్రభుత్వం అద్దంకి జూనియర్, సీనియర్ సివిల్ న్యాయ స్థానాలలో ఏజీపీ గా రాష్ట్ర విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ సిఫార్సు మేరకు నియమించిన బత్తుల రామకోటయ్య ఇటీవల భాద్యతలు స్వీకరించగా మంగళవారం సంతమాగులూరు మండల టీడీపీ నాయకులు ఆలూరి శ్రీనివాసరావు, వెల్లచెరువు నరగామానికి చెందిన పెద్దలు తదితరులు రామకోటయ్యకు దుశ్శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. పేదల పక్షపాతిగా న్యావాద వృత్తిలో రాణిస్తున్న రామకోటయ్య మరిన్ని ఉన్నత పదవులు అదిరోహించాలని వారు ఆకాంక్షించారు.

# రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీలకు దక్ష బక్షి ఎంపిక



**సింగరాయకొండ, అక్టోబర్ 7, ప్రభాతవార్త**
ప్రకాశం జిల్లా అద్దంకిలో జరిగిన 69వ స్కూల్ గేమ్స్ స్కేటింగ్ సెలక్షన్ పోటీలలో సింగరాయకొండకు చెందిన స్మార్ట్ జన్ గ్లోబల్ స్కూల్ విద్యార్థి దక్ష బక్షి ప్రతిభ కనబరుస్తూ జిల్లా స్థాయిలో రెండో బహుమతి సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో ఘనంగా అభినందన కార్యక్రమం నిర్వహించారు. స్కూల్ కరస్పాండెంట్ డా. గీతా రాణి మాట్లాడుతూ దక్ష స్కేటింగ్‌తో పాటు కరాటేలోనూ ప్రతిభ కనబరుస్తున్నాడు. చదువులోనూ అద్భుత ఫలితాలు సాధిస్తున్నాడు. విద్యతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించేలా మేము ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తున్నాం అని తెలిపారు. పాఠశాల అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు దక్ష బక్షి ని అభినందిస్తూ రాష్ట్ర స్థాయిలోనూ విజయం సాధించాలని ఆకాంక్షి ంచారు.

## మాజీ సీఎం జగన్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు



**సీఎస్‌పురం, అక్టోబర్ 7, ప్రభాతవార్త**
తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ రీజనల్ కోఆర్డినేటర్లు, జిల్లాఅధ్యక్షులు పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులతో వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమీక్షా సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే, విశాఖపట్నం పార్లమెంట్ పరిశీలకులు కదిరి బాబురావు పాల్గొన్నారు. ఈ సమావేశంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విద్యా, వైద్య, సంక్షేమ రంగాలను నీరుగార్చారని, కూటమి ప్రభుత్వ అరాచకాలను ప్రజల్లోకి తీసుకొని వెళ్లి ఎండగట్టాలని అలాగే వైసీపీ చేపట్టబోయే కార్యక్రమాల అమలు కార్యచరణ, పార్టీ బలోపేతంకు తీసుకోవాల్సిన చర్యలు గురించి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిశా నిర్దేశం చేశారని కదిరి బాబురావు తెలిపారు.

## పూరిమెట్లలో వాల్మీకి మహర్షి జయంతి




**ముండ్లమూరు, అక్టోబర్ 7, ప్రభాతవార్త**
మండలంలోని వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా పూరిమెట్ల గ్రామంలో జయంతి వేడుకలు మంగళవారం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో దర్శి మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ కోడిగ మస్తాన్‌రావు, ఎంపీటీసీ చింతలపల్లి వెంకటేశ్వరరావు, ఒగురూరి నాగేశ్వరరావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు చొప్పరపు నాగేశ్వరరావు, స్కూల్ చైర్మన్ నిడిగంటి వెంకటేశ్వర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఎస్సై శ్రీకాంత్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన బీజేపీ నాయకులు



**కొనకనమిట్ల, అక్టోబర్ 7, ప్రభాతవార్త**
కొనకనమిట్ల పోలీసుస్టేషన్ నూతన ఎస్సైగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన బి.శ్రీకాంత్‌ను మండల బీజేపీ నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి సత్కరించారు. ఎస్సైను పరిచయం చేసుకుని శుభాకాంక్షలు తెలిపారు. కలిసిన వారిలో మండల బీజేపీ అధ్యక్షులు మన్నం సురేష్, మాజీ మండల అధ్యక్షులు కిలారి శ్రీనివాసులు, నాయకులు కల్లం సుబ్బారెడ్డి, తుమ్మల పెంట సుబ్రహ్మణ్యం, మీరావలి తదితరులు ఉన్నారు. తహసీల్దార్ ఏ.సురేష్, ఏవో ప్రకాష్‌రావులను మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి సత్కరించారు.

## రాష్ట్రానికి పెట్టుబడులే లక్ష్యంగా మంత్రి లోకేష్ పర్యటన

### - దర్శి టీడీపీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మీ



**దర్శి, అక్టోబర్ 7, ప్రభాతవార్త**
రాష్ట్ర యువతకు ఉద్యోగాలు, రాష్ట్రానికి పెట్టుబడులే లక్ష్యంగా విద్యా, ఐటీ శాఖల మంత్రి లోకేష్ పర్యటన జరిగిందని దర్శి టీడీపీ ఇన్‌చార్జీ గొట్టిపాటి లక్ష్మీ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా గొట్టిపాటి లక్ష్మీ మాట్లాడుతూ యువత భవిష్యత్తు కోసం, రాష్ట్ర అభివృద్ధి కోసం విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్‌బాబు ముంబై పర్యటన చేపట్టారని తెలిపారు. గత ప్రభుత్వ పాలనలో రాష్ట్రం పెట్టుబడుల పరంగా, ఉద్యోగావకాశాల పరంగా వెనుకబడిందన్నారు. ముంబై పర్యటనలో భాగంగా ప్రముఖ కంపెనీల ప్రతినిధులతో మంత్రి లోకేష్ సమావేశమై ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను, యువతకు ఐటీ, పరిశ్రమ, విద్య రంగాల్లో విస్తృత అవకాశాలు కల్పించేందుకు లోకేష్ చర్యలు చేపట్టడం హర్షణీయమని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధి, యువత సాధికారిత, పెట్టుబడులే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్‌బాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.

## సుప్రీం చీఫ్ జస్టిస్‌పై బూటు విసిరిన సనాతన ధర్మం

### - దళిత సుప్రీం గవాయ్‌పై దాడి చేసిన ఫాసిస్ట్ లాయర్‌ను ఉపా చట్టం కింద అరెస్టు చేయాలి

### - దళిత నేత నీలం నాగేంద్రరావు




**చీరాల, అక్టోబర్ 7, ప్రభాతవార్త**
సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్‌పై సుప్రీం కోర్టులోనే న్యాయవాది బూటు విసరడం భారతదేశ రాజ్యాంగంపై జరిగిన సనాతన దాడి అని దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు నీలం నాగేంద్రరావు అన్నారు.మంగళవారం చీరాల దళిత మహాసభ కార్యాలయంలో అధ్యక్షులు మాచవరపు జులియన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నీలం మాట్లాడారు. 71 సంవత్సరాల వృద్ధ సుప్రీం కోర్టు లాయర్ రాకేష్ కిషన్ ఆర్‌ఎస్‌ఎస్ భావ జాలంతో చీఫ్ జస్టిస్‌పై బూటు విసిరి అవమానించారన్నారు. మధ్యప్రదేశ్‌లోని ఖజరహో ఆలయ సముదాయంలో విష్ణ విగ్రహాన్ని పునరుద్దరించాలని దాఖలైన పిటిషన్ విచారణ సందర్భంగా సీజేఐ గవాయ్ వ్యాఖ్యలపై అసంతృప్తితోనే రాకేష్ కిష్ టూబు విసిరాడని ఢిల్లీ పోలీసులు చెప్పడాన్ని నాగేంద్ర తప్పుపట్టారు. తనను నిందు కోర్టులో అవమానించిన చీఫ్ జస్టిస్‌గవాయ్ లాయర్లను విచారణ కొనసాగించమని కోరటం ఆయన ఉన్నత వ్యక్తిత్వానికి ఉదాహరణ అన్నారు. రాకేష్ కిషన్‌ను కోర్టు నుండి బయటకు తీసుకువెళ్తున్నప్పుడు, సనాతన ధర్మ కా అప్మాన్ సహి సహేగా హిందూస్థాన్ అని కేకలు వేయడం లౌకిక భారతదేశంలో సనాతనం పేరుతో పెరుగుతున్న అరాచకానికి నిదర్శనం అన్నారు. 75 ఏళ్ల అంబేద్కర్ రాజ్యాంగం అమలు వేదికపైసుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి దళితుడైనందున బూటు విసిరిన సనాతన ధర్మానికి వ్యతిరేకంగా బీజేపీ మతతత్వ గొడుగు పార్టీలను ఓడించడమే దళిత బహుజనుల కర్తవ్యం అని నీలం నాగేంద్రరావు అన్నారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు అధ్యక్షులు దారా అంజయ్య, బాపట్ల జిల్లా ఎంఎస్పీఎస్ అధ్యక్షులు తేళ్ల జయరాజు, దళిత నాయకులు కాకుమాను రవి, గొర్రెముచ్చు ఏలీయా, తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు ఎస్ఓపీ వాడకంపై అవగాహన




**నాగులుప్పలపాడు, అక్టోబర్ 7, ప్రభాతవార్త**
ఇండియన్ పొటాస్ లిమిటెడ్ ఆధ్వర్యంలో రైతులకు ఎస్ఓపీ వాడకంపై అవగాహన సదస్సు జరిగింది. నాగులుప్పలపాడు గ్రామంలోని ఆంధ్రప్రదేశ్ పొగాకు ఉత్పత్తిదారుల సమైక్య ఆవరణలో జరిగిన సదస్సుకు ఐపీఎల్ జనరల్ మేనేజర్ డాక్టర్ యుఎన్ సింగ్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ పటాస్ వాడకంపై రైతుల్లో ఉన్న అపోహాలు తొలగించి మంచి దిగుబడులకు ఎస్ఓపీ వాడకం వల్ల పొగాకు రైతులకు కలుగు ఉపయోగాలను వివరించారు. 40 సంవత్సరాలుగా రైతులకు నమ్మదగిన ఎస్ఓపీని రైతులు ప్రతి ఎకరానికి 50 కేజీలు చొప్పున వాడుకోవచ్చని, తద్వారా పంట దిగుబడి నాణ్యత ప్రమాణాలు ఎక్కువగా ఉంటాయి. ఈ కార్యక్రమంలో డిప్యూటీ జనరల్ మేనేజర్ డాక్టర్ అగర్వాల్, ఏపీ టూబాకోస్ మేనేజర్ సురేంద్ర, మాజీ ఏపీ టుబాకో చైర్మన్ వెంకట శేషయ్య, పోతవరం మాజీ సర్పంచ్‌లు నారిన చెంచయ్య, అంజయ్య, శ్రీధర్, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# జీఎస్టీ - సూపర్ సేవింగ్స్‌పై అవగాహన



**నాగులుప్పలపాడు, అక్టోబర్ 7, ప్రభాతవార్త**
ప్రభుత్వ ఆదేశాల మేరకు సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్ పై అవగాహన కార్యక్రమం మండల పరిషత్ అభివృద్ధి అధికారి వారి ఆధ్వర్యంలో విద్యాశాఖ తరుపున మండలంలోన 20 ఉన్న పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీలు నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, పెయింటింగ్ పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ పోటీలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు పొందిన విద్యార్థులకు స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు, ప్రజా ప్రతినిధులు సమక్షంలో సర్టిఫికేట్లు, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి టి.రవికుమార్, డిప్యూటీ అసిస్టెంట్ కమీషనర్, జీఎస్టీ టి.ఏడుకొండలు, మండల విద్యాశాఖాధికారులు టి.రవి, ఈవీ రమణయ్య, అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## తప్పిపోయిన బాలుడ్ని కనుగొని సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు


### - పోలీసు సిబ్బందిని అభినందించిన డీఎస్పీ





**పెద్దదోర్నాల, అక్టోబర్ 7, ప్రభాతవార్త**
పెద్దదోర్నాల పట్టణం చెంచు కాలనీకి చెందిన జగన్నాథం రుషి ఇంటి సమీపంలో ఆడుకుంటూ మంగళవారం ఉదయం నుండి కనిపించకుండా పోయాడు. ఈ మేరకు తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్సై వి.మహేష్ ఆధ్వర్యంలో పోలీసులు ఐదు బృందాలుగా ఏర్పడి యుద్ధ ప్రాదిపదికన గాలింపు చర్యలు చేపట్టారు. ఈ మేరకు బాలుడు ఆచూకీకై దోర్నాల మండలంలోని చుట్టు పక్కల గ్రామాలతో పాటు కుంట, మార్కాపురం, త్రిపురాంతకం, మున్నగు ప్రాంతాలలో గాలింపు చర్యలు చేపట్టి ఎట్టికేలకు బాలుడిని కనుగొన్నారు. ఆ బాలుడిని పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు. బాలుడిని కనుగొని తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసుల పనితీరును మార్కాపురం డీఎస్పీ యు.నాగాజు అభినందించారు. పోలీసులు ప్రజల భద్రతే కాకుండా మానవతా విలువలను నిలబెట్టడంలో నూ ముందున్నారని, కర్తవ్య నిరతితో వ్యవహారించిన ఎస్సై వి.మహేష్, సిబ్బంది శ్రద్దను ఆయన అభినందించారు.





8_8.qxd 10/7/2025 11:59 PM Page 1



## కనిగిరి ట్రేడింగ్ యాప్ పేరుతో మహిళా టోకరా..

### - రూ.1.16 కోట్ల మోసపోయిన వ్యాపారి

**కనిగిరి, అక్టోబర్ 7, ప్రభాతవార్త**

ట్రేడింగ్ యాప్ పేరుతో ప్రకాశం జిల్లా కనిగిరిలో ఘరానా మోసం చోటు చేసుకుంది. ట్రేడింగ్ యాప్‌లో డబ్బులు పెట్టి ఓ వ్యాపారి రూ.1.16 కోట్లు మోసపోయాడు. కనిగిరికి చెందిన ఓ వ్యాపారికి ఫేస్‌బుక్‌లో ఓ మహిళ పరిచయమైంది. అనంతరం ట్రేడింగ్ యాప్‌లో డబ్బులు పెట్టాలని వ్యాపారికి ఆమె సూచించింది. ఆ మాటలు నమ్మి ఆయన రూ.1.16 కోట్లు యాప్‌లో పెట్టుబడిగా పెట్టాడు. ఆ డబ్బులు తిరిగి రాకపోవడంతో మోసపోయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వ్యాపారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## తుమ్మగుంటలో మట్టి నమూనా పరీక్షలపై అవగాహన

**కనిగిరి, అక్టోబర్ 7, ప్రభాతవార్త**

కనిగిరి మండలంలోని తుమ్మగుంట గ్రామంలో మంగళవారం జిల్లా వనరుల కేంద్రం, ఒంగోలు ఆధ్వర్యంలో మట్టి నమూనా పరీక్షలు(సాయిల్ హెల్త్ కార్డ్)పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భూసార పరీక్ష కేంద్రం ఒంగోలు నుంచి సుచరిత, ఇన్‌చార్జి సహాయ వ్యవసాయ సంచాలకులు షేక్ జైనులాబిన్ మాట్లాడుతూ మట్టి నమూనా పరీక్షల ఆధారంగా ఎరువుల వినియోగం ద్వారా రైతులు పెట్టుబడులు తగ్గించుకోవచ్చని తెలిపారు. నీటి పరీక్షలు చేయించుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. జిల్లా వనరుల కేంద్రం నుండి వ్యవసాయ అధికారి శైలజ రాణి జీవన ఎరువుల ప్రాముఖ్యతపై రైతులకు అవగాహన కల్పించారు. తదుపరి కనిగిరి ఏపీ మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ టి.పద్మావతి ఆధ్వర్యంలో 8వ తరగతి విద్యార్థులతో మట్టి నమూనా సేకరణ ప్రాముఖ్యత, నమూనాలు తీసే విధానంపై ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థులే స్వయంగా మట్టి నమూనాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి మాల్యాద్రి, కంప్యూటర్ టీచర్ చి.రవి, సైన్స్ టీచర్ పి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## కూటమి పాలనలో అన్యాయానికి డిజిటల్ బుక్ సమాధానం

### - దద్దాల నారాయణ యాదవ్





**కనిగిరి, అక్టోబర్ 7, ప్రభాతవార్త**

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు, ప్రజలకు జరిగిన అన్యాయాలకు డిజిటల్ బుక్ ద్వారానే న్యాయం జరుగుతుందని కనిగిరి వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ అన్నారు. మంగళవారం కనిగిరి పట్టణంలోని పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూటమి పాలనలో అన్యాయానికి గురైన కార్యకర్తలు, అధికారులు, సామాన్య ప్రజల కోసం డిజిటల్ బుక్ ప్రారంభించడం చారిత్రాత్మక నిర్ణయమని తెలిపారు. ఇకపై పార్టీ శ్రేణులను ఇబ్బంది పెట్టే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవు. జగనన్న ఎల్లప్పుడూ కార్యకర్తలకు అండగా ఉంటారు అని భరోసా కల్పించారు. కూటమి ప్రభుత్వం 16 నెలలుగా అరాచక పాలన నడుపుతూ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతోందని ఆయన విమర్శించారు. ప్రజా సంక్షేమాన్ని విస్మరించి కక్ష సాధింపే ఈ ప్రభుత్వ లక్ష్యం అయిందని. కానీ త్వరలోనే ప్రజలు వారికి తగిన బుద్ధి చెప్తారు అన్నారు. ప్రజల సంక్షేమం కోసం కృషి చేసిన ఏకైక నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని ఆయన పేర్కొన్నారు. ఎవరికి అన్యాయం జరిగినా డీబీ.డబ్ల్యూవైఎస్ఆర్‌సీపీ.కమ్ వెబ్ సైట్‌లో లేదా 040-491718 నంబర్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. పార్టీ మళ్లీ అధికారంలోకి వచ్చిన తర్వాత బాధ్యులపై చట్టపరమైన చర్యలు తప్పవని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నియోజకవర్గ పరిశీలకులు కసుకుర్తి ఆదెన్న, కనిగిరి మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్, జడ్పీటీసీలు మడతల కస్తూరిరెడ్డి, గంగసాని హుస్సేన్‌రెడ్డి, గోవపరపు బ్రొరారెడ్డి, భువనగిరి వెంకటయ్య, పులి శాంతి, సూరసాని మోహన్‌రెడ్డి, ఆవుల భాస్కర్‌రెడ్డి, పల్నాటి భాస్కర్‌రెడ్డి, వైస్ చైర్మన్ రాచపూడి మాణిక్యరరావు, రామనబోయిన శ్రీనివాసులు, గాండ్లపర్తి ఆదినారాయణ, సిరుప గోవర్ధన్‌రెడ్డి, డాక్టర్ షేక్ నాయబ్ రసూల్, పిల్లి లక్ష్మీ నారాయణరెడ్డి, గూడూరి అబ్రహం లింకన్, యర్రబల్లి దేవరాజు, అయిమళ్ల నాగమణి, చింతగుంట్ల కిషోర్‌బాబు, మద్ది తిరుపతయ్య, గుంటూరి వెంకటేశ్వర్లు చౌదరి, బైరెడ్డి తిరుపతిరెడ్డి, మితికాల గురవయ్య, యర్రబోయిన నాగూర్, ఎలిక నారాయణ, డాక్టర్ ఆవుల కృష్ణారెడ్డి, కనిగిరి మున్సిపాలిటీ వైస్ చైర్మన్ పులి శ్రీనివాసులురెడ్డి, పాశం కొండయ్య, మూలే రాజశేఖర్‌రెడ్డి, మన్నేపల్లి పెద్దన్న, కాసుల పెద్ద గురవయ్య, కలికాయి నారాయణ, షేక్ గౌస్ భాషా, కోటపాటి మోహన్‌రెడ్డి, అచ్చాల శ్రీనివాసులురెడ్డి, మూలే గోపాల్‌రెడ్డి, షేక్ రహీం, సూరసాని చంద్రశేఖర్‌రెడ్డి, ముల్లంగి శ్రీహరిరెడ్డి, మాదాల సుబ్బారావు, బత్తుల మాల్యాద్రి, మూలే నారాయణరెడ్డి, నరాల వెంకటరెడ్డి, సిగా కృష్ణారావు, తాతపూడి సురేష్‌బాబు, సాని కొమ్ము మధుసూదన్‌రెడ్డి, తాతపూడి నాని, గోన జేమ్స్, అయ్యన్నకోట రంగయ్య, కేతబోయిన వెంకట కాశయ్య, గంగవరపు జైపాల్, ఎలిక అచ్చయ్య, శ్రీరామ శ్రీనివాసులు, తమ్మనేని శివరామిరెడ్డి, మల్లెల వెలుగొండయ్య, ఆవుల తిరుపతిరెడ్డి(ఏటీఆర్), చిలకల నారాయణరెడ్డి, దాసరి మాల్యాద్రి, యడవల్లి ప్రసాద్‌రెడ్డి, గుంటక రమణారెడ్డి, శ్యామల సాంబిరెడ్డి, రాచర్ల నరేష్, బచ్చు వెంగళరావు గుప్తా, శెట్టిపల్లి కొండయ్య, పరిమి వెంకటేశ్వర్లు చౌదరి, పోలిచర్ల షేక్ రహీం, మల్లెల యాకోబు, షకీలా, మద్దిశెట్టి భారతి, రాచూటి సుస్మిత, ఇండ్ల భాను, లక్ష్మి, మీనిగ రాధ, తమ్మనేని ఉమా శంకర్‌రెడ్డి, దేవర వెంకటేశ్వర్లు, వంకదారి రాజా, షేక్ రెహమాన్, షేక్ ఖాదర్ జిలాని, కాసుల బాలయ్య, యోహోషువ, అత్యాల ఇసాక్, భూతపాటి దేవయ్య, సుందర్, చెన్నయ్య చౌదరి, కొండ్రు నరసింహ, కసిరెడ్డి ఓబుల్‌రెడ్డి, మాదాల శ్రీనివాసులు, కాకునూరి వెంకటేశ్వర్లు, దమ్ము వెంకటయ్య, పొంకం కత్తి, మేకల వెంకటేశ్వర్లు, సుర మాల్యాద్రి, మైల కొండయ్య, కృష్ణ చారి, పైడాల మోహన్‌రెడ్డి, పత్తి సురేష్, చందా నర్సారెడ్డి, కనమర్ల వెంకటేశ్వర్లు, షేక్ చాంద్ భాషా, గుజ్జల బాల నర్సారెడ్డి, వంగెపురం జీవరత్నం, పులి రవి, బోడే మల్లిఖార్జున, బొరెడ్డి నారపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చాంద్ భాషా కుమారుడి వివాహ వేడుకల్లో పాల్గొన్న యారవ శ్రీనివాసులు, బొల్లా నరసింహారావు



**పామూరు, అక్టోబర్ 7, ప్రభాతవార్త**

పామూరులో సోమవారం పువ్వాడి ఫంక్షన్ హాల్ నందు వైఎస్సార్‌సీపీ టౌన్ అధ్యక్షులు(బుజ్జి) షేక్ చాంద్ భాష కుమారుడు వివాహ వేడుకల్లో పాల్గొన్న కనిగిరి వ్యవసాయ మార్కెట్ చైర్మన్ యారవ రమా శ్రీనివాసులు, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు బొల్లా నరసింహారావు పాల్గొని నూతన వరుడు షేక్ మహమ్మద్ హుస్సేన్‌కి ఆశీర్వదించి వివాహ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ పాలపర్తి వెంకటేశ్వర్లు, సీఎస్‌పురం మండలం సింగిల్ విండో చైర్మన్ చెరుకుపల్లి వెంకటరెడ్డి, ముస్లిం మైనార్టీ నాయకులు కావేరి రసూల్, తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వంలో రైతులకు అగ్రస్థానం

**పామూరు, అక్టోబర్ 7, ప్రభాతవార్త**



పామూరు మండలం దూబగుంట పంచాయతీ రైతు సేవ కేంద్రంలో కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాలతో వ్యవసాయాధికారులు ఏర్పాటు చేసిన యూరియా పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న కనిగిరి వ్యవసాయ మార్కెట్ చైర్మన్ యారవ రమా శ్రీనివాసులు పాల్గొని రైతులకు యూరియా, నానో యూరియా, డీఏపీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేసే అభివృద్ధి సంక్షేమ పథకాలు ఓర్వ లేక అసత్య ప్రచారాలు చేస్తున్నారని, రైతులు నమ్మవద్దని కూటమి ప్రభుత్వం రైతులకు ఇబ్బంది కలగకూడదని రైతులకు తగినంత యూరియా అందుబాటులో ఉంటుందని ప్రభుత్వం అన్ని విధాల అండగా నిలుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి వ్యవసాయ అధికారులు, గ్రామ పార్టీ అధ్యక్షులు దముండే శివశంకర్, ఉప సర్పంచ్ కందుల శ్రీనివాసులురెడ్డి, మాజీ సర్పంచ్ పోతురాజు వెంకట్రావు, జాజం నాగేశ్వరరావు, చింతలపూడి మల్లిఖార్జున, బుక్కాపురం గ్రామ పార్టీ అధ్యక్షులు రాజేంద్ర, ప్రభాకర్, తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీ అభివృద్ధికి అందరూ కలిసి పని చేయాలి







### - ఎమ్మెల్యే ఉగ్ర

**కనిగిరి, అక్టోబర్ 7, ప్రభాతవార్త**

కనిగిరి పట్టణ అభివృద్ధి కోసం ప్రజా ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, ప్రజలు సమిష్టిగా కృషి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక పురపాలక సంఘం కార్యాలయంలో చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ అధ్యక్షత జరిగిన మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

**అధికారుల నిర్లక్ష్యాన్ని సహించేది లేదు : ఉగ్ర హెచ్చరిక**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఉగ్ర మాట్లాడుతూ పట్టణంలోని నీటి సరఫరా, విద్యుత్ సమస్యలను తక్షణం పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టి మురుగు కాలువలు శుభ్రం చేయాలని, దోమల నివారణకు ఫాగింగ్ కార్యక్రమాలు క్రమం తప్పకుండా నిర్వహించాలని సూచించారు. నిర్లక్ష్యం వహించిన అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే ఎస్సీ, ఎస్టీ స్మశాన వాటికల నిర్మాణాలకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు.

**అర్బన్ కాలనీకి మున్సిపల్ సదుపాయాలు కల్పిస్తాం :**

అర్బన్ కాలనీ ప్రజల పరిస్థితి దయనీయంగా ఉందని ఎమ్మెల్యే ఉగ్ర పేర్కొన్నారు. చాకిరాల పంచాయతీ, కనిగిరి మున్సిపాలిటీ ఎవరూ పట్టించుకోకపోవడంతో సమస్యలు ఎక్కువయ్యాయని, మున్సిపాలిటీలో ఆ కాలనీని చేర్చేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. ఇంటి నంబర్లు కేటాయించి పన్నులు విధించినట్లయితే వారికిప్రభుత్వ సదుపాయాలు అందించే వీలుంటుందని వివరించారు.

**అధికారుల సమన్వయమే అభివృద్ధికి మార్గం :**

ప్రజలకు కావాల్సిన సదుపాయాలను సమకూర్చే దిశగా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. సర్వేయర్ లేకపోవడం వల్ల మున్సిపాలిటీ పనులు నిలిచిపోయాయని, ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేయక పోవడం పెద్ద తప్పిదమని ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమ లేఅవుట్లు, ఎల్ఆర్ఎస్ అప్లికేషన్లపై మున్సిపాలిటీ నిర్లక్ష్యం కారణంగా రూ.4-5 కోట్ల ఆదాయం కోల్పోయే ప్రమాదముందని చెప్పారు. వాటిపై వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

**రాజకీయాలకు అతీతంగా ప్రజా అభివృద్ధే లక్ష్యం :**

మున్సిపల్ నిధులను వార్డు కౌన్సిలర్ల సలహాలతో వినియోగించాలని, అభివృద్ధికి పార్టీలకు సంబంధం లేదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. కనిగిరి అభివృద్ధి నా అజెంబా, అవసరమైన నిధులు సమకూర్చి పట్టణాన్ని మోడల్ మున్సిపాలిటీ తీర్చిదిద్దుతాను అని ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. స్ట్రీట్ లైట్ల విషయంలో గ్యారంటీ ఉన్న వస్తువులు రీప్లేస్ చేయకుండా కొత్తవి కొనుగోలు చేయడం మున్సిపాలిటీకి నష్టం కలిగిస్తుందని, ఈ విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు.

**స్వచ్ఛ కనిగిరి బృందానికి ఘన సన్మానం :**

స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా స్థాయిలో అవార్డులు అందుకున్న స్వచ్ఛ కనిగిరి మున్సిపాలిటీ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్, రాష్ట్ర స్థాయిలో అవార్డు పొందిన కేతినేని సుశీల, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లను ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి శాలువాలతో ఘనంగా సన్మానించారు.

**రూ.5.24 కోట్లతో 62 అంశాలకు ఆమోదం :**

సమావేశంలో రూ.5.24 కోట్లతో 62 అంశాలకు కౌన్సిల్ ఆమోదంతెలిపింది. ఈ కార్యక్రమంలో కమీషనర్ పి.కృష్ణమోహన్‌రెడ్డి ,వైస్ చైర్మన్లు పులి శాంతి, మాణిక్యరావు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## శ్రీ శ్రీ శ్రీ హజరత్ మహబూబ్ సుభాని వారి 49వ గంధ మహోత్సవ ఆహ్వాన పోస్టర్ ఆవిష్కరణ



**పామూరు, అక్టోబర్ 7, ప్రభాతవార్త**

పామూరు పట్టణం సీఎస్‌పురం రోడ్డులో వెలసి ఉన్న శ్రీశ్రీశ్రీ హజరత్ మహబూబ్ సుభాని వారి గంధ మహోత్సవ - ఉరుసు ఆహ్వాన పోస్టర్ దర్గా కమిటీ సభ్యులు దర్గా వద్ద మంగళవారం ఆవిష్కరించారు. దర్గా కమిటీ ఉపాధ్యక్షులు షేక్ మీరామొహిద్దిన్ మాట్లాడుతూ పామూరులో గత 48 సంవత్సరాల నుండి కులాలకు మతాలకు అతీతంగా జరుపుకుంటున్న శ్రీశ్రీశ్రీ హజరత్ మహబూబ్ సుభాని వారి 49వ గంధ, ఉరుసు 12-10-2025 ఆదివారం రాత్రి అంగరంగ వైభవంగా జరుగును. ఈ గంధ మహోత్సవ కార్యక్రమానికి భక్తులు అందరూ పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కాగలరని కోరారు. వచ్చిన భక్తులకు దాతల సహకారంతో మహా అన్నదానం కార్యక్రమం నిర్వహించి తెల్లవారుజామున 5 గంటలకు భక్తులకు గంధం, తాంబూలాలు, తీర్థ ప్రసాదాలు పంచిపెట్టే కార్యక్రమం జరుగును. ఈ కార్యక్రమానికి దర్గా ప్రెసిడెంట్ షేక్ పులి కాశీం, ఉపాధ్యక్షులు షేక్ మీరా మొహిద్దిన్, ప్రధాన కార్యదర్శి కోడిగుంపల షేక్ నాయబ్ రసూల్, ట్రెజరర్ షేక్ హాజీ గౌస్, కమిటీ సభ్యులు పత్తు మస్తాన్, (పులి) షేక్ నాయబ్, డీజే షేక్ గౌస్ భాషా, షేక్ గయాజ్, షేక్ మహబూబ్ పీరా, దర్గా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన చింతలచెరువు సత్యనారాయణరెడ్డి

**కనిగిరి, అక్టోబర్ 7, ప్రభాతవార్త**



వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్(సీఈసీ) సభ్యుడిగా ఇటీవల నియమితులైన చింతలచెరువు సత్యనారాయణరెడ్డి మంగళవారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకత్వం తనపై ఉంచిన విశ్వాసానికి కృతజ్ఞతలు తెలియజేశారు. రానున్న రోజుల్లో పార్టీ బలోపేతం దిశగా చేపట్టబోయే కార్యక్రమాలపై జగన్‌మోహన్‌రెడ్డికి వివరించారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లో మరింతగా విస్తరించే దిశగా కృషి చేస్తానని ఆయన తెలిపారు.

## కనిగిరిలో ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు



**కనిగిరి, అక్టోబర్ 7, ప్రభాతవార్త**

పవిత్ర రామాయణ ఇతిహాస రచయిత వాల్మీకి మహర్షి జీవితం సర్వకాలిక స్ఫూర్తిదాయకమని పేర్కొంటూ,ఆయన జయంతిని మంగళవారం కనిగిరి పట్టణంలో ఘనంగా నిర్వహించారు. బీసీ సంక్షేమ సంఘం, వాల్మీకి బోయ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలుఆధ్యాత్మిక భక్తి వాతావరణం లో సాగాయి.కనిగిరి గార్లపేట రోడ్డులో ఉన్న వాల్మీకిమహర్షి విగ్రహానికి పాల్గొన్న నేతలు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కనిగిరి నియోజకవర్గ బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి ఈర్ల విజయ రామరాజు బీసీ సీనియర్ నాయకులు దేవరాజుగట్టు శివ కాశయ్య, బొప్పరాజు వెంకట సుబ్బారావు, వాల్మీకి బోయ సంఘం నాయకులు వల్లెపు వెంకటేశ్వర్లు, స్టేట్ యూత్ వింగ్ వైస్ ప్రెసిడెంట్ గడ్డి నరసింహులు, టీడీపీ పట్టణ మాజీ బీసీ సెల్ అధ్యక్షులు చింతలపూడి తిరుపాల్, కండ్లగుంట గురు ప్రసాద్, డి.వెంకటరావు, గడ్డి వెంకట సుబ్బులు,నల్లబోతుల చిన్న నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## డీజే సౌండ్ బాక్సులు వాడరాదు - సీఐ రామారావు

**దర్శి, అక్టోబర్ 7, ప్రభాతవార్త**



దర్శి, ముండ్లమూరు, తాళ్లూరు మండల పరిధిలో ఫంక్షన్లకు తిరునాళ్లకు ఏదైనా ఇతర కార్యక్రమాలకు ఎవరైనా మైకు సిస్టం వాడే సమయంలో డీజేలకు అనుమతి లేదని దర్శి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వై.రామారావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీజేలను అధిక సంఖ్యలో వాడటం వల్ల ఆ శబ్దాలకు ఈ మధ్య కాలంలో చిన్న పిల్లలు, వృద్ధులు, గుండె జబ్బు సమస్యలు ఉన్న వారు కూడా చనిపోవడం జరుగుతోంది. కావున ఎవరైనా ఎలాంటి ఫంక్షన్లు, ఉత్సవాలు తిరునాళ్లు అలాగే మీటింగ్‌లు జరుపుకోవాలని అనుకుంటారో వారు ఖచ్చితంగా స్థానిక ఎస్సై ద్వారా సబ్ డివిజనల్ పోలీసు అధికారికి పర్మిషన్ అప్లై చేసుకోవాలి. పర్మిషన్ పొందిన వారు మైకు లేదా ఏదైనా సౌండ్ బాక్స్‌లు పరిమిత సంఖ్యలో మాత్రమే వాడుతూ సౌండ్ మించకుండా ఉండేలా చూసుకోవాలని అలా కాకుండా ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించినట్లయితే అటువంటి వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన ఒక ప్రకటనలో తెలియజేశారు.

## ప్రస్తుత సేవల పన్నుపై అవగాహన

**దర్శి, అక్టోబర్ 7, ప్రభాతవార్త**



స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం కామర్స్ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో 'ప్రస్తుత సేవల పన్ను' అనే అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా కళాశాల సీపీడీసీ మెంబర్ జీవీ రత్నం హాజరై మాట్లాడుతూ వస్తు సేవలపన్ను వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. దీని వల్ల పన్ను ఎగవేత తగ్గుతుందని, చాలా మంది వ్యాపారస్తులు పన్ను క్రిందకు వస్తారని, జీఎస్టీ రిజిస్ట్రేషన్ సులభతరం అవుతుందని, కావున చాలా మంది వ్యాపారస్తులు ఇండియాలోనే వ్యాపారం చేయవచ్చని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కామర్స్ డిపార్టుమెంట్ వారు విద్యార్థులకు, వ్యాసరచన పోటీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ కే.ప్రభుదాస్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

### మాదకద్రవ్యాలు పేలుడు పదార్థాలపై పోలీసు జాగిలంతో తనిఖీలు

**దర్శి, అక్టోబర్ 7, ప్రభాతవార్త**



మాదక ద్రవ్యాలు పేలుడు పదార్థాలు నివారణ నేపథ్యంలో జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు మంగళవారం దర్శిలో దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ పర్యవేక్షణ లో మంగళవారం దర్శి టౌన్‌లోని వివిధ ప్రాంతాలలో ఒంగోలు నుండి వచ్చిన ఆర్‌ఓఎక్స్‌వై అనే పోలీసు జాగిలంతో పట్టణంలోని అన్ని దుకాణాలు పరిశీలించడం జరిగింది. ఈ కార్యక్రమంలో దర్శి సీఐ వై.రామారావు, ఎస్సై ఎం.మురళి, పోలీసు సిబ్బంది ఉన్నారు.

## సుప్రీం కోర్టు న్యాయమూర్తి గవాయ్‌పై దాడి చేసిన ముద్దాయిలను అరెస్టు చేయాలి

**దర్శి, అక్టోబర్ 7, ప్రభాతవార్త**



భారతదేశ అత్యున్నత సుప్రీం కోర్టు న్యాయమూర్తి గవాయ్‌పై దాడి చేసిన ముద్దాయిలను వెంటనే అరెస్టు చేయలని ఈ దాడిని అన్ని రాజకీయ పార్టీలు ప్రజా సంఘాలు , దళిత సంఘాలు అభ్యుదయ వాదులు ఖండించాలని కోరుతూ దళిత సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం దర్శి ఎంపీడీవో ఆఫీస్ ఆవరణంలో ఉన్న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నల్ల రిబ్బన్తో నిరసన తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర దళిత సేన దర్శి నియోజకవర్గ అధ్యక్షులు గర్నెపూడి ప్రేమ్ కుమార్, నవ్యాంధ్ర మాదిగ చర్మకారులు, డప్పు కళాకారులు పోరాట సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు కవలకుంట్ల గోవింద ప్రసాద్ మాదిగ మాట్లాడుతూ భారతదేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టులో కేసు విచారణ జరుగుతుండగా సుప్రీం కోర్టు న్యాయమూర్తి భూషణ్ రామకృష్ణ గవాయ్‌పై బూట్ విసిరివేయడాన్ని న్యాయం భారతదేశ న్యాయవ్యవస్థలకి కలంకం తెచ్చే విధంగా వ్యవహరించడానికి యావత్ భారతదేశంలో ఉన్న ప్రజలందరూ ఈ దాడిని ఖండించాలని ఈ సందర్భంగా వారు కోరారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు ఎర్రగుంట్ల నాగేశ్వరరావు, దొంతులూరి కోటేష్, పూసల ఓబయ్య, నరసింహ, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

## సీజేఐపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

### - ఏపీఏడబ్ల్యాయు



**ముండ్లమూరు, అక్టోబర్ 7, ప్రభాతవార్త**

సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై దాడిని ఖండిస్తూ ముండ్లమూరు మండలం మారెళ్ళ గ్రామంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ముండ్లమూరు మండల కమిటీ నిరసన కార్యక్రమం నిర్వహించింది. ఈ నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా సహాయ కార్యదర్శి వెల్లంపల్లి ఆంజనేయులు మాట్లాడుతూ రాయ్‌బరేలీలో ఒక దళిత యువకుడి నిర్దయ హత్య, ఆపై ఇప్పుడు దేశ ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ)పై కూడా దాడి కేవలం ఆయన దళితుడు కావడమే కారణమా..? ఇదే బీజేపీ- ఆర్ఎస్ఎస్‌ల ద్వేషపూరిత మనస్తత్వం. ఇక్కడ కులం, మతం అనే గోడలు భద్రత,న్యాయం కంటే ఎత్తుగా ఉన్నాయి. ఈ కార్యక్రమంలో ఆర్.శ్రీను, టి.అంజయ్య, టి.హనుమంతరావు, హరిబాబు, గోసాల శ్రీను, బ్రహ్మం, ఎస్.ఆంజనేయులు, జి.కోటేశ్వరరావు, సీహెచ్ అంజయ్య, జి.ఆంజనేయులు, వేణు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్‌ను కలిసిన ఏఐసీసీసీ సంఘ నాయకులు

**దర్శి, అక్టోబర్ 7, ప్రభాతవార్త**



ప్రకాశం జిల్లా కలెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన రాజాబాబును ఏఐసీసీసీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కోఆర్డినేటర్ ఆదంబాబు, ఏఐసీసీసీ యూత్ సెక్రటరీ బి.సురేష్,పాస్టర్ ఎం.స్టాలిన్‌లు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు.కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా క్రిస్టియన్‌ల సమస్యలు పరిష్కరించాలని కోరారు.

# భారత్ గౌరవ్ పర్యాటక ప్రత్యేక రైలు




## తెలుగు రాష్ట్రాల మీదుగా గుజరాత్‌కు రాకపోకలు

**గుంతకల్లు రైల్వే, అక్టోబరు 7, ప్రభాత వార్త:** తీర్థయాత్రలలో భాగంగా వివిధ ప్రాంతాలను సందర్శించాలనుకునే ఔత్సాహిక యాత్రికుల సౌకర్యార్థం రైల్వేశాఖ సీమాంధ్ర మీదుగా గుజరాత్ కు భారత్ గౌరవ్ ప్రత్యేక పర్యాటక ప్రత్యేక రైలు సర్వీసులను నడుపుతున్నట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. ఈనెల 26న మధ్యాహ్నం 03:00 గంటలకు రేణిగుంట నుండి బయలు దేరే 'భారత్ గౌరవ్' ప్రత్యేక పర్యాటక రైలు భవ్య గుజరాత్ ప్యాకేజ్ (9 రాత్రులు / 10 రోజులు) కోసం బయలు దేరుతుంది. ఈ రైలు ఈనెల 27న, సికింద్రాబాద్ కు ఉదయం 08:00 గంటలకు, నిజామాబాద్, నాందేడ్, పూర్ణాల మీదుగా ద్వారకాలోని ద్వారకాధీశ్ ఆలయం, నాగేశ్వర ఆలయం, బేట్‌ద్వారకా, సోమనాథ్‌లోని సోమనాథ్ ఆలయం, అహ్మదాబాద్‌లోని సబర్మతి ఆశ్రమం, మోడేరా లోని సూర్యదేవాలయం (మోడేరా), రాణి కి వావ్ (పటాన్), ఎకతా నగర్‌లోని స్టాచ్యూ ఆఫ్ యూనిటీలను యాత్రికులకు చూపుతుంది.

**ప్రయాణ మార్గం:**
రేణిగుంట నుండి బయలుదేరి గూడూరు, నెల్లూరు, ఒంగోలు, చీరాల, తెనాలి, విజయవాడ, ఖమ్మం, కాజీపేట్, సికింద్రాబాద్, నిజామాబాద్, నాందేడ్, పూర్ణా మీదుగా ప్రయాణిస్తుంది.

**ప్యాకేజ్ ధరలు:** ఎకానమీ క్లాస్ (స్లీపర్) రూ.18, 400, స్టాండర్డ్ (3ఏసి) 30,200 వేలు, కంఫర్ట్ (2ఏసి) 39,900 వేల రూపాయలు.

**సౌకర్యాలు:** రోజుకు మూడు భోజనాలు, వసతి, రవాణా సదుపాయం, ప్రతి బోగీలో కూడా ఐఆర్‌సిటి సిసిబ్బంది అందుబాటులో ఉంటారు. తెలుగు రాష్ట్రాల ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సంబంధిత అధికారులు తెలిపారు.

**తిరుపతి-అనకాపల్లి మధ్య ప్రత్యేక రైళ్లు**
ప్రయాణీకుల రద్దీని దృష్టిలో ఉంచుకొని రైల్వేశాఖ తిరుపతి-అనకాపల్లితిరుపతి మధ్య ప్రత్యేక రైలు సర్వీసులను నడుపుతున్నట్లు రైల్వేవర్గాలు తెలిపాయి. తిరుపతి నుంచి అనకాపల్లి వెళ్లే నెంబర్ 07481 ప్రత్యేక రైలు నవంబరు 02 నుంచి 30 వరకు ప్రతి ఆదివారం రాత్రి 0800 గంటలకు తిరుపతి నుంచి బయలుదేరి సోమవారం ఉదయం 09 30 గంటలకు అనకాపల్లి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో అనకాపల్లి నుంచి తిరుపతి వెళ్లే నెంబరు 07482 ఎక్స్ ప్రెస్ ఈనెల 03 నుంచి డిసెంబర్ 01 వరకు ప్రతి సోమవారం సాయంత్రం 0535 గంటలకు అనకాపల్లి నుంచి బయలుదేరి మంగళవారం ఉదయం 0740 గంటలకు తిరుపతి చేరుకుంటుంది.



# ప్రజాజీవితంలో పాతికేళ్లు!

## ప్రధానిమోడీ పునఃశ్చరణం

**న్యూఢిల్లీ, అక్టోబరు 7:** ప్రధాని నరేంద్ర మోడీ ఇవాళ తన రాజకీయ జీవితంలో కీలక మైలురాయి అందుకున్నారు. ప్రభుత్వాధినేతగా ఆయన 25 యేళ్ల పూర్తి చేసుకున్నారు. ఓ ప్రభుత్వానికి అధినేత హోదాలో ఆయన 25 యేళ్లుగా సేవలు అందిస్తున్నారు. అక్టోబర్ 7, 2025 నాటికి తనపరిపాలన 25 ఏళ్లకు చేరుకున్నట్లు ప్రధాని మోడీ తన ఎక్స్ అకౌంట్‌లో పేర్కొన్నారు. ఇదే రోజున 2001లో గుజరాత్ సిఎంగా బాధ్యతలు చేపట్టినట్లు తెలిపారు. దేశ ప్రజల జీవితాలను బలోపేతం చేసేందుకు, దేశ ఉజ్వల ప్రగతి కోసం ఆనాటి నుంచి శ్రమిస్తున్నట్లు చెప్పారు. చాలా విపత్కర పరిస్థితుల్లో ఉన్న గుజరాత్‌కు తనను సిఎంగా చేశారని, ఆ బాధ్యతలను తనకు పార్టీ అప్పగించినట్లు గుర్తుచేశారు. భారీభూకంపం, సూపర్‌సైక్లోన్, వరుస కరవులతో సతమతం అవుతున్న గుజరాత్‌ను తన చేతుల్లోపెట్టారన్నారు. ఇక 2014 లోక్‌సభ ఎన్నికల తర్వాత ప్రధానిగా దేశానికి సేవ చేస్తున్నట్లు మోడీ తన ఎక్స్ అకౌంట్‌లో తెలిపారు.

# సిజెఐపై దాడిపై నాకెలాంటి పశ్చాత్తాపంలేదు

## ఆ దేవుడే ఇలా చేయించాడు: న్యాయవాది రాకేశ్ కిశోర్



**న్యూఢిల్లీ, అక్టోబరు 7:** సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడి చేసినందుకు తనకు ఎలాంటి పశ్చాత్తాపం లేదని న్యాయవాది రాకేశ్ కిశోర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. మధ్యప్రదేశ్‌లోని ఓ విష్ణుమూర్తి విగ్రహానికి సంబంధించిన పిటిషన్‌పై సిజెఐ చేసిన వ్యంగ్య వ్యాఖ్యలు తనను తీవ్రంగా బాధించాయని, అందుకే ఈ చర్యకు పాల్పడ్డానని ఆయన స్పష్టం చేశారు. మంగళవారం మాట్లాడుతూ ఆయన ఈ మేరకు వివరణ ఇచ్చారు. సెప్టెంబర్ 16న మధ్యప్రదేశ్‌లోని జవారీలో ఉన్న ఏడడుగుల విష్ణుమూర్తి విగ్రహం పునరుద్ధరణపై సిజెఐ ముందు పిటిషన్ విచారణకు వచ్చిందని రాకేశ్ కిశోర్ గుర్తుచేశారు. ఆ సమయంలో "వెళ్లి మీ దేవుడినే ఏదైనా చేయమని అడగండి" అంటూ సిజెఐ వ్యాఖ్యానించడం తనను కలచివేసిందన్నారు. "న్యాయం చేయకపోయినా పర్వాలేదు కానీ, నమ్మకాలను ఎగతాళి చేయకూడదు. పిటిషన్‌ను తిరస్కరించడం అన్యాయం" అని ఆయన పేర్కొన్నారు. తాను హింసకు వ్యతిరేకినని, అయితే ఒక సాధారణ పౌరుడు ఎందుకిలా చేశాడో ఆలోచించాలని అన్నారు. "నేను ఏ మత్తులోనూ లేను. ఆయన చర్యకు ఇది నా ప్రతిస్పందన మాత్రమే. నాకు భయంలేదు, పశ్చాత్తాపం లేదు. క్షమాపణ చెప్పే ప్రసక్తే లేదు. ఈ పని దేవుడే చేయించాడు. నన్ను జైలుకు పంపినా, ఉరితీసినా అది ఆయన చిత్తమే'నని రాకేశ్ కిశోర్ వ్యాఖ్యానించారు. సనాతన ధర్మం, గుర్తింపు ప్రమాదంలో ఉన్నాయని, ప్రజలు తమ హక్కుల కోసం ముందుకు రావాలని ఆయన పిలుపు నిచ్చారు. తనను బార్ కౌన్సిల్ సస్పెండ్ చేయడంపైనా రాకేశ్ కిశోర్ స్పందించారు. న్యాయవాదుల చట్టంలోని సెక్షన్ 35 ప్రకారం, క్రమశిక్షణా కమిటీని ఏర్పాటు చేసి, నోటీసు ఇచ్చి, తన వాదన విన్న తర్వాతే చర్యలు తీసుకోవాలని, కానీ బార్ కౌన్సిల్ ఆ నిబంధనలను ఉల్లంఘించిందని ఆయన ఆరోపించారు. ఇక, సిజెఐపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ మంగళవారం సుప్రీంకోర్టు ఎదుట నిరసన తెలిపింది. ఇది న్యాయవ్యవస్థపై జరిగిన దాడిగా అభివర్ణించింది. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి, దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది.

# నాభార్య రాత్రిళ్లు నాగినిగా మారిపోతోంది!

## రక్షించాలంటూ ప్రజావాణిలో ఫిర్యాదు



**లక్నో, అక్టోబరు 7:** ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ఫిర్యాదులు సాధారణంగా కరెంటు, నీళ్లు, రోడ్లు, రేషన్ కార్డుల వంటి సమస్యలపై ఉంటాయి. కానీ, ఉత్తరప్రదేశ్‌లోని సీతాపూర్ జిల్లాలో ఓ వ్యక్తి చేసిన ఫిర్యాదు విని అధికారులు నివ్వెరపోయారు. తన భార్య రాత్రిపూట పాముగా మారి తనను కాటు వేయడానికి ప్రయత్నిస్తోందని ఓ భర్త చేసిన ఆరోపణ ఇప్పుడు సంచలనంగా మారింది. మహమూదాబాద్ పరిధిలోని లోధ్సా గ్రామానికి చెందిన మెరాజ్ అనే వ్యక్తి సమాధాన్ దివస్ (ప్రజావాణి) కార్యక్రమంలో భాగంగా జిల్లా మేజిస్ట్రేట్‌ను కలిశాడు. "అయ్యా, నా భార్య నసీమున్ రాత్రి అయితే చాలు పాములా మారిపోతోంది. నన్ను కాటు వేయడానికి వెంట పడుతోందని ఫిర్యాదు చేశాడు. తన భార్య వల్ల తనకు ప్రాణహాని ఉందని, ఆమె తనను మానసికంగా తీవ్రంగా హింసిస్తోందని వాపోయాడు. ఇప్పటికే చాలాసార్లు తనను చంపడానికి ప్రయత్నించిందని, అయితే ప్రతీసారి తాను మెలకువతో ఉండటంతో ప్రమాదం నుంచి బయటపడ్డానని మెరాజ్ తెలిపాడు. నిద్రలో ఉన్నప్పుడు ఏదో ఒక రాత్రి తనను చంపేయగలదని భయం వ్యక్తం చేశాడు. ఈ మేరకు జిల్లా మేజిస్ట్రేట్‌కు లిఖితపూర్వకంగా కూడా ఫిర్యాదు సమర్పించాడు. ఈ వింత ఫిర్యాదుతో ఆశ్చర్యపోయిన జిల్లా కలెక్టర్, వెంటనే దీనిపై విచారణ చేపట్టాలని సబ్‌డివిజనల్ మేజిస్ట్రేట్ (ఎస్డీఎం), పోలీసులను ఆదేశించారు. పోలీసులు దీన్ని మానసిక వేధింపుల కోణంలో దర్యాప్తు ప్రారంభించినట్లు సమాచారం. ఈ విషయం సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్‌లో వేగంగా వైరల్ అయింది. నెటిజన్లు దీనిపై సరదాగా కామెంట్లు చేస్తున్నారు. ఆమె ఇంకెంత మందిని కరుస్తోందో ఏమో అని ఒకరు వ్యాఖ్యానించగా, ఏమైనా నాగమణి దాచిపెట్టావా? అని మరొకరు చమత్కరించారు. నీ పెళ్లి జీవితంలో శ్రీదేవి దొరికింది, చాలా అదృష్టవంతుడివి అంటూ 1986 నాటి నాగిన్ సినిమాలో నటి శ్రీదేవి పోషించిన ఇచ్ఛాధారి పాము పాత్రను గుర్తుచేస్తూ మరో నెటిజన్ కామెంట్ చేశారు. ఈ విచిత్రమైన కేసులో అసలు నిజం ఏంటో తేల్చే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.

# యేడాది తర్వాత కేజ్రీవాల్‌కు అధికారిక నివాసం కేటాయింపు

**న్యూఢిల్లీ, అక్టోబరు 7:** ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీపార్టీ (ఆప్) జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌కు ఎట్టకేలకు అధికారిక బంగ్లా లభించింది. సిఎం అధికారిక నివాసాన్ని విడిచిపెట్టిన దాదాపు ఏడాది తర్వాత ఆయనకు కేంద్రం అధికారిక బంగ్లాను కేటాయించింది. 95, లోధి ఎస్టేట్‌లోని టైప్ 7 బంగ్లాను కేటాయించింది. అయితే, బీఎస్పీ అధినేత్రి మాయావతి గతంలో నివసించిన లోధి ఎస్టేట్ లోని బంగ్లాను కేజ్రీవాల్‌కు కేటాయించాలని ఆప్ కోరింది. కానీ ఆ బంగ్లాను జూన్‌లో కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరికి కేటాయించడంతో.. కేజ్రీకి వేరే బంగ్లా అలాట్ చేశారు. 2024 అక్టోబర్‌లో ఢిల్లీ సిఎం పదవి నుంచి వైదొలిగిన అరవింద్ కేజ్రీవాల్, ఫ్లాగ్‌స్టాఫ్ రోడ్‌లోని అధికార నివాసాన్ని ఖాళీ చేశారు. నాటి నుంచి మండి హౌస్ సమీపంలోని మరో పార్టీ సభ్యుడి అధికారిక గృహంలో ఆయన నివసిస్తున్నారు. ఈ క్రమంలో తనకు అధికారిక బంగ్లా కేటాయించాలంటూ కేజ్రీవాల్ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. విచారణ సందర్భంగా పదిరోజుల్లోగా ప్రభుత్వనివాసం కేటాయిస్తామని కేంద్ర ప్రభుత్వం తెలిపింది.

# సింగర్ జుబీన్ బాడీగార్డ్ ఖాతాల్లో రూ. కోటి లావాదేవీలు

**న్యూఢిల్లీ, అక్టోబర్ 7:** అస్సాంకు చెందిన ప్రముఖ గాయకుడు జుబీన్ గార్గ్ ఇటీవల సింగపూర్‌లో మృతిచెందిన సంగతి తెలిసిందే. ఆయన మృతిపై అనుమానాలు వ్యక్తమవుతున్న వేళ ఓ కీలకవిషయం వెలుగులోకి వచ్చింది. గాయకుడి భద్రతా సిబ్బంది బ్యాంకు ఖాతాల్లో రూ.కోటి లావాదేవీలు జరిగాయి. గార్గ్ మృతిపై సిట్ దర్యాప్తు కొనసాగుతోంది. ఈ క్రమంలోనే ఆయనకు చెందిన ఇద్దరు వ్యక్తిగత భద్రతా సిబ్బంది బ్యాంకు ఖాతాలను అధికారులు పరిశీలించారు. వారి ఖాతాల్లో దాదాపు రూ.కోటి లావాదేవీలు జరిగినట్లు గుర్తించారు. దీంతో గార్గ్ మరణంలో వారి ప్రమేయం ఉందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వారికి అంత డబ్బు ఎలా వచ్చిందనే దానిపై అధికారులు విచారణ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గాయకుడి మృతి కేసును ఆర్థిక కోణంలో కూడా దర్యాప్తు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేసిందని సిఎం హిమంత బిశ్వశర్మ పేర్కొన్నారు. ఇటీవల జుబీన్ బ్యాండ్‌మేట్ శేఖర్‌జ్యోతి గోస్వామి తన వాంగ్మూలంలో సంచలన ఆరోపణలు చేశారు. గాయకుడికి ఆయన మేనేజర్, ఫెస్టివల్ ఆర్గనైజేషన్ విషమిచ్చి దాన్నిప్రమాదకరంగా చిత్రీకరించే ప్రయత్నం చేసి ఉంటారన్నారు. జుబీన్ నోరు, ముక్కు నుంచి నురగ వస్తున్నప్పుడు కూడా మేనేజర్ ఏ మాత్రం కంగారు పడలేదన్నారు. వెంటనే చికిత్స అందించకుండా ఆలస్యం చేశారని పేర్కొన్నారు. దీనిపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

# జాఫర్ ఎక్స్‌ప్రెస్‌పై దాడి

## ఏడుగురికి తీవ్ర గాయాలు

**న్యూఢిల్లీ, అక్టోబరు 7:** పాకిస్థాన్‌లో ప్రయాణికుల రైలుపై మరోసారి దాడి జరిగింది. క్వెట్టా వెళుతున్న జాఫర్ ఎక్స్‌ప్రెస్‌ను లక్ష్యంగా చేసుకుని దుండగులు జరిపిన పేలుడులో కనీసం ఏడుగురు ప్రయాణికులు గాయపడ్డారు. సింధ్ ప్రావిన్స్‌లోని శికార్‌పూర్ జిల్లాలో మంగళవారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ రైలుపై దాడులు జరగడం ఇదే మొదటిసారి కాదు. శికార్‌పూర్ జిల్లాలోని సుల్తాన్ కోట్ రైల్వే స్టేషన్‌కు కిలోమీటరు దూరంలో ఉదయం 8:15 గంటల సమయంలో రైల్వే ట్రాక్‌పై దుండగులు అమర్చిన బాంబు పేలింది. జాఫర్ ఎక్స్‌ప్రెస్ ఆ మార్గం గుండా వెళుతున్నప్పుడు ఈపేలుడు సంభవించినట్లు శికార్‌పూర్ డిప్యూటీ కమిషనర్ షకీల్ అబ్రో ధృవీకరించారు. ఈ ఘటనలో గాయపడిన ఏడుగురిలో నలుగురిని కంబైన్డ్ మిలిటరీ ఆసుపత్రికి, మిగిలిన ముగ్గురిని శికార్‌పూర్‌లోని సివిల్ ఆసుపత్రికి తరలించినట్లు ఆయన తెలిపారు. పేలుడు తర్వాత ప్రయాణికులను సమీప స్టేషన్లకు తరలించి, రైల్వే ట్రాక్ మరమ్మతు పనులు ప్రారంభించినట్లు సుక్కూర్ డివిజనల్ ట్రాన్స్‌పోర్ట్ అధికారి మోహసిన్ అలీ సియాల్ వివరించారు. జాఫర్ ఎక్స్‌ప్రెస్ రైలు తరచూ దాడులకు గురవుతోంది. గత నెల సెప్టెంబర్ 24న బలూచిస్థాన్‌లోని మస్తుంగ్ ప్రాంతంలో ఇదే రైలుపై జరిగిన బాంబు దాడిలో 12 మంది గాయపడ్డారు. అంతకు ముందు ఈ ఏడాది మార్చిలో బలోచ్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ) ఉగ్రవాదులు ఇదేరైలును హైజాక్ చేసి, 400 మంది ప్రయాణికులను బందీలుగా పట్టుకోవడం తీవ్ర కలకలం సృష్టించింది.

# ఇంపోర్టెడ్ ట్రక్కులపై 25 శాతం సుంకాలు ప్రకటించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్!



**న్యూయార్క్, అక్టోబరు 7:** మధ్య శ్రేణి, హెవీ డ్యూటీ ఇంపోర్టెడ్ ట్రక్కులపై 25 శాతం సుంకాలను విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. వచ్చే నెల 1 నుంచి ఇది అమల్లోకి రానుందని తెలిపారు. ఈ ట్రక్కులను అమెరికాకు అధికంగా ఎగుమతి చేసే 5 దేశాల్లో మెక్సికో, కెనడా, జపాన్, జర్మనీ, ఫిన్లాండ్ ఉన్నాయి.

## వలసలపై ట్రంప్ ఉక్కుపాదం

# యుఎస్ వెళ్లేందుకు భారతీయ విద్యార్థుల అనాసక్తత




**వాషింగ్టన్, అక్టోబర్ 7:** మాస్ డిపోర్టేషన్, అరెస్టులు, చట్టపరమైన ప్రవేశాలపై ఆంక్షలతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చిన దగ్గరి నుంచి వలసదారులపై విరుచుకుపడుతున్నారు. అమెరికా ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తోన్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నారు. దీంతో బంగారు భవిష్యత్తును తలుచుకుంటూ ఆ దేశానికి వెళ్లాలనుకునే వారి సంఖ్య తగ్గిపోతోంది. ఆగస్టులో ఉన్నత విద్య కోసం అమెరికాకు వెళ్లే భారతీయ విద్యార్థుల సంఖ్య భారీగా పడిపోయిందని ఇంటర్నేషనల్ ట్రేడ్ కమిషన్ వెల్లడించింది. ట్రంప్ చర్యల నేపథ్యంలో ఆగస్టులో విదేశీ విద్యార్థులకు జారీచేసే వీసాల్లో తగ్గుదల కనిపించింది. గత ఏడాది ఇదే నెలతో పోలిస్తే అమెరికాకు వచ్చే విద్యార్థుల సంఖ్య 19 శాతం తగ్గింది. కరోనా మహమ్మారి తర్వాత ఇదే రికార్డు స్థాయి తగ్గుదల కావడం గమనార్హం. ఇక భారతీయ విద్యార్థుల విషయానికొస్తే 44 శాతం మేర క్షీణత కనిపించింది. సాధారణంగా యుఎస్ విశ్వవిద్యాలయాలు ప్రారంభమయ్యే ఆగస్టులో అమెరికా 3,13,138 విద్యార్థి వీసాలు జారీ చేసింది. గత ఏడాది ఇదే సమయానికి అగ్రదేశానికి వెళ్లిన విద్యార్థుల సంఖ్యలో భారత్ ముందంజలో ఉండగా, ఈసారి ఆ సంఖ్య భారీగా తగ్గింది. మరోవైపు చైనా విద్యార్థులకు యుఎస్ 86,647 వీసాలు జారీ చేసింది. భారతీయులకు జారీ చేసిన వీసాల సంఖ్యకంటే ఇది రెట్టింపు కావడం గమనార్హం. ఈ యేడాదిమేలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న అమెరికా రాయబార కార్యాలయాల్లో కొత్తగా దరఖాస్తు చేసుకునే విద్యార్థుల వీసా ఇంటర్వ్యూల షెడ్యూలింగ్‌ను తాత్కాలికంగా నిలిపివేసిన సంగతి తెలిసిందే. సోషల్ మీడియా వెట్టింగ్ కోసం వీసాల జారీని నిలిపివేశామని అప్పట్లో ఆ దేశ విదేశాంగ శాఖ వెల్లడించింది. వీసా దరఖాస్తుదారులకు అనుమతి ఇవ్వొచ్చా లేదా అనే దాన్ని అంచనావేయడం కోసం వారి ఆన్‌లైన్ యాక్టివిటీని అధికారులు తనిఖీ చేయనున్నారు. దీన్నే సోషల్ మీడియా వెట్టింగ్ అంటారు. సంబంధిత విద్యార్థుల సోషల్ మీడియా ప్రొఫైళ్లను పరిశీలించిన తర్వాతే వీసా మంజూరు చేస్తారు. అయితే తర్వాత వీసా ఇంటర్వ్యూలను షెడ్యూల్ చేసిన సంగతి తెలిసిందే. మరోవైపు ట్రంప్ హెచ్1బి వీసా దరఖాస్తు రుసుమును భారీగా పెంచిన సంగతి తెలిసిందే. ఈ పరిణామాలన్నీ అమెరికా వెళ్లే భారతీయ విద్యార్థులపై ప్రభావం చూపిస్తున్నాయి.


జాన్ క్లార్క్


మైఖేల్ హెచ్. డివోరెట్


జాన్ ఎం. మార్టినిస్

# ఫిజిక్స్‌లో ముగ్గురికి నోబెల్

## క్వాంటం టన్నెలింగ్, ఎనర్జీ క్వాంటైజేషన్‌పై పరిశోధన

**స్టాక్‌హోమ్, అక్టోబరు 7:** భౌతికశాస్త్ర విభాగంలో నోబెల్ బహుమతి 2025ని ప్రకటించారు. ఈ అత్యంత ప్రతిష్ఠాత్మక అవార్డును ముగ్గురు అమెరికన్ శాస్త్రవేత్తలు సంయుక్తంగా గెలుచుకున్నారు. జాన్ క్లార్క్, మైఖేల్ హెచ్. డివోరెట్, జాన్ ఎం. మార్టినిస్‌లను ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ మంగళవారం ప్రకటించింది. అణువుల స్థాయిలో మాత్రమే సాధ్యమనుకున్న క్వాంటం భౌతికశాస్త్ర సూత్రాలను, కంటికి కనిపించేంత పెద్ద ఎలక్ట్రిక్ సర్క్యూట్‌లో విజయవంతంగా ప్రదర్శించినందుకుగాను వారికి ఈ గౌరవం దక్కింది. క్వాంటం మెకానిక్స్ ప్రకారం, ఒక కణం తనకు అడ్డుగా ఉన్న గోడను సైతం దాటుకుని వెళ్లగలదు. దీనినే టన్నెలింగ్ అంటారు. అయితే ఇలాంటి వింత ప్రవర్తనలు కేవలం సూక్ష్మ ప్రపంచానికే పరిమితమని ఇప్పటివరకు భావించేవారు. కానీ, ఈ ముగ్గురు శాస్త్రవేత్తలు 1984-85 మధ్యలో చేసిన ప్రయోగాలతో ఈ అభిప్రాయాన్ని మార్చేశారు. వారు సూపర్ కండక్టర్లతో, మధ్యలో ఒక విద్యుత్ నిరోధక పొర (జోసెఫ్‌సన్ జంక్షన్) ఉండేలా ఒక ప్రత్యేకమైన ఎలక్ట్రిక్ సర్క్యూట్‌ను రూపొందించారు. ఈ సర్క్యూట్‌లో విద్యుత్‌ను ప్రవహింపజేసినప్పుడు, అందులోని కణాలన్నీ కలిసి ఒకే స్థూల కణంగా ప్రవర్తించడాన్ని వారు గమనించారు. ఈ స్థూల కణం, ఎలాంటి అడ్డంకి లేకపోయినా క్వాంటం టన్నెలింగ్ ద్వారా సున్నా వోల్టేజ్ స్థితి నుంచి బయటపడటాన్ని వారు నిరూపించారు. అలాగే, ఈ వ్యవస్థ నిర్దిష్ట పరిమాణంలో మాత్రమే శక్తిని గ్రహించడం లేదా విడుదల చేయడాన్ని కూడా ప్రయోగాత్మకంగా చూపించారు. ఈ ఆవిష్కరణపై నోబెల్ కమిటీ ఛైర్ ఓల్ ఎరిక్సన్ స్పందిస్తూ, "శతాబ్దాల నాటి క్వాంటం మెకానిక్స్ నిరంతరం కొత్త ఆశ్చర్యాలను అందిస్తుండటం అద్భుతంగా ఉంది. అన్ని డిజిటల్ టెక్నాలజీలకు క్వాంటం మెకానిక్సే పునాది కాబట్టి ఇది ఎంతో ఉపయోగకరమని తెలిపారు. ఈ పరిశోధనలు క్వాంటం కంప్యూటర్లు, క్వాంటం సెన్సార్లు, క్వాంటం క్రిప్టోగ్రఫీ వంటి భవిష్యత్ టెక్నాలజీల అభివృద్ధికి మార్గం సుగమం చేస్తాయని శాస్త్ర ప్రపంచం భావిస్తోంది.

# 4 రైల్వే ప్రాజెక్టులకు కేంద్రం గ్రీన్‌సిగ్నల్

## మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గుజరాత్, ఛత్తీస్‌గఢ్‌లలో 18 జిల్లాల అనుసంధానం

**న్యూఢిల్లీ, అక్టోబరు 7:** ఐదురాష్ట్రాలపరిధిలోని 18 జిల్లాలను కలుపుతూ నాలుగు ప్రాజెక్టుల రైల్వే నెట్‌వర్క్‌కు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. మంగళవారం ప్రధానిమోడీ అధ్యక్షతన జరిగిన ఆర్థికవ్యవహారాల కేబినెట్‌కమిటీ సమావేశంలో ఈ నాలుగు ప్రాజెక్టులకు సుమారు రూ.24, 634 కోట్ల వ్యయం కాగలదని అంచనావేసారు. వాటిలో మహారాష్ట్రలోని వార్ధా భూసావాల్‌ల మధ్య ఉన్న మూడు, నాలుగో లైన్లు 314 కిలోమీటర్లు, మహారాష్ట్ర ఛత్తీస్‌గఢ్‌పరిధిలోని గోండియా, డోంగర్‌గఢ్ నాలుగోలైన్ 84 కిలోమీటర్లు, గుజరాత్, మధ్యప్రదేశ్ పరిధిలోని 259 కిలోమీటర్ల నిడివికలిగిన వడోదర, రత్లాం మూడు నాలుగు లైన్లను అభివృద్ధి చేస్తారు. ఇటార్సీ, భోపాల్, బీనాలమధ్య నాలుగోలైన్ 237 కిలోమీటర్ల నిడివికలిగింది కూడా ఈ రైల్వే నెట్‌వర్క్ పరిధిలోఉంది. ఈ మల్టీట్రాకింగ్ ప్రాజెక్టు వల్ల సుమారు 85.84 లక్షల జనాభా ఉన్న 3633 గ్రామాలకు, రెండు ప్రధాన స్ఫూర్తిదాయక జిల్లాలు విదిషా, రాజ్‌నంద్‌గావ్‌లకు రవాణాసదుపాయం మరింతగా మెరుగుపడుతుందని కేబినెట్ అనంతరం సమాచార మంత్రి అశ్వినివైష్ణవ్ వెల్లడించారు. అంతేకాకుండా 18 జిల్లాల పరిధిలో సమగ్రాభివృద్ధితో పాటు స్వయం ఉపాధికూడా పెరుగుతుందని, ప్రజల్లో ఆత్మనిర్భరతను మరింత పెంచాలన్న ప్రధానిమోడీ లక్ష్యానికి అనుగుణంగా ఈప్రాజెక్టులు రూపుదిద్దుకుంటాయని తెలిపారు.

# సంక్షిప్తంగా..

## పికెతో చిరాగ్ చెట్టాపట్టాల్

**పాట్నా, అక్టోబరు 7:** బీహార్‌లో వచ్చే నెలలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలలో కొత్త పొత్తు కుదిరే అవకాశం ఉంది. కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ నేతృత్వంలోని లోక్ జనశక్తి పార్టీ, ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ నేతృత్వంలోని జన్ సూరజ్ పార్టీ కూటమి కట్టనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఎన్డీఏ కూటమిలో ఉన్న పాశ్వాన్‌కు కూటమిలోని ఇతర పార్టీలైన బీజేపీ, జేడీయూతో సీట్ల షేరింగ్‌లో లెక్క కుదరడం లేదు. ఎన్డీఏ కూటమిలో షీట్ల షేరింగ్‌పై తాను బీజేపీతో మాత్రమే మాట్లాడుతానని, జేడీయూతో సంబంధం లేదని చిరాగ్‌అన్నారు. బిజెపి కూడా తన డిమాండ్‌ను ఒప్పుకోకపోతే ఏ క్షణంలోనైనా కూటమి నుంచి బయటికి వెళ్లే ఆప్షన్ తనకు ఉన్నదని అన్నారు.

## 'కమల్‌హాసన్ అంతరాత్మను అమ్ముకున్నారు'



**చెన్నై, అక్టోబరు7:** ప్రముఖ నటుడు, మక్కల్ నీది మయ్యం చీఫ్, రాజ్యసభ సభ్యుడు కమల్ హాసన్‌పై బీజేపీ నేత అన్నామలై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కరూర్ తొక్కిసలాట ఘటనలో ప్రభుత్వానికి అనుకూలంగా మాట్లాడటంపై మండిపడ్డారు. కమల్ అధికార డిఎంకెకి అనుకూలంగా ఉన్నారని ఆరోపించారు. రాజ్యసభ సీటు కోసం తన ఆత్మగౌరవాన్ని అమ్ముకున్నారంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కరూర్ బాధితుల పరామర్శకు వెళ్లి తొక్కిసలాటలో ప్రభుత్వం తప్పు లేదని అంటే ఎవరైనా అంగీకరిస్తారా ఆయన మరీ ఇంత దిగజారాలా అసలు ఆయన మాటలను తమిళనాడు ప్రజలు పట్టించుకునే పరిస్థితిలో లేరని అన్నామలై అన్నారు.

## అధైర్య పడకండి.. నేనొస్తా, ఆదుకుంటా!

**చెన్నై, అక్టోబరు 7:** టివికె పార్టీ అధ్యక్షుడు విజయ్ కరూర్‌లో నిర్వహించిన ప్రచార ర్యాలీ తీవ్ర విషాదాన్ని నింపిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో 41 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో మృతుల కుటుంబాలతో మంగళవారం విజయ్ వీడియోకాల్‌లో మాట్లాడారు. వారిని ఓదార్చిన ఆయన త్వరలో కరూర్‌లో పర్యటిస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. కరూర్‌లో విజయ్ నిర్వహించిన ర్యాలీలో జరిగిన తొక్కిసలాట దేశవ్యాప్తంగా దిగ్భ్రాంతికి గురిచేసింది. దీనిపై స్వతంత్ర దర్యాప్తు కోరుతూ విజయ్ పార్టీ మద్రాస్ హైకోర్టును ఆశ్రయించింది. దీన్ని తొలుత వ్యతిరేకించిన న్యాయస్థానం ఆ తర్వాత సిట్ దర్యాప్తుకు ఆదేశించింది. ఈ విషాదం వేళ విజయ్‌పై రాజకీయంగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కాగా కరూర్‌లో ఘటనాస్థలిని ఎంఎన్ఎం అధినేత కమల్‌హాసన్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమిళగ వెట్రి కళగం సభలో తప్పు జరిగిందని, దానిని ఒప్పుకొని బాధితులకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. దాన్ని కప్పిపుచ్చుకొనేలా ఇతరులపై నిందలు వేయడం సరికాదన్నారు.

## బిజెపి నేతపై కాల్పులు.. దుర్మరణం

**బర్హంపూర్, అక్టోబరు 7:** ఒడిశాలోని బరంపురంలో భారతీయ జనతా పార్టీ (బిజెపి) నేత, సీనియర్ న్యాయవాది పీతాబాస్ పాండాను గుర్తుతెలియని వ్యక్తులు దారుణంగా కాల్చి చంపారు. గత రాత్రి ఈ దారుణ ఘటన చోటుచేసుకుంది. ఓ కార్యక్రమాన్ని ముగించుకుని రాత్రి 10 గంటల సమయంలో బైకుంఠనగర్‌లోని తన నివాసానికి తిరిగి వస్తుండగా ఈ దాడి జరిగింది. ఇంటి సమీపంలోనే మాటువేసిన ఇద్దరు దుండగులు బైక్‌పై వచ్చి పాండాను అడ్డగించారు. అత్యంత సమీపం నుంచి ఆయనపై రెండు రౌండ్లు కాల్పులు జరిపి అక్కడి నుంచి పరారయ్యారు. ఈ ఘటనలో పాండా చాతీలోకి బుల్లెట్లు దూసుకెళ్లడంతో ఆయన అక్కడికక్కడే మరణించారు.

## గ్రేస్ ఓమైలీకి బ్రిటన్ పౌర పురస్కారం

**లండన్, అక్టోబర్ 7:** రెండేళ్ల క్రితం నాటింగ్‌హామ్‌లో స్నేహితురాలిని కాపాడే ప్రయత్నంలో కత్తిపోట్లకు గురై ప్రాణాలు కోల్పోయిన భారత సంతతి యువతి గ్రేస్ ఓమైలీ కుమార్ (19)కి మరణానంతరం బ్రిటిష్ ప్రభుత్వం ద్వితీయ అత్యున్నత పౌర పురస్కారం జార్జ్ మెడల్‌ను ప్రకటించింది. 2023 జూన్ 13న గ్రేస్ తన స్నేహితురాలు జానబీ వెబర్‌తో కలిసి ఇంటికి ఇంటికి తిరిగి వస్తున్నప్పుడు దాడి జరిగింది. వాల్డోకైలోకేన్ అనే వ్యక్తి వెబర్‌పై వెనకనుంచి కత్తితో దాడి చేయగా, గ్రేస్ ధైర్యంతో అతన్ని అడ్డుకునేందుకు ప్రయత్నించింది. దాడిలో స్నేహితులిద్దరూ ప్రాణాలు కోల్పోయారు. నిందితుడిని అధికారులు అదుపులోకి తీసుకున్నారు. గ్రేస్ క్రీడాకారిణి కూడా. ఆమె ధైర్యం అసలైన శౌర్యానికి మంచి ఉదాహరణ అని బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ కొనియాడారు. గ్రేస్ కుటుంబ సభ్యులకు పురస్కారాన్ని ప్రదానం చేస్తారు. ఇలా మొత్తం 20 మందిని గౌరవిస్తారు.

8-10pg6exHMNWJQE 10_8-10pg6exHMNWJQE.qxd 10/8/2025 12:04 AM Page 1



# ప్రత్యేక కమిషన్‌తో బిసిల కులగణన నిర్వహించాలి

## సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

**విజయవాడ, అక్టోబరు 7, ప్రభాతవార్త :** స్థానిక సంస్థల ఎన్నికలలో వెనుకబడిన తరగతులకు దామాషా రిజర్వేషన్ల అమలుకు ముందస్తుగా విద్య, ఉపాధి, రాజకీయ ప్రాతినిధ్యం కోసం ప్రత్యేక కమిషన్ ద్వారా కుల గణన నిర్వహించాలని రాష్ట్ర గవర్నరు అబ్దుల్ నజీర్‌కు విజ్ఞప్తి చేసినట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ సమాజ్ వాది పార్టీ అధ్యక్షులు పాశం వెంకటేశ్వర్లు యాదవ్ వెల్లడించారు. కర్ణాటక, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాల తరహాగా రాష్ట్రంలోను జనగణనలో కులగణన చేపట్టాలని, ఆ దిశగా స్థానిక సంస్థల్లో బీసీ వర్గాలకు రిజర్వేషన్లు కల్పించేలా కూటమి ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరామన్నారు. విజయవాడ రాజ్‌భవన్‌లో గవర్నరు అబ్దుల్ నజీర్‌కు రామకృష్ణ నేతృత్వంలో సమాజ్ వాది పార్టీ రాష్ట్ర నాయకులు, వంగేపురం కార్తీక్ రాజు, ఆర్‌జెడి రాష్ట్ర నాయకులు, శ్రీనివాస్, వాసు సత్యనారాయణ మూర్తి, పార్టీ మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, బీసీ సంఘాల నేతలు డాక్టర్ అలా వెంకటేశ్వర్లు, సమాజ్‌వాద్ పార్టీ నాయకులు వెంకటేశ్వర్లు, ఆర్జేడీ నాయకులు ఆర్‌ఎస్ యాదవ్ తదితరులతో కూడిన బృందం వినతిపత్రం అందజేసింది. విద్య, ఉపాధి, రాజకీయ ప్రాతినిధ్యానికిగాను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విధానాలను అనుసరించి బీసీలకు దామాషా రిజర్వేషన్లను అమలు చేయాలని విజ్ఞప్తి చేసింది. ఈ కీలకమైన చర్యలు అమలయ్యే వరకు స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణను వాయిదా వేయాలని అభ్యర్థించింది. అనంతరం రాజ్‌భవన్ ఎదుట వివిధ రాజకీయ, బీసీ సంఘాల ప్రతినిధులతో కలిసి విలేకరులతో రామకృష్ణ మాట్లాడారు. వెనుకబడిన తరగతుల సామాజికఆర్థిక పరిస్థితులను శాస్త్రీయంగా అంచనా వేయడానికి, ఖచ్చితమైన ఆధారాల ఆధారిత విధాన ప్రణాళిక కోసం ఒక ప్రత్యేక కమిషన్ ద్వారా కుల గణన నిర్వహించాలని ప్రభుత్వాన్ని ఆదేశించాలని అభ్యర్థించామని వివరించారు. బీసీ కమిషన్ నివేదిక ఆధారంగా వెనుకబడిన తరగతులకు రిజర్వేషన్లను అమలు చేయడం చాలా అవసరమని, అంకితమైన బీసీ కమిషన్ ద్వారా కుల గణన నిర్వహించిన తర్వాత, వాస్తవ వెనుకబడిన తరగతుల జనాభాను ప్రతిబింబించే ఫలితాల ఆధారంగా, విద్య, ఉపాధి మరియు స్థానిక సంస్థలలో బీసీలకు దామాషా రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికలు, విద్యా, ఉపాధిలలో వెనుకబడిన తరగతులకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయడానికిగాను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ నమూనాను గవర్నరు దృష్టికి తీసుకెళ్లామన్నారు. బీసీ రిజర్వేషన్ బిల్లు గవర్నర్, రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉన్నప్పటికీ, రాజ్యాంగ ఆమోదాలు ఎదురుచూస్తున్నప్పటికీ, అడ్డంకులు కొనసాగుతున్నప్పటికీ, బీసీలను రక్షి ంచడానికి రాష్ట్ర స్థాయిలో నిర్ణయాత్మక కార్యనిర్వాహక చర్య సాధ్యమని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ధైర్యంగా ప్రదర్శించిందని వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లోని స్థానిక సంస్థల ప్రస్తుత పదవీకాలం ఏప్రిల్ 2025 వరకు పొడిగించారని, రాష్ట్ర ఎన్నికల సంఘం ద్వారా, ప్రభుత్వం షెడ్యూల్‌ను ముందుకు తీసుకెళ్లడానికి సన్నాహాలు చేస్తోందన్నారు. 2026 జనవరిలో ఎన్నికలు నిర్వహించాలని, స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ముందు, పెండింగ్‌లో ఉన్న అన్ని అడ్డంకులను మొదటి కుల జనాభా గణన ద్వారా పరిష్కరించాలని, దామాషా ప్రకారం బీసీ రిజర్వేషన్లను అమలు చేయాలని కోరగా, ఆయా అంశాలపై గవర్నరు సానుకూలంగా స్పందించినట్లు రాష్ట్ర కుల గణన కమిషన్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని కోరామన్నారు.

# కామన్వెల్త్ పార్లమెంటరీ 68వ సదస్సులో స్పీకర్ అయ్యన్నపాత్రుడు



లండన్‌లోని ఇండియా హౌస్‌లో స్పీకరు అయ్యన్నపాత్రుడు,ఇతర ప్రముఖులు

**విజయవాడ, అక్టోబర్ 7,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు బార్బడోస్‌లో జరగనున్న 68వ కామన్వెల్త్ పార్లమెంటరీ సదస్సు (సిపిసి)లో పాల్గొంటారు. మంగళవారం నుండి ఈ నెల 10వ తేదీ వరకు ఈ సదస్సు జరగనుంది. ఈ సదస్సులో పాల్గొనేందుకు ఆయన మంగళవారం లండన్ నుండి బార్బడోస్‌లోని బ్రిడ్జ్‌టౌన్‌కు బయలుదేరి వెళ్లారు. కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ (సిపిఏ) ఆంధ్రప్రదేశ్ శాఖ తరఫున ఆయన ప్రతినిధిగా హాజరవుతున్నారు. స్పీకంతో పాటు శాసనసభ సెక్రటరీ జనరల్ ప్రసన్న కుమార్ సూర్యదేవర కూడా ఉన్నారు. కామన్వెల్త్ దేశాలలోని శాసనసభల సభాధ్యక్షులు తమ అనుభవాలను పంచుకోవడానికి, ఆలోచనలను మార్పిడి చేసుకోవడానికి మరియు ఆధునిక శాసనసభలు ఎదుర్కొంటున్న కీలక సమస్యలను చర్చించడానికి ఈ సదస్సు ఒక ప్రపంచ వేదికను అందిస్తుంది. 68వ సిపిసి సదస్సుకు బార్బడోస్ పార్లమెంట్ మరియు సిపిఏ బార్బడోస్ శాఖ ఆతిథ్యం ఇస్తున్నాయి. కామన్వెల్త్ పార్లమెంటేరియన్ల అతిపెద్ద సమావేశంగా సిపిసికి పేరుంది. ఈ సదస్సుకు కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ (సిపిఏ) సభ్య దేశాల నుండి స్పీకర్లు, సభాధ్యక్షులు, పార్లమెంట్ సభ్యులు మరియు పార్లమెంటరీ సిబ్బంది హాజరవుతారు. జాతీయ, రాష్ట్ర, ప్రాంతీయ మరియు ప్రాదేశిక శాసనసభలను ఒకే వేదికపైకి తీసుకువచ్చే ఏకైక పార్లమెంటరీ సంఘం సిపిఏ. సిపిఏ సభ్యత్వంలో దాదాపు 180 పార్లమెంట్లు మరియు శాసనసభలు ఉన్నాయి. భారత బృందానికి లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా నాయకత్వం వహిస్తారు.ఈ పర్యటన సందర్భంగా స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ, "ఆంధ్రప్రదేశ్ శాసనసభ తరఫున 68వ కామన్వెల్త్ పార్లమెంటరీ సదస్సు,సిపిఏ జనరల్ అసెంబ్లీకి ప్రాతినిధ్యం వహించడం మాకు చాలా సంతోషంగా ఉంది. సిపిఏ వార్షిక సదస్సు కామన్వెల్త్ పార్లమెంట్‌లలోని సహచరులతో ఉత్తమ పద్ధతులను పంచుకోవడానికి, నేర్చుకోవడానికి సభ్యులకు అద్భుతమైన అవకాశం కల్పిస్తుంది. ఈ అనుభవం ఆంధ్రప్రదేశ్ శాసనసభ పనితీరును మరింత మెరుగుపరచడంలో సహాయపడుతుందని నేను ఆశిస్తున్నాను," అని అన్నారు. ది కామన్వెల్త్: ఎ గ్లోబల్ పార్టనర్ అనే ప్రధాన ఇతివృత్తంతో 68వ సిపిసి సదస్సు జరగనుంది. ప్రజాస్వామ్యానికి మద్దతుగా పార్లమెంట్‌లను బలోపేతం చేయడం,పార్లమెంట్‌లను మార్చేందుకు సాంకేతికత మరియు కృత్రిమ మేధ (ఎఐ)ను ఉపయోగించడం, ప్రపంచ ఆరోగ్యంపై వాతావరణ మార్పుల ప్రభావాన్ని పరిశీలించడం,శాసనసభలపై విశ్వాసం పెంచడంఖి వంటి అనేక అంశాలపై ఈ సదస్సులో చర్చిస్తారు. ఆంధ్రప్రదేశ్ శాఖ ప్రతినిధిగా అయ్యన్నపాత్రుడు ప్రజాస్వామ్యానికి మద్దతుగా మన సంస్థలను బలోపేతం చేయడం.పజాస్వామ్యంలో విశ్వాసం మరియు పారదర్శకతను పెంచడం: పార్లమెంట్‌లు, ఎన్నికలలో ఆర్థిక పారదర్శకత.,జాతీయ పార్లమెంట్‌లు వర్సెస్ ప్రాంతీయ, ప్రాదేశిక బదిలీ చేయబడిన శాసనసభలు: అధికారాల విభజనను రక్షించడం మరియు పరిరక్షించడంఖి అనే అంశాలపై జరిగే వర్క్‌షాప్‌లలో పాల్గొంటారు. ఇక రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్‌తో లండన్‌లో అయ్యన్నపాత్రుడు భేటీ అయ్యారు. 68వ కామన్వెల్త్ పార్లమెంటరీ సదస్సులో పాల్గొనేందుకు బార్బడోస్‌లోని బ్రిడ్జ్‌టౌన్‌కు వెళ్తున్న భారత ప్రతినిధుల గౌరవార్థం యూకేలోని భారత హైకమిషనర్ లండన్‌లోని ఇండియా హౌస్‌లో విందు ఏర్పాటు చేశారు. ఈ విందులో స్పీకర్ అయ్యన్నపాత్రుడు రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ పాల్గొన్నారు.

## జిల్లాల పర్యటనకు పవన్‌కళ్యాణ్

### - షెడ్యూల్ సిద్ధం చేస్తున్న ఉప ముఖ్యమంత్రి కార్యాలయం

**విజయవాడ,అక్టోబరు 7,ప్రభాతవార్తప్రతినిధి:** ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఈ నెలలో జిల్లాల పర్యటనకు సిద్ధమవుతున్నారు. ఇందుకు సంబంధించిన షెడ్యూలును ఉప ముఖ్యమంత్రి కార్యాలయం సిద్ధం చేస్తోంది. తొలుత పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం వెళ్తారు. అక్కడ గురుకుల పాఠశాలలో విద్యార్థినులు అస్వస్థతకు గురైన నేపథ్యంలో ఆ పాఠశాలను పరిశీలిస్తారు. అనంతరం పిఠాపురం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. కోనసీమ జిల్లా రాజోలులో పంచాయితీరాజ్ శాఖ కార్యక్రమాల్లో పాల్గొంటారు. ప్రకాశం,పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా లోనూ పర్యటిస్తారు. ప్రభుత్వ కార్యక్రమాల అనంతరం ఆ ప్రాంత ప్రజలతో పవన్ కళ్యాణ్ సమావేశమవుతారు.

## జంగారెడ్డిగూడెంలో కల్తీ మద్యం తాగి ప్రజలు చనిపోతే మాజీ మంత్రి జోగి రమేష్ అన్న మాటలు మరిచిపోలేదు : మంత్రి నారా లోకేష్

**విజయవాడ,అక్టోబరు 7,ప్రభాతవార్త ప్రతినిధి:** వైసీపీ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు జంగారెడ్డిగూడెంలో కల్తీ మద్యం తాగి ప్రజల చనిపోతే మాజీ మంత్రి జోగి రమేష్ అన్న మాటలు మాజీ సీఎం జగన్ గుర్తు తెచ్చుకోవాలని మంత్రి నారా లోకేష్ వ్యాఖ్యానించారు.కల్తీ మద్యం తాగి జగన్ పాలనలో ఎంతమంది చనిపోయారో జనానికి తెలుసునన్నారు.జంగారెడ్డిగూడెం ఘటనప్పుడు పోతే పోయారు...ఇంకా ఏడుస్తారేంటి?' అని అప్పట్లో మంత్రిగా ఉన్న జోగి రమేష్ అహంకారంతో చేసిన వ్యాఖ్యలు ఇప్పటికీ ప్రజలకు గుర్తున్నాయని ఆరోపించారు.కల్తీ మద్యం మరణాల్ని సహజ మరణాలని చెప్పి నిందితుల్ని కాపాడే ప్రయత్నం చేశారని మాజీ ముఖ్యమంత్రి జగన్‌పై ధ్వజమెత్తారు. ఇప్పుడు కల్తీ మద్యం నిందితుల్లో టిడిపి నేతలున్నా తమ ప్రభుత్వం అరెస్ట్ చేయించిందని ఎక్స్ సామాజిక మాధ్యమంలోని తన ఖాతాలో మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. 'కల్తీ మద్యం పట్టుకుంది మా ప్రభుత్వం.నిందితుల్లో ఇద్దరు మా పార్టీ వారుంటే వెంటనే వారిని పార్టీ నుంచి సస్పెండ్ చేశారు మా అధ్యక్షుడు. మీ ఐదేళ్ళ పాలనలో ఏం చేశారో మరిచిపోయి ఆరోపణలు చేయొద్దు.డబ్బు కక్కుర్తితో జే బ్రాండ్‌తో వేల ప్రాణాలు తీశారు'అని జగన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. దళితుడైన డ్రైవర్ సుబ్రహ్మణ్యాన్ని చంపి శవాన్ని డోర్ డెలివరీ చేసిన వైకాపా ఎంఎల్‌సీ అనంతబాబుని పార్టీ నుంచి ఎందుకు సస్పెండ్ చేయలేదని జగన్‌ను ప్రశ్నించారు. 'సరికదా...ఇంటికి పిలిపించుకొని భోజనం పెట్టి సన్మానించారు. కల్తీ మద్యం గురించి, నిందితులకు వత్తాసు పలకడం గురించి మాట్లాడే అర్హత మీకు ఎక్కడుందని ప్రశ్నించారు.

## ఉద్యోగులకు మీరిచ్చిన హామీలేమయ్యాయి?



**విజయవాడ, అక్టోబరు 7,ప్రభాత వార్తప్రతి నిధి:** ఎన్నికల ముందు ఉద్యోగులకు మీరిచ్చిన హామీల్లో ఇప్పుడు ఒక్కటైనా అమలు చేశారా అని సిఎం చంద్రబాబును మాజీ సిఎం జగన్ సోమవారం ఎక్స్‌లో ప్రశ్నించారు. బకాయిలపై మంత్రివర్గ సమావేశం జరిగినప్పు డల్లా ఏమైనా ప్రకటన వస్తుందేమోనని ఉద్యోగులు వేచి చూస్తున్నారు. మీరు మాత్రం ప్రతిసారీ ఉసూరుమ నిపిస్తున్నారు. అధికారం లోకి రాగానే ఐఆర్ ఇస్తామన్నారు. ఇచ్చారా?మెరుగైన పీఆర్సీ ఇప్పటికీ ఇవ్వలేదు. మీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి మొత్తం 4 డిఏలు పెండింగ్ పెట్టారు. ఉద్యోగస్థులకు ఇవ్వాల్సిన జీపీఎఫ్,ఏపీజీఎల్ఐ మెడికల్ రీయింబర్స్ మెంట్, పదవీ విరమణ ప్రయోజ నాలు, సరెండర్/ఎన్‌క్యాష్‌మెంట్ సెలవులు ఇలాంట వన్నీ కలిపి సుమారు రూ.31వేల కోట్ల బకాయిలు పెట్టారు. ఒకటో తేదీనే జీతాలన్నారు. ఎక్కడిస్తున్నారు? ఒప్పంద, పొరుగుసేవల ఉద్యోగులకు వర్తింప చేస్తామన్న ప్రభుత్వ పథకాలని వారికిస్తున్నారా? సీపీఎస్/జీపీఎస్‌లను పునఃసమీక్షించి ఆమోద యోగ్యమైన పరిష్కారం చేస్తామన్నారు. దానిపై ఒక్కసారైనా సమీక్షించారా?'అని జగన్ ప్రశ్నించారు.

## టిడిపి కేంద్ర కార్యాలయంలో వాల్మీకి మహర్షి జయంతి



**గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి, అక్టోబర్ 7:** టీడీపీ కేంద్ర కార్యాలయంలో నేడు వాల్మీకి మహర్షి జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు టీడీ జనార్ధన్, కడప జిల్లా టీడీపీ అధ్యక్షులు రెడ్డప్పగారి శ్రీనివాసరెడ్డి, మాజీ మంత్రి, ఏపీ ఉమెన్స్ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ పీతల సుజాత, ఏపీ స్టేట్ బిల్డింగ్, అధర్ కన్స్‌స్ట్రక్షన్ వర్కర్స్ అడ్వైజరీ కమిటీ చైర్మన్ గొట్టిముక్కల రఘురామరాజు, శ్రీశైలం ఆలయ బోర్డు మెంబర్ ఏవీ రమణ, నేతలు పర్చూరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నేతలు వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడారు.

## తెలంగాణ సెక్రటేరియట్‌లో లీకేజీలు.. నిలిచిపోయిన ఇంటర్నెట్ సేవలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,అక్టోబరు7:** సెక్రటేరి యట్‌లో మరోసారి డొల్లతనం బయటపడింది. దాదాపు రూ.1200 కోట్లతో నిర్మించిన సచివాలయ బిల్డింగ్ పెచ్చులు ఊడడం, స్లాబ్ నుంచి లీకేజ్ కావడం వంటి ఘటనలు తరచూ జరుగుతున్నాయి. మంగళవారం 4వ అంతస్తులో మంత్రి కొండా సురేఖ పేషీలోకి వర్షపు నీరు చేరింది.పైపుల్లో వర్షం నీళ్ల నిలవడంతో ఇంటర్నెట్‌కు అంతరాయంఏర్పడింది. విద్యుత్ వైర్లు,ప్రింటర్లు, కంప్యూటర్లు వర్షంనీటిలోనే ఉన్నాయి. దీంతో సెక్రటేరియట్ లోని పలు శాఖల్లో ఇంటర్నెట్ సేవలు నిలిచిపోయాయి. ఇంటర్నెట్ ఆగిపోవడంతో ఫైళ్ల అప్లోడ్‌కి ఇబ్బందులు ఎదురవుతున్నాయి.దీంతో ఇంటర్నెట్ పునరుద్ధరణకు సిబ్బంది చర్యలు చేపట్టింది. 2025 ఫిబ్రవరి 12న కూడా సెక్రటేరియట్‌లో పెచ్చులూడి పడ్డాయి. ఆరో ఫ్లోర్(సిఎం చాంబర్ ఉండే అంతస్తు) పై నుంచి పీఓపీ పెచ్చులు కూలి రామగుండం మార్కెట్ కమిటీ చైర్మన్ వెహికల్‌పై పడ్డాయి. దీంతో వాహనం పైభాగం దెబ్బతింది. అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

# అప్పుల బాధతో ముగ్గురు రైతుల బలవన్మరణం

**హైదరాబాద్, అక్టోబరు 7, ప్రభాతవార్త:** చేసిన అప్పులు తీర్చలేక, ఆర్థిక ఇబ్బందులతో రాష్ట్రంలోని వేర్వేరు జిల్లాలకు చెందిన ముగ్గురు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. రాష్ట్రంలోని సిరిసిల్లా, హనుమకొండ, మహబూబాబాద్ జిల్లాల్లో ఈ సంఘటనలు చోటుచేసుకున్నాయి. స్థానికుల కథనం ప్రకారం సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ మండలం అచ్చన్నపే టకు చెందిన మొగిలి లక్ష్మణ్ (45) వేములవాడలోని రాజీవ్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. అద్దె వాహనాలతో జీవనోపాధి పొందుతూనే గ్రామం లో ఉన్న ఎకరంలో వ్యవసాయం చేస్తున్నాడు. రెండు బోర్లు వేసినా నీళ్ల పడకపోవడం, అద్దె వాహనాలు సరిగ్గా నడవకపోవడంతో అప్పులు పెరిగాయి. వీటిని తీర్చే స్థోమత లేక గత్యంతరం లేని పరిస్థితుల్లో సోమవారం పొలం వద్దకు వెళ్లిన లక్ష్మణ్ పురుగులమందు తాగి బలన్మరణానికి పాలపడ్డారు. అలాగే మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం నారాయణపురం శివారు పీక్లా తండాకు చెందిన గుగులోత్ భాస్కర్ (40) శివారులో 3 ఎకరాలలో వ్యవసాయం చేస్తున్నారు. అయితే సాగు కలిసిరాకపోగా, చేసిన అప్పులు పెరిగిపోయి, కుటుంబ ఖర్చులు ఎక్కువై ఆర్థికంగా ఇబ్బందిపడుతున్నారు. ఈ క్రమంలో తన భూమికి పట్టా పాస్‌పుస్తకం లేకపోవడంతో దాన్ని అమ్ముకునే అవకాశం కూడా లేకుండాపోయింది. దీంతో అప్పులు తీర్చేమార్గం లేక ఇంటి ఆవరణలో ఉన్న పశువుల పాకలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. అలాగే హనుమకొండ జిల్లా శాయంపేట మండలానికి చెందిన నాలికె అనిల్ (29)కు సొంతంగా ఎకరం భూమి ఉండగా, మరో నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకొని మూడేళ్లుగా సాగు చేస్తున్నారు. వ్యవసాయ పెట్టుబడి నిమిత్తం సుమారు రూ.2 లక్షల వరకు అప్పు చేశారు. అయితే ఈ యేడు వేసిన పత్తి పంట వరుసగా కురిసిన వర్షాలతో దెబ్బతిన్నది. ఈ క్రమంలో పంట పెట్టుబడికి చేసిన అప్పు తీర్చే మార్గం కానరాక, తీవ్ర మనస్తాపానికి గురై ఇంట్లో గడ్డిమందు తాగి ప్రాణాలు తీసుకున్నారు.

## వర్షాలతో దెబ్బతిన్న సోయాబీన్

**హైదరాబాద్, అక్టోబరు 7, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఇటీవల, ప్రస్తుతం కొన్ని జిల్లాల్లో కురుస్తున్న వర్షాలతో సోయాబీన్ పంట దెబ్బతినడంతో రైతాంగం ఆందోళన చెందుతోంది. రాష్ట్రంలోని నిర్మల్, ఆదిలాబాద్ తదితర జిల్లాల్లో సోయాబీన్ తోటలు పుష్పించే మరియు కోత దశలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు పంటను దెబ్బతీయడంతో రైతులు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు. వ్యవసాయ శాఖ అధికారుల అంచనాల ప్రకారం, నిర్మల్ జిల్లాలో 1.05 లక్షల ఎకరాల్లో, ఆదిలాబాద్ జిల్లాలో 50 వేల ఎకరాల్లో సోయాబీన్ సాగు చేశారు. నిర్మల్ జిల్లాలో దాదాపు 72 వేలమంది రైతులు సోయాబీన్ పంటను పండించగా, ఆదిలాబాద్ జిలాలో 40 వేల మంది ఈ పంటను సాగు చేన్నారు. అయితే వర్షాలతో సోయాబీన్ దెబ్బతిని ఎకరానికి దిగుబడి 5 నుండి 3 క్వింటాళ్లకు పడిపోయి రైతులు నష్టం పోయారు. వర్షాల వల్ల జరిగిన నష్టం కారణంగా దిగుబడి బాగా తగ్గిందని రైతులు తెలిపారు. చాలా మంది ఎకరానికి రూ.20 వేల కంటే ఎక్కువ పెట్టుబడి పెట్టారని, కానీ వారి రాబడి ఎకరానికి రూ.15 వేలకు పడిపోయిందని వాపోయారు. దీనికి తగినట్లుగా సాగు పెట్టుబడులు రాబడిని మించిపోయాయి. సోయాబీన్‌కు కనీస మద్దతు ధరగా కేంద్ర ప్రభుత్వం క్వింటాలుకు రూ.5,328గా నిర్ణయించగా, గత కొన్ని రోజులుగా పంట కోతలు కొనసాగుతున్నాయి.

## అత్యున్నత న్యాయస్థానంపై దాడి అంటే దేశంపైనే దాడి

### బార్ కౌన్సిల్ సభ్యుడు సుంకర రాజేంద్రప్రసాద్



**విజయవాడ, అక్టోబరు 7,ప్రభాతవార్త** అత్యున్నత న్యాయస్థానంపై దాడి అంటే దేశం పైనే దాడి అని రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు సుంకర రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. సుప్రీం కోర్టులో దేశ ప్రధాన న్యాయమూర్తి అయిన జస్టిస్ బిఆర్ గవాయ్‌పై అనాగరిక దాడిని ఖండిస్తూ ది కృష్ణాజిల్లా బార్ ఫెడరేషన్ పిలుపు మేరకు విజయవాడలో న్యాయవాదులు కోర్టుల విధులను బహిష్కరించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు నిరసనను ప్రదర్శిస్తూ కోర్టు నుండి బీసెంట్ రోడ్డు మీదుగా అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీని కొనసాగించి అక్కడ సేవ్ జ్యుడీషియరీ సేవ్ నేషన్ అన్న నినాదాలు చేస్తూ ధర్నాను నిర్వహించారు. ఈ సందర్భంగా బార్ కౌన్సిల్ సభ్యులు సుంకర రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ న్యాయస్థానం లోనే ఇలా జరిగితే ఇక సామాన్య న్యాయమూర్తికి,న్యాయవాదులకు రక్షణ ఎక్కడుందని ప్రశ్నించారు. ఇటువంటి హీనమైన చర్యలు ఇక ముందు జరుగకుండా ప్రభుత్వమే తగు చర్యలు తీసుకోవాలన్నారు. బెజవాడ బార్ అధ్యక్షులు ఎకె భాషా మాట్లాడుతూ ఛీఫ్ జస్టిస్ గవాయ్‌పై జరిగిన దాడిని ఖండించారు. ఇది వ్యక్తిగత దాడి కాదని,న్యాయస్థానాల మీద దాడి అంటే భారత రాజ్యాంగం పైనే దాడన్నారు. ఇటువంటి హీనమైన చర్యలు ఇక ముందు జరుగకుండా ప్రధాని మోడీ సత్వరమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో మహిళా న్యాయవాదులతో పాటు బార్ కౌన్సిల్ మెంబరు చలసాని అజయ్‌కుమార్,బార్ మాజీ అధ్యక్షులు సంపర దుర్గా శ్రీనివాసరావు,మట్టా జయకర్,మహిళా న్యాయవాదులు నరహరిశెట్టి జ్యోతి,రాజా,సీనియర్ జూనియర్ న్యాయవాదులు అధిక సంఖ్లఓ పాల్గొని తమ నిరసనను వ్యక్తం చేశారు. అనంతరం ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశాకు ఈ దాడిపై తగిన చర్యలు తీసుకునే విధంగా ప్రభుత్వానికి సూచనలు చేయాలని వినతిపత్రాన్ని అందచేశారు.

## ఈక్రాప్ నమోదు గడువు 25 వరకు పొడిగింపు

**విజయవాడ,అక్టోబరు 7,ప్రభాతవార్తప్రతినిధి:** ఈ ఖరీఫ్ సీజన్ కు సంబంధించి ఈక్రాప్ నమోదు గడువును ప్రభుత్వం ఈ నెల 25వ తేదీ వరకు పొడిగించింది. సామాజిక తనిఖీ, సవరింపులు, మార్పుచేర్పులకు ఈ నెల 30వ తేదీ వరకు అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈక్రాప్ తుది జాబితాను ఈ నెల 31న రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శించనున్నట్లు వివరించారు. గతంలో ఈక్రాప్ నమోదుకు వెళ్తే సాంకేతిక సమస్య వల్ల నమోదు చేయలేదని, ఇప్పుడు అటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, ప్రభుత్వం గడువు పెంచినందుకు తమకు మంచి జరుగుతుందని రైతులు చెబుతున్నారు. రైతులు పండించిన పంటల సేకరణ, ప్రకృతి వైపరీత్యాల సమయంలో నష్టపోయిన పంటలకు పరిహారం చెల్లింపునకు ప్రభుత్వం ఈక్రాప్ ను ప్రామాణికంగా తీసుకుంటోంది. పంటల సాగు ప్రారంభమై రెండు నెలలు దాటినా కూడా కృష్ణా జిల్లాలో ఈక్రాప్ నమోదు అనుకున్న స్థాయిలో జరగడం లేదని రైతులు చెబుతున్నారు. ఈ ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో వ్యవసాయశాఖ సహాయకుల బదిలీలు రైతులకు శాపంగా మారాయి. ప్రభుత్వం తొలుత సెప్టెంబర్ నెలాఖరుకు గడువు తేదీని నిర్దేశించింది. జిల్లాలో ఈక్రాప్ నమోదులో ఇబ్బందులు తలెత్తడం వల్ల పంట నమోదు ముందుకు సాగలేదు. ప్రారంభం నుంచి కూడా పంట నమోదు ప్రక్రియ రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. నమోదుకు రైతు సేవా కేంద్రాల చుట్టూ అన్నదాతలు ప్రదక్షణలు చేస్తున్నారు. రైతులు క్షేత్రస్థాయిలో సాగు చేసిన పంటలను పరిశీలించి వాటి వివరాలను వీఏఏలు ఈక్రాప్ నమోదు చేయాల్సి ఉంది. ఈ సీజన్ ప్రారంభంలో ఉమ్మడి కృష్ణా జిల్లాలో 475 మంది వీఏఏలను బదిలీ చేశారు. జిల్లాలో 3,55,824 హెక్టార్లలో రైతులు ఖరీఫ్ ను సాగు చేస్తున్నారు. ఈసారి ఈకేవైసీని నోటిఫైడ్ పంటలకు మాత్రమే పరిమితం చేసినట్లు వ్యవసాయశాఖ అధికారులు పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇంకా వ్యవసాయ, ఉద్యాన, పట్టు, సామాజిక అడవులు, సాగు చేయని బీడు భూములను ఈపంటలో నమోదు చేయాల్సి ఉంది. సచివాలయ ఉద్యోగులు బదిలీ కావడం, కొత్త ప్రాంతాల్లో సిబ్బంది భూ సర్వే నంబర్లు గుర్తించలేకపోవడం, గత రెండు నెలలు అధికారులు యూరియా సరఫరాపైనే పూర్తిస్థాయిలో దృష్టి పెట్టడం, సాంకేతిక సమస్యలు వంటి కారణాలతో ఈక్రాప్ నమోదులో ఇబ్బందులు తలెత్తాయని రైతులు చెబుతున్నారు.పంట నమోదులో జాప్యం జరిగి తాము పంటను ఈ క్రాప్ చేయించుకోలేకపోతే తర్వాత ఆర్థిక ఇబ్బందులు పడాల్సి వస్తుందని గతంలో జరిగిన ఘటనలను గుర్తుకు తెచ్చుకుని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రకృతి విపత్తులు సంభవించిన సమయంలో తాము పెట్టిన పెట్టుబడి గంగలో కలిసిపోతుందన్నారు.

## అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వైసీపీని రాష్ట్రం నుంచి బాయ్‌కాట్ చేయాలి

### -టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్యే నక్కా ఆనంద్ బాబు

**గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి, అక్టోబర్ 7:** భారత రాజ్యాంగ నిర్మాత డా.బీ.ఆర్. అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసి.. శాంతి భద్రతలకు విఘాతం కల్పించి కుట్ర చేసిన వైసీపీని రాష్ట్రం నుంచి బాయికాట్ చేయాలని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబు పేర్కొన్నారు.మంగళవారం సాయంత్రం ఈమేరకు ప్రకటన చేశారు. రాష్ట్రంలో అల్లర్లు సృష్టించేందుకు తాడేపల్లి ప్యాలెస్ నుంచి వచ్చే పెద్దల డైరెక్షన్ తోనే వైసీపీ నేతలు ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారని, డా.బీ.ఆర్. అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసి ప్రభుత్వం మీద బురద జల్లడానికి ప్రయత్నించిన వైసీపీ నీచ సంస్కృతిని ప్రజా సంఘాలు, కుల సంఘాలు ముక్తకంఠంతో ఖండించాలన్నారు.

క్రూరత్వమే తప్ప మానవత్వం తెలియని నేతలు తాడేపల్లి ప్యాలెస్ లో ఉన్నారని, అంబేద్కర్ విగ్రహాన్ని నాశనం చేసి నరరూప రాక్షసుల్లా వ్యవహరిస్తున్న వైసీపీ నేతలను సభ్యసమాజం నుంచి వెలివేయాలన్నారు. రాజ్యాంగం అన్నా, ప్రజాస్వామ్యం అన్నా లెక్కే చేయని క్రూర స్వభావం ఉన్న జగన్ రెడ్డి.. రాష్ట్రంలో ఉండటానికి అర్హుడు కాదన్నారు.. చిత్తూరు జిల్లా వెదురుకుప్పంలో డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ విగ్రహంపై దాడి చేయడం దళితుల మనోభావాలపై దాడి చేయడమేనని, ఇది దళితులను అవమానించడమే అని పేర్కొన్నారు. విగ్రహ ధ్వంసం కేసులో వైసీపీ నేతలు గోవిందయ్య, ఇతరులు స్వయంగా పట్టుబడి జైలుకు వెళ్లినా జగన్ రెడ్డి మౌనంగా ఉండటం దేనికి సంకేతం అని అన్నారు. దళితులంటే జగన్ కి ఎందుకు అంత చిన్న చూపు అని ఆనంద్‌బాబు ప్రశ్నించారు. ఇలాంటి దిగజారుడు రాజకీయాలు మానుకొని హుందా రాజకీయాలు చేయాలని జగన్ రెడ్డికి హితవు పలుకుతున్నానని ఎమ్మెల్యే ఆనంద్‌బాబు పేర్కొన్నారు.

## దేశంలో అసహనం అత్యున్నత స్థాయికి

### జస్టిస్ గవాయ్‌పై దాడిని ఖండించిన కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,అక్టోబరు7:** సుప్రీంకోర్టులో విచారణ జరుగుతుండగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్‌పై ఓ న్యాయవాది దాడికి యత్నించటాన్ని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఎక్స్ వేదికగా తీవ్రంగా ఖండించారు. దేశంలో అసహనం అత్యున్నత స్థాయికి చేరుకుందని, ఇలాంటి దాడులు ప్రజాస్వామ్య మూలాలకే ముప్పు అని పేర్కొన్నారు. ఇది వ్యక్తిపై దాడి కాదు అని, వ్యవస్థపైనే దాడి అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మన దేశంలో అసహనం అత్యున్నత స్థాయికి చేరుకుందని, దీనికి సుప్రీంకోర్టులో ప్రధాన న్యాయమూర్తి గవాయిపై దాడి జరగడం ఒక దారుణమైన సంకేతం అని వ్యాఖ్యానించారు. ప్రధాన న్యాయమూర్తి బిఆర్ గవాయిపై జరిగిన దాడి యత్నాన్ని తీవ్రంగా, నిర్ద్వంద్వంగా ఖండిస్తున్నానని పేర్కొన్నారు. న్యాయవ్యవస్థ గౌరవంపై జరిగిన ఈ సిగ్గుచేటైన దాడి కేవలం ఒక వ్యక్తిపై దాడి కాదు, ఆ వ్యవస్థపైనే జరిగిన దాడి అని చెప్పారు. విశ్వాసం వంటి సున్నితమైన అంశాలపై ఎలాంటి విభేదం ఉన్నా కూడా హింసను సమర్థించదు అని, ఇటువంటి దాడులు ప్రజాస్వామ్య మూలాలకే ముప్పు కలిగిస్తుందని అన్నారు.

## తీర్పుకు లోబడే నియామకాలు స్పష్టం చేసిన హైకోర్టు

**హైదరాబాద్, అక్టోబరు 7, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని మత్స్యకారుల సహకార సంఘాలకు చీఫ్ ప్రమోటర్లు, పర్సన్ ఇన్‌చార్జీల నియామకాలు తాము ఇచ్చే తీర్పునకు లోబడే ఉంటాయని హైకోర్టు స్పష్టం చేసింది. తీర్పునకు లోబడి జీవో నెంబర్ 60 అమలు ఉంటుందన్నారు. జిల్లా మత్స్యకారుల సహకార సంఘాల చీఫ్ ప్రమోటర్లు లేదా పర్సన్ ఇన్‌చార్జీల నియామకం నేరుగా ప్రభుత్వం చేసేలా గత నెల 3వ తేదీన తెచ్చిన జీవో నెంబర్ 60 చట్ట వ్యతిరేకమంటూ హన్మకొండ జిల్లా మత్స్యకారుల సహకార సంఘాల చీఫ్ ప్రమోటర్ తదితరులు వేసిన పిటిషన్‌ను జస్టిస్ టి మాధవీదేవి విచారించారు. దీనిపై విచారించిన ధర్మాసనం ప్రతివాదులైన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పశుసంవర్థక, మత్స్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర మత్స్యకార సహకార సంఘాల సమాఖ్య లిమిటెడ్ ఎండీ సహా పలువురికి నోటీసులు జారీ చేసింది.

# లాభాల్లో రామగుండం ఎరువుల ఫ్యాక్టరీ

**హైదరాబాద్, అక్టోబరు 7, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని రామ గుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ మిటెడ్ (ఆర్ఎఫ్‌సీఎల్) 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.510 కోట్ల లాభం ఆర్జించింది. ఈ ఆర్థిక సంవత్సరానికి గాను 11.95 లక్షల టన్నుల యూరియాను ఉత్పత్తి చేసినట్లు అధికారవర్గాలు వెల్లడించాయి. ఉత్పత్తి చేసిన యూరియాను అంతే మొత్తంలో వివిధ రాష్ట్రా లకు సరఫరా చేయగా, రూ.5,300 కోట్ల టర్నోవర్ సాధించింది. ఉత్పత్తి చేసిన యూరియాలో తెలంగాణకు 4,68,954.76 టన్నులు, ఆంధ్రప్రదేశ్‌కు 1,78,363.39 టన్నులు, కర్ణాటకకు 1,91,288.07 టన్నులు, మహారాష్ట్రకు 82,986.39 టన్నులు, చత్తీస్‌ఘడ్‌కు 60,640.38 టన్నులు, తమిళనాడుకు 1,01,520.99 టన్నులు, మధ్యప్రదేశ్‌కు 1,11,167.19 టన్నుల చొప్పున సరఫరా చేసింది. అదే 2023 -24 ఆర్థక సంవత్సరంలో 11.19 లక్షల టన్నుల యూరియాను ఉత్పత్తి చేయగా. తద్వారా రూ.441 కోట్ల లాభాన్ని ఆర్జించింది. ఈ లెక్కన గతేడాదితో పోల్చితే 76 వేల మెట్రిక్ టన్నులను అధికఉత్పత్తిచేసి, రూ.69కోట్ల లాభం అదనంగా పొందగలిగింది.



మంగళవారంప్రజాభవన్‌లో ప్రజావాణిలో చిన్నారెడ్డిని సన్మానించిన గ్రూప్-2 సభ్యులు

# ప్రజావాణికి 302 దరఖాస్తులు

## స్వీకరించిన చిన్నారెడ్డి, దివ్య

**హైదరాబాద్ (బేగంపేట), అక్టోబరు 7,ప్రభాతవార్త:** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన సీఎం ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 302దరఖాస్తులు అందాయి. వీటిలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 87దరఖాస్తులు, రెవెన్యూ శాఖకు సంబంధించి 42దరఖాస్తులు, ఇందిరమ్మ ఇండ్ల కోసం 102దరఖాస్తులు, ప్రవాసీ ప్రజావాణికి 3 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 68దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలియజేసారు.సీఎం ప్రజావాణి ఇంచార్జి,రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డా.జి.చిన్నారెడ్డి, స్టేట్ నోడల్‌అధికారి దివ్య దేవరాజన్ దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు వినిసంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు.

**చిన్నారెడ్డిని సన్మానించిన గ్రూప్ 2 సభ్యులు**

రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన గ్రూప్ -2పరీక్షలో ఎంపికైన అభ్యర్థులు చిన్నారెడ్డిని మంగళవారం ప్రజాభవన్‌లో శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.గ్రూప్ 2 ఫలితాలు ఆలస్యమవుతున్న నేపథ్యంలో పలు మార్లు అభ్యర్థులు ప్రజాభవన్‌లో జరిగే సీఎం ప్రజావాణికి వచ్చి చిన్నారెడ్డిని కలవగా పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ సెక్రటరీలతోఫోన్ ద్వారా మాట్లాడి ధైర్యం నింపిన చిన్నారెడ్డిని కలిసి వారు ధన్యవాదాలు తెలిపి పోస్టింగ్స్ కూడా త్వరగా ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని అభ్యర్థులు ఆయనను కోరారు.

# 12 వరకు ఆర్‌టిఐ అవగాహన వారం

## విసిలతో ఉన్నత విద్యామండలి ఛైర్మన్ బాలకిష్టారెడ్డి వీడియో కాన్ఫరెన్స్

**హైదరాబాద్, ప్రభాతవార్త, అక్టోబరు7:** పాలనలో పారదర్శకత, జవాబుదారీతనంపై సమచార హక్కు చట్టం(ఆర్‌టిఐ) కీలకంగా మారిందని తెలంగాణ ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి అన్నారు. సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పిం చడంలో భాగంగా ఈ నెల 5నుంచి 12 వరకు ఆర్‌టిఐ వీక్-2025ను నిర్వహించనున్నట్టు తెలిపారు. అందులో భాగంగా మంగళవారం ఆయన యూనివర్సిటీ విసిలు, రిజిస్ట్రార్లతో వీడియో కాన్ఫరెన్స్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి వైస్ ఛైర్మన్-1 ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తం, కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలకిష్టారెడ్డి మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం, 2005 ప్రజా స్వామ్య పరంపర, పారదర్శకత, జవాబు దారీతనం కోసం కీలకమైన చట్టమని తెలిపారు. భారతదేశంలో ఆర్‌టిఐ చట్ట చరిత్ర, రాజ్యాంగ పరిరక్షణలు (ఆర్టికల్ 19(1) (ఎ) అండ్ 21) ప్రధానమైన సుప్రీంకోర్టు తీర్పులను వివరించారు. ఆర్‌టిఐచట్టం అంతర్జాతీయ మానవహక్కుల ప్రమాణాలను భారత రాజ్యాంగ హామీలతోకలిపి పనిచేస్తుందన్నారు. ఆర్‌టిఐ చట్టంలోని సెక్షన్4 (పబ్లిక్ అథారిటీల బాధ్యతలు), సెక్షన్ 8(మినహాయింపులు) పై విశేషంగా దృష్టిపెట్టారు. ఏ సమాచారం వెల్లడించవచ్చునో, ఏదికాదు అనే దిశానిర్దేశాలను విసి, రిజిస్ట్రార్లకు వివరించారు. విశ్వవిద్యాలయాలకు ఆర్‌టిఐ క్వెరీస్ నిర్వహణ కోసం సాధారణ బుక్లెట్, హ్యాండ్‌బుక్ తయారీలో భాగస్వామ్యం చేయాలని కోరారు. కార్యక్రమం ముగింపులో ఉన్నత విద్యా మండలి కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేష్, పాల్గొన్న వారికి కృతజ్ఞతలు తెలిపారు. అన్ని విశ్వవిద్యాలయాలు ఆర్‌టిఐ వారం (5నుంచి 12 అక్టోబర్) అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, ఫోటోలు, నివేదికలను ఈనెల 15 నాటికి తెలంగాణ ఇన్ఫర్మేషన్ కమిషన్, తెలంగాణ ఉన్నత విద్యా మండలికి సమర్పించాలని సూచించారు.

## పిజిఇ సెట్ ఫైనల్ ఫేజ్ కౌన్సెలింగ్‌లో

# 2926 మందికి సీట్ల కేటాయింపు

## 9లోగా కాలేజీల్లో చేరాలి: అడ్మిషన్ల కన్వీనర్ పాండురంగా రెడ్డి

**హైదరాబాద్, ప్రభాతవార్త, అక్టోబరు 7:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో ఎంఈ, ఎంటెక్ ఇంజనీరింగ్ పీజీ కోర్సుల్లో చేరడం కోసం నిర్వహించిన పిజిఈసెట్-2025 కౌన్సెలింగ్‌లో భాగంగా ఫైనల్ ఫేజ్ సీట్ల కేటాయింపు మంగళవారం చేశారు. ఫైనల్ ఫేజ్‌లో 3345 సీట్లు అందుబాటులో ఉండగా వాటిలో 2926 మందికి సీట్లకేటాయింపు చేశారు. ఫైనల్ ఫేజ్‌లో 5370 మంది వెబ్ ఆప్షన్లు ఇవ్వగా వారిలో 2926 మందికి సీట్ల కేటాయింపు చేసినట్టు అడ్మిషన్ల కన్వీనర్ ప్రొఫెసర్ ఐ పాండురంగారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీట్లు పొందిన విద్యార్థులు ఈనెల 9లోగా ఆయా కాలేజీల్లో చేరాల్సి ఉంటుందని సూచించారు. మొదటి విడతలో 5529 సీట్లు అందుబాటులో ఉండగా వాటి కోసం 7471 మంది వెబ్ ఆప్షన్లను ఇచ్చారు.అందులో 4320 మందికి సీట్ల కేటాయింపు చేయగా వారిలో 2521 మంది కాలేజీల్లో చేరినట్టు తెలిపారు. ఫైనల్ ఫేజ్‌లో 3345 సీట్లకిగానూ 2926 సీట్లను కేటాయించారు.

# కులధ్రువీకరణ పత్రాలు మళ్లీ సమర్పించండి

**హైదరాబాద్, అక్టోబరు 7, ప్రభాతవార్త:** రాష్ట్ర ఆర్టీసిలో డ్రైవర్లు, శ్రామిక్ పోస్టులకు దరఖాస్తు చేసిన ఎస్‌సి అభ్యర్థులు తమ కుల ధృవీకరణ పత్రాలను తాజా జిఓ అనుసారం నూతన ఫార్మట్‌లో సంబంధిత తహసీల్‌దార్ కార్యాలయాల నుంచి తీసుకుని, వాటిని సమర్పించాలని పోలీసు నియామక మండలి కోరింది. ఈ మేరకు పోలీసు నియామక మండలి ఛైర్మన్ శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌సి అభ్యర్థులకు కుల ధృవీకరణ పత్రాలను నూతన ఫార్మట్‌లో ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు.




పోటీలను ప్రారంభిస్తున్న అదనపు జిఎం సత్యప్రకాష్ తదితరులు

# ఆల్ ఇండియా రైల్వే కబడ్డీ ఛాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభం

**తార్నాక, అక్టోబరు 7 ప్రభాతవార్త :** రైల్వే స్పోర్ట్స్ ప్రమోషన్ బోర్డ్ (ఆర్.ఎస్.పి.బి) ఆధ్వర్యంలో మంగళవారం దక్షిణ మధ్య రైల్వే స్పోర్ట్స్ అసోసియేషన్ 47వఆల్ ఇండియా రైల్వే కబడ్డీ (మహిళలు) ఛాంపియన్ షిప్ పోటీలను ఈ నెల 7నుండి 10 అక్టోబర్ వరకు నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమాన్ని దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ సత్యప్రకాష్ మంగళవారం సికింద్రాబాద్‌లోని రైల్వే స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో దక్షిణ మధ్య రైల్వే స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు ప్రిన్సిపల్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్ అరోమా సింగ్ ఠాకూర్, దక్షిణ మధ్య రైల్వే స్పోర్ట్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఫైనాన్షియల్ అడ్వైజర్ మరియు చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్,స్టోర్స్ వర్క్‌షాప్ పి.కోటేశ్వరరావు ఇతర సీనియర్ రైల్వే అధికారులు మరియు క్రీడా సిబ్బంది సమక్షంలో ప్రారంభించారు. ఈ సంవత్సరం సౌత్ ఈస్టర్న్ రైల్వే, ఈస్టర్న్ రైల్వే, వెస్టర్న్ రైల్వే, సెంట్రల్ రైల్వే, ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ, నార్త్ ఈస్టర్న్ రైల్వే, ఈస్ట్‌కోస్ట్ రైల్వే మరియు ఆతిథ్య వహిస్తున్న సౌత్ సెంట్రల్ రైల్వేలకు సంబంధించిన మొత్తం తొమ్మిదిజట్లు ఈ పోటీలో పాల్గొంటున్నాయి. ఈ టోర్నమెంట్‌లో అంతర్జాతీయ, జాతీయ స్థాయి ఆటగాళ్ళు పాల్గొంటారు. తొలి నాకౌట్ ప్రారంభ మ్యాచ్ దక్షిణ మధ్య రైల్వే,నార్త్ ఈస్టర్న్ రైల్వే మధ్య జరిగింది. ఈ మ్యాచ్‌లో దక్షిణ మధ్యరైల్వే 48పాయింట్లు సాధించి విజేతగా నిలువగా, నార్త్ ఈస్టర్న్‌రైల్వే 25 పాయింట్లు సాధించింది. ఈ సందర్భంగా సత్య ప్రకాష్ మాట్లాడుతూ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనే జట్లకు ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు. ఉత్తమ ఫలితాలను సాధించడానికి నిజమైన క్రీడా స్ఫూర్తి, నిబద్ధత మరియు కృషిని ప్రదర్శించాలని ఆయన పాల్గొనే వారిని ప్రోత్సహించారు.

# గోల్ఫ్ టోర్నీలో కోరుకొండ విజయఢంకా

**హైదరాబాద్,అక్టోబరు 7, ప్రభాతవార్త :** అత్యంత ఆసక్తిగా ఎదురుచూసిన ఆర్మీ ఇంజినీరింగ్ సైనిక్ స్కూల్స్ అలుమ్ని గోల్ఫ్ టోర్నమెంట్ 2025హైదరాబాద్‌లోని బౌల్డర్ హిల్స్ గోల్ఫ్ అండ్ కంట్రీ క్లబ్ లోని బ్యాంక్వెట్ హాల్‌లో ఘనంగా ముగిసింది.గాలా డిన్నర్, అవార్డుల ప్రదానోత్సవంతో ఆ సాయంత్రం సైనిక,సివిల్ అధికారులు, పరిశ్రమ నాయకులు, వ్యాపారవేత్తలు, గోల్ఫ్ అభిమానులతో కళకళలాడింది. 2 రోజుల ఉత్కంఠభరితమైన పోటీల అనంతరం, సైనిక్ స్కూల్ కొరుకొండ చాంపియన్‌గా నిలిచింది. సైనిక్ స్కూల్ చిత్తోర్గఢ్ రన్నరప్ స్థానం సాధించింది.



# అడ్డదారులు తొక్కిన అధికారులు

## ఎసిబి చిక్కిన డ్రగ్ కంట్రోల్ అధికారులు

**కరీంనగర్ క్రైమ్, ప్రభాతవార్త:** ప్రజలకు నమ్మకం కలిగించేందుకు నిరంతరం ఫార్మసీలను తనిఖీలు చేసి నాణ్యమైన మందులను, సేవలందిస్తున్నారని నిర్ధారించాల్సిన అధికారులు అడ్డదారులు తొక్కారు. ఓ ప్రైవేట్ ఆస్పత్రి ఫార్మసీని తనిఖీచేసి సర్టిఫికెట్ ఇచ్చేందుకు డబ్బులు డిమాండ్‌చేసి ఏసీబీకి రెడ్ హ్యాండెడ్‌గా మంగళవారం జిల్లా కేంద్రంలో పట్టుబడ్డారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. ప్రతి జిల్లా కేంద్రానికి డ్రగ్ కంట్రోల్ విభాగం ఉంటుంది.ఫార్మసీలను, అనుమతులు లేకుండా మార్కెట్లో లభ్యమయ్యే మందులను తనిఖీలు చేసి వాటి వినియోగంపై పూర్తిస్థాయి సమాచారాన్నివ్వాల్సిన పని డ్రగ్ కంట్రోల్ విభాగం విధి. ప్రతి ఏటా ప్రైవేట్ ఆస్పత్రుల ఫార్మసీ దుకాణాలను తనిఖీలు చేసి సర్టిఫికెట్ ఇవ్వాల్సి ఉంటుంది.అదేవిధంగా ఫార్మసీస్ట్ లైసెన్సులు పునరుద్దరించడం వాటి విధుల్లో భాగం..అయితే దీనికోసం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో గల ఫార్మసీకి క్లీన్ చిట్ ఇచ్చేందుకు డ్రగ్ కంట్రోల్ విభాగం అధికారులు డబ్బులు డిమాండ్ చేశారు.అధికారుల అవినీతికి అడ్డు అదుపు లేకుండా పోవడంతో మందుల దుకాణాల నిర్వాహకులు అవినీతి నిరోధకశాఖ అధికారులను సంప్రదించారు. బాధితుల నుంచి ఫిర్యాదు అందుకున్న ఏసీబీ అధికారులు మంగళవారం రంగంలోకిదిగారు. బాధితుని నుంచి డిమాండ్ చేసిన లంచం డబ్బులు రూ.20,000 అధికారులకు చెందిన ఓ ప్రైవేట్ వ్యక్తి తీసుకుంటుండగా దాడులు నిర్వహించడంతో రెడ్‌హ్యాండెడ్‌గా ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు.డబ్బులు తీసుకున్న రాముని అదుపులోకి తీసుకొని అతనిని పురమాయించిన డ్రగ్ కంట్రోల్ అసిస్టెంట్ డైరెక్టర్ మర్యాల శ్రీనివాసులు,డ్రగ్ ఇన్స్‌పెక్టర్ కార్తిక్ భరద్వాజలను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి లంచంగా తీసుకున్న డబ్బులను రికవరీచేసి రసాయన పరీక్షలు నిర్వహించి, నిర్ధారించి అధికారులను ఎసిబి కార్యాలయానికి తరలించి విచారణ అనంతరం నిందితుల ముగ్గురిని కరీంనగర్ ప్రత్యేక ఏసీబీ కోర్టులో హాజరుపరుస్తామని ఏసీబీ డీఎస్పీ తెలిపారు.



# భీమ్ పోరాట స్ఫూర్తి ప్రపంచానికి ఆదర్శం: మంత్రి జూపల్లి

**హైదరాబాద్,అక్టోబరు 7, ప్రభాతవార్త :** జల్.. జంగిల్.. జమీన్ కోసం పోరాడిన కుమ్రం భీం పోరాట స్ఫూర్తి తెలంగాణకే కాదు యావత్ ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిందని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. కొమ్రం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం జోడేఘాట్‌లో ఆదివాసీల ఆరాధ్యదైవం కుమ్రం భీం 85వ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎస్సీ, ఎస్టీ,మైనార్టీ, దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కుమ్రం భీం విగ్రహానికి సంప్రదాయబద్ధంగా నివాళర్పించి,సమాధి వద్ద పుష్పాంజలి ఘటించి పూజలు చేసి భీం స్మృతి చిహ్నం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ ఆదివాసీల ఆశాజ్యోతి కుమ్రం భీం పోరాట స్ఫూర్తితోనే తెలంగాణ రాష్ట్ర సాధన సాధ్యమైందని, ప్రజల కోసం, తాను నమ్మిన సిద్ధాంతాల కోసం.. బానిసత్వపు సంకెళ్లు తెంచడానికి తన జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడని, స్వయంపాలన ఉద్యమానికి పితామహుడిగా నిలిచిన కుమ్రం భీం చరిత్ర భావితరాలకు ఆదర్శనీయమని ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, ఎమ్మెల్సీ దండే విఠల్, కొమ్రం భీం మనువడు సొనేరావు, ఆదివాసీ సంఘాల నేతలు, తదితరులు పాల్గొన్నారు.



# డిజిపి కార్యాలయంలో వాల్మీకి జయంతి



**హైదరాబాద్, అక్టోబరు 7, ప్రభాతవార్త:** మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు డిజిపి కార్యాలయంలో మంగళవారం ఘనంగా జరిగాయి, ఈ సందర్భంగా వాల్మీకి చిత్ర పటానికి శాంతి భద్రతల అదనపు డిజి మహేష్ భగవత్ పూల మాల వేసి శ్రద్ధాంజలి ఘటించడంతో పాటు వాల్మీకి సమాజానికి చేసిన సేవలను కొనియాడారు. మహర్షి వాల్మీకి ఆలోచనలు, ఆత్మ నిబ్బరత, సత్యం ధర్మం కోసం ఎంతో సేవలు చేశారని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏఐజి రమణ కుమార్ సహా ఇతర అధికారులు పాల్గొన్నారు.

# వాల్మీకులపై ప్రభుత్వం చిన్నచూపు

## బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు



**హైదరాబాద్,అక్టోబరు 7, ప్రభాతవార్త :** బిజెపి తెలంగాణ రాష్ట్ర ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు మహర్షి వాల్మీకి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, ఆయన స్ఫూర్తిదాయక జీవితాన్ని స్మరించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహర్షి వాల్మీకి వారసత్వానికి సంబంధించిన వర్గాన్ని రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోంది. వాస్తవానికి వాల్మీకి సమాజం వెనుకబడిన తరగతులలో భాగంగా ఉంది. అయితే వాల్మీకి సమాజాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని మండి పడ్డారు. ఇటీవల గద్వాల ప్రాంతంలో బోయ వాల్మీకి సోదరులు నన్ను కలిసి తమ సమస్యలను వివరించారని,వారికి ఎమ్మార్వో ఆఫీసుల్లో కనీసం కుల ధృవపత్రాలు కూడా ఇవ్వడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వాల్మీకి సమాజం పట్ల రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం చేస్తుందని ఇప్పటికైనా వాల్మీకి బోయల సంక్షేమం, సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. కాంగ్రెస్ నేతలు బిజెపి నేతలను విమర్శించడమే ధ్యేయంగా పెట్టుకున్నారు:బిజెపి ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్ కాంగ్రెస్ నాయకులు నిత్యం బీజేపీ నేతలను విమర్శించడమే తమ ధ్యేయంగా పెట్టుకున్నారని బిజెపి ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్ విమర్శించారు. మంగళవారం ఆయన పార్టీ కార్యాలయంలో మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ నేతృత్వంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావుపై ఇష్టానుసారంగా, అవహేళన చేస్తూ వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. ఒక రాజకీయ పార్టీలో మంత్రి పదవిని పొందిన పొన్నం ప్రభాకర్ వంటి నాయకులు దిగజారి మాట్లాడటం తగదని హితవు పలికారు. మొన్నటికి మొన్న సొంత మంత్రివర్గంలోని మాదిగ సమాజానికి చెందిన అడ్లూరు లక్ష్మణ్ కుమార్‌పై పొన్నం ప్రభాకర్ కించపరుస్తూ వ్యాఖ్యలు చేయడం సమాజం చూసిందన్నారు. భారతీయ జనతా పార్టీ మొదటి నుండి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల విషయంలో మద్దతు తెలిపిందని,బిజెపి ఎమ్మెల్యేలు సంపూర్ణ మద్దతు ప్రకటించారని గుర్తుచేశారు.



మంగళవారం మీడియాతో మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

# మంత్రి పొన్నం క్షమాపణలు చెప్పాలి

## సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్‌పై దాడిని ఖండిస్తున్నాం: మందకృష్ణ మాదిగ

**హైదరాబాద్(తార్నాక), అక్టోబరు 7 ప్రభాతవార్త :** మాదిగ సామాజిక వర్గానికి చెందిన మంత్రి అడ్లూరు లక్ష్మణ్ కుమార్‌ను అవమానించేలా వ్యాఖ్యలు చేసిన బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తక్షణమే క్షమాపణలు చెప్పాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. మంగళవారం ఉస్మానియా యూనివర్సిటీలో ఆర్ట్స్ కళాశాల ముందు నిర్వహించిన కార్యక్రమంలో మంద కృష్ణమాదిగ మాట్లాడుతూ బీసీ సామాజిక వర్గానికి చెందిన పొన్నం ప్రభాకర్ మాదిగ సామాజిక వర్గానికి చెందిన కట్లూర్ లక్ష్మణ్ ఉద్దేశించి దున్నపోతు అనేమాటను ఉపయోగించి మాట్లడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ విషయాన్ని ఇప్పటికే పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని వారు తప్పు జరిగింది వాస్తవమేనని పొన్నం చేతక్షమాపణ చెప్పించే విధంగా చూస్తామని తెలిపారని అన్నారు. పొన్నం ప్రభాకర్ క్షమాపణ చెప్పకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమ కార్యచరణను తీసుకోవలసి వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సందే కార్తిక్ మాదిగ, రాష్ట్ర అధికార ప్రతినిధి కొమ్ముశేఖర్ మాదిగ, జాతీయ ఉపాధ్యక్షులు తోకల చిరంజీవి, పల్లెర్ల సుధాకర్, బైర పోగు శివకుమార్, జన్న పాల మహేష్, ఎడవెల్లి అజయ్, ఆదిత్య, మంద అనిల్ మాదిగ, మహేంద్ర మదిగ, మామిడి ప్రశాంత్, రవికుమార్, అజయ్ కుమార్, కొమ్ము తురుపతి, మణేష్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.



మంగళవారం వివరాలు వెల్లడిస్తున్న రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

# రిజర్వేషన్లపై 30 బిసి సంఘాల కేసులు

**హైదరాబాద్,అక్టోబరు 7 ప్రభాతవార్త:** స్థానిక సంస్థలలో బిసి రిజర్వేషన్లు 42 శాతం రిజర్వేషన్ల కేసులో 30కి పైగా బీసీ సంఘాలు మంగళవారం తెలంగాణ హైకోర్టులో ఇంప్లీట్ కేసులు వేశారు. కేసులో ఇంప్లీడ్ అయిన వారిలో రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణ, కన్వీనర్ గుజ్జ కృష్ణ, ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం, తెలంగాణ బి.సి మహిళా సంఘం ప్రధాన కార్యదర్శి పగడాల కావణి, తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అల్లంపల్లి రామకోటి, బీసీ విద్యార్థి యువజనసంఘం అధ్యక్షుడు జామ్మూర్తి గౌడ్, తెలంగాణ బీసి సంఘం అధ్యక్షుడు రాజేందర్, తెలంగాణ బి.సి ఐక్యవేదిక అధ్యక్షుడు అనంతయ్య, కార్మికసంఘం నేత చెదుకు మణికంఠ, తెలంగాణ బి.సి సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేష్, గ్రేటర్ అధ్యక్షుడు బి.సాగర్, తెలంగాణ బి.సి విద్యార్థి సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ పగళ్ళ సతీష్, తెలంగాణ బి.పి యువజన సంఘం కన్వీనర్ భాస్కర్ ప్రజాపతి, నాయి బ్రాహ్మణ సంఘం నేత జగదేశ్. జాతీయ బి.సి సంక్షేమ సంఘం నేత పరదాల సుధాకర్ తదితర సంఘం ప్రతినిధులు పెద్ద ఎత్తున కేసులు వేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 243-డి6 ప్రకారం స్థానిక సంస్థలోని బీసీ రిజర్వేషన్లు పెంచే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి రాజ్యాంగ అధికారం ఇచ్చింది కావున అసెంబ్లీ చట్టం చేశారు. జీవో తీసి వెంటనే ఎన్నికలు జరపవచ్చు ఏమైనా న్యాయపరమైన సమస్యలు వస్తే సుప్రీంకోర్టుకు ఎవరైనా వెళ్లిన బీసీల కేసులు గెలిచే అవకాశం ఉందన్నారు.

# మద్యం, గంజాయి, నల్లబెల్లం స్వాధీనం

**హైదరాబాద్,అక్టోబరు 7, ప్రభాతవార్త :** వేర్వేరు కేసుల్లో ఎక్సైజ్ అధికారులు 44 మద్యం బాటిళ్ళను,2.5 కేజిల గంజాయి,120 కేజిల బెల్లంను మంగళవారం పట్టుకున్నారు.ఢిల్లీ నుంచి హైదరాబాద్ కు వచ్చే తెలంగాణ ఎక్స్ ప్రెస్ రైల్లో సికింద్రాబాద్ డిటిఎఫ్ సిఐ సౌజన్య సిబ్బంది కలిసి నిర్వహించిన తనిఖీల్లో 44 మద్యం బాటిల్లు పట్టుబడ్డాయి.ఈ మద్యం బాటిళ్లను సికింద్రాబాద్ ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించారు. అదే విధంగా నాంపల్లి మెట్రో స్టేషన్ సమీపంలో గంజాయి అమ్మకాలు జరుగుతున్నాయని ఎస్‌టిఎఫ్ ఏ టీం లీడర్ అంజిరెడ్డి ఇచ్చిన సమాచారంమేరకు ఎస్టిఎఫ్ ఏ టీం లీడర్ సిబ్బంది దాడులు నిర్వహించి తనిఖీల్లో 2.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.గంజాయితోపాటు టు వీలర్ సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకొని హట్ గోడ సంజయ్ అనే వ్యక్తిని అరెస్ట్ చేశారు.ఈ కేసులో సంజయ్ తో పాటు శేఖర్ బాబు, కామ్రే బాబు, గంగోలి బహు అనే ముగ్గురు పై కూడా కేసు నమోదు చేశారు.

మరో కేసులో హైదరాబాద్ హైదరాబాదు ఎంజీబీఎస్ బస్ స్టేషన్ నుంచి నాగర్ కర్నూల్ కు బస్సులో తరలిస్తున్న బెల్లాన్ని ఎస్టిఎఫ్ బీ టీం సీఐ భిక్ష రెడ్డి ఎస్సై బాలరాజు సిబ్బంది కలిసి పట్టుకున్నారు. బెల్లాన్ని తీసుకవెళుతున్న ఎల్లమ్మ అనే మహిళను అరెస్ట్ చేసి ఆమె వద్ద నుంచి 120 కేజీల బెల్లం, 30 కేజీల ఆలమును స్వాధీనం చేసుకొని ఎక్సైజ్ స్టేషన్‌లోఅప్పగించారు.అదే విధంగా మరో కేసులో నాగర్ కర్నూల్‌కు హైదరాబాదు నుంచి బయలుదేరినటువంటి బొలెరో వాహనాన్ని బిటిఎఫ్ ఎక్సైజ్ సిబ్బంది పట్టుకుని అందులోని 900 కేజీల బెల్లాన్ని, 20 కేజీల ఆలమును, వాహనాన్ని నాగర్ కర్నూల్ డి టి ఎఫ్ సిబ్బంది పట్టుకున్నారు. బొలెరో వాహనంతో పాటు బిజినేపల్లి భాస్కర్ రెడ్డి, డ్రైవర్ రాంబాబును అరెస్ట్ చేశారు.

# టెక్నాలజీ మానవాళికి ఉపయోగపడాలి: గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

## దేశాన్ని ముందుకు తీసుకువెళ్లాలంటే ఆవిష్కరణ, నైపుణ్యం మీద దృష్టి సారించాలి: డాక్టర్ క్రిష్ణా ఎల్లా

### ఘనంగా హెచ్‌సియు స్నాతకోత్సవం




స్నాతకోత్సవంలో పాల్గొన్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, భారత్ బయోటెక్ చైర్మన్ క్రిష్ణ ఎల్లా తదితరులు. అవార్డులను అందజేస్తున్న హెచ్‌సియు చాన్సిలర్ నర్సింహరెడ్డి, వైస్ చాన్సిలర్ బిజె.రావు

**హైదరాబాద్ (గచ్చిబౌలి), అక్టోబరు 7 ప్రభాతవార్త:** టెక్నాలజీ మానవాళికి ఉపయోగపడే విధంగా ఉండాలని, దానిని భర్తీ చేయకూడదని తెలంగాణ రాష్ట్ర గవర్నర్, హెచ్‌సియు చీఫ్ రెక్టార్ జిష్ణుదేవ్ వర్మ అభిప్రాయపడ్డారు. విద్య సమాజంలో సమగ్రమైన, అందరికీ సమానమైన సమాజాన్ని నిర్మించే విధంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ 25వ స్నాతకోత్సవ వేడుకలను మంగళవారం బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మతో కలిసి భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు, ఎగ్జిక్యూటీవ్ చైర్మన్ క్రిష్ణ ఎల్లా ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈ సంవత్సరం మొత్తం 1717మంది గ్రాడ్యుయేషన్ పూర్తి చేసినట్లు ప్రకటించగా, అందులో 990మంది తమ పట్టాలను అందుకున్నారు. అనంతరం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ మెరుగైన భవిష్యత్తుకు ఆలోచన, విద్యార్థుల కష్టానికి వేడుకగా స్నాతకోత్సవాన్ని అభివర్ణించారు. మానవుడి ఉనికి అంతిమ లక్ష్యం మేధస్సును పెంచడమే కావాలని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ మాటలను ఉటంకించారు. నేటి యువతకు అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని సమాజానికి, తోటి వారికి సేవ చేసేందుకు ఉపయోగించాలని సూచించారు. పట్టాలు అందుకున్న గ్రాడ్యుయేట్లు వనయాన్ని వదులుకోవద్దని, ఇతరులకు అవకాశాలు సృష్టించే విధంగా ఎదగాలని పిలుపునిచ్చారు. భారత్ బయోటెక్ వ్యవస్థాపకుడు క్రిష్ణ ఎల్లా మాట్లాడుతూ భారతదేశాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లాలంటే మన యువత ఆవిష్కరణలు, నైపుణ్యం మీద దృష్టి సారించాలని సూచించారు. విశ్వవిద్యాలయం డిగ్రీ పట్టాను ఇస్తుందని, కానీ ఉత్తమ ఆవిష్కరణ, నైపుణ్యం జీవితంలో ముందుకు తీసుకువెళ్తాయని అన్నారు. నేటి విద్యార్థులు ఉద్యోగాల వేటలో పడి ఉద్యోగ అన్వేషకులుగా మారుతున్నారని, ఉద్యోగ సృష్టికర్తలుగా మారాలని పిలుపునిచ్చారు. దేశంలో ఉన్న సామాజిక సమస్యలకు పరిష్కారాలను కనుగొనాలని సూచించారు. కోవిడ్ మహమ్మారి సమయంలో భారతీయ శాస్త్రవేత్తల సందేహాలు వ్యక్తం చేశారని, కానీ కోవిడ్ వ్యాక్సిన్‌ను సొంతంగా తయారు చేసి భారతీయుల సైన్స్‌ను, మేధోసంపత్తిని ప్రపంచానికి చూపించామన్నారు. హెచ్‌సియు వైస్ చాన్సిలర్ బిజె.రావు మాట్లాడుతూ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఒక విశ్వవిద్యాలయం మాత్రమే కాదని, ఇది ఒక గ్రీన్ క్యాంపస్ అని అన్నారు. ప్రపంచ క్యూఎస్ ర్యాంకింగ్స్‌లో హెచ్‌సియు గత సంవత్సరం ఉన్న 372నుంచి ఈ సంవత్సరం 335కు చేరిందని తెలిపారు. ఆరోగ్య సంరక్షణ, నూతన టెక్నాలజీలో సవాళ్లను పరిష్కరించేందుకు 6 విశ్వవిద్యాలయాలను అనుసంధానం చేస్తూ 100కోట్లతో ఏర్పాటు చేసిన ఎఎన్‌ఆర్‌ఎఫ్ ప్రాజెక్టుకు హెచ్‌సియు నాయకత్వం వహిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. ఈ సందర్భంగా దృష్టి లోపాన్ని అధిగమించి ఎంఎ పొలిటికల్ సైన్స్‌లో పట్టా అందుకున్న విద్యార్థిని గోపితేజస్వీకి ఓబిసి కేటగిరి గోల్డ్‌మెడల్‌ను అందజేశారు.

08-10pg10 12 ONG_08-10pg10.qxd 10/7/2025 10:58 PM Page 1



### ఆసియా అక్వాటిక్స్ ఛాంపియన్‌షిప్

## వాటర్ పోలోలో భారత్ వరుస ఓటమి

**న్యూఢిల్లీ:** ఆసియా అక్వాటిక్స్ ఛాంపియన్‌షిప్-2025, వాటర్ పోలోలో భారత పురుషులు వరుసగా మూడో మ్యాచ్‌లో ఓడిపోయారు. వాటర్ పోలో, ఆర్టిస్టిక్ స్విమ్మింగ్ మూడవ రోజు వీర్ సావర్కర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో కజకిస్తాన్ చేతిలో భారత పురుషుల వాటర్ పోలో జట్టు 6-20 తేడాతో ఓడిపోయింది. కజకిస్తాన్‌కు చెందిన కరీనా మాగ్రుపోవా, పురుషుల సోలో ఫ్రీలో వరుసగా అగ్రస్థానాన్ని దక్కించుకున్నారు. పురుషుల గ్రూప్ బి లో కజకిస్తాన్ 20-6 తేడాతో భారత్‌పై ఘన విజయం సాధించింది. బాల్తాబ్‌కులీ ఆదిల్, నెదోకొంట్సేవ్ 4 గోల్స్ సాధించగా, తోసోయ్ ఎడ్వర్డ్ మూడుసార్లు గోల్స్ చేయగా, లామాయేవ్ మాగ్జిమ్, షకెనోవ్ మురాత్, అకింబే అల్దియార్ తలా రెండు గోల్స్ సాధించారు. అలాగే అఖ్మెటోవ్ రుస్లాన్, మాడిమార్ అల్మాట్, బొబ్రోవ్స్కి మిస్టిస్లావ్ తలా 1 గోల్ చేశారు. భారత్ తరఫున భాగేష్ కుథే 3 గోల్స్ చేయగా, ఉదయ్ ఉత్తేజ్, ప్రవీణ్ గోపీనాథన్ తలా ఒక గోల్ చేశారు. కాగా మహిళల గ్రూప్ ఎ లో జపాన్ 26-13 తేడాతో సింగపూర్‌ను ఓడించింది. కోబయాషి మహో 6 గోల్స్‌తో ఆధిక్యంలో ఉండగా, సోబాజిమా సాకురా (4), కెప్టెన్ ఫుకుడా షోకా, లోరే నినా, సాండా యుమెకా మరియు శిరోనోషిత కహో (3 చొప్పున) ఉన్నారు. షిబాట కనడే 2 గోల్స్ చేయగా, బాండో రికో, ఎగుచి సెయిరా తలా 1 గోల్స్ చేశారు. సింగపూర్ తరఫున యాప్ జింగ్జువాన్ 4, లిమ్ వాన్ జున్, లీ జువాన్ హై తలా 3 గోల్స్ సాధించగా, టియో జి సువాన్, కో టింగ్, యో యింగ్ తలా 1 గోల్స్ చేశారు.



### ఆస్ట్రేలియాతో రెండో టెస్టు తొలి రోజు

## భారత్ 9 పరుగుల ఆధిక్యం

**న్యూఢిల్లీ:** ఆస్ట్రేలియా పర్యటనలో భారత్ అండర్19 జట్టు తొలిసారి బ్యాటింగ్‌లో తడబాటుకు లోనైంది. మెక్‌కే వేదికగా మొదలైన రెండో టస్ట్ తొలి రోజు మంగళవారం ఆట ముగిసే సమయానికి భారత్ 7 వికెట్లు నష్టానికి 144 పరుగులు చేసింది. వన్‌డౌన్‌లో వచ్చిన వైభవ్ సూర్యవంశీ (14 బంతుల్లో 20, 2 ఫోర్లు, 1 సిక్స్) ఆశించిన రీతిలో ఆడలేక తేలిపోయాడు. ఈ మ్యాచ్ ఓపెనరల్‌గా ప్రమోష్ పొందిన విహాన్ మల్హోత్రా (11) నిరాశపరిచాడు. మరో ఓపెనర్, కెప్టెన్ ఆయుశ్ మాత్రే (4) వైఫల్యాల పరంపర కొనసాగించాడు. వేదాంత్ త్రివేది (25) నిలదొక్కుకునేందుకు ప్రయత్నించి విఫలమయ్యాడు. రాహుల్ కుమార్ (9), వికెట్ కీపర్ హర్వంశ్ పంగాలియా (1) సింగిల్ డిజిట్ స్కోర్‌కే పరిమితమయ్యారు. ఖిలన్ పటేల్ (26)





కాసేపు పోరాడినప్పటికీ ఆట ముగిసే సమయానికి కొద్ది ముందు ఔటయ్యాడు. హెనిల్ పటేల్ (22 నాటౌట్), దీపేశ్ దేవేంద్రన్ (6 నాటౌట్) సహకారంతో భారత్‌కు గౌరవ ప్రదమైన స్కోరు అందించేందుకు ప్రయత్నిస్తూ క్రీజులో ఉన్నారు. ఇకఆస్ట్రేలియా బౌలర్లలోకేజీ బార్టన్, విల్ బైరో మ్ టీమిండియా టాపార్డర్‌ను ఇబ్బంది పెట్టారు. కేజీ, బైరోమ్ తలో 2 వికెట్లు పడగొట్టగా, ఛార్లెస్‌లచ్‌మండ్, జూలియన్‌కు తలో వికెట్‌దక్కింది. అంతకు ముందు భారత్ బౌలర్లు చెలరేగ డంతో తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 136 పరుగులకే కుప్పకూలింది. హెనిల్ పటేల్(9-3-21-3), ఖిలన్ పటేల్ (12-5-23-3), ఉధవ్ మోహన్ (6-0-23-2), దీపేశ్ దేవేంద్రన్ ( 7.3-2-22-1 కలిసికట్టుగా ఆస్ట్రేలియా ఇన్నింగ్స్‌ను కుప్పకూల్చారు. ఆసిస్ ఇన్నింగ్స్‌లో వికెట్ కీపర్ లీ యంగ్ (66) ఒక్కడే అర్థ సెంచరీతో రాణించాడు.



### జూడో వరల్డ్ ఛాంపియన్‌షిప్:

## లింతోయ్ విక్టరీతో భారత్‌కు తొలి పతకం

**న్యూఢిల్లీ:** జూనియర్ జూడో ప్రపంచ ఛాంపియన్‌షిప్-2025లో లింతోయ్ చనంబం భారతదేశానికి తొలి పతకం అందించింది. పెరూలోని లిమాలో మంగళవారం జరిగిన జూడో జూనియర్ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో భారతదేశం తరపున తొలి పతకాన్ని గెలుచుకున్న లింతోయ్ చనంబమ్ చరిత్ర సృష్టించింది. మహిళల 63 కిలోల విభాగంలో 19 ఏళ్ల చనంబమ్ కాంస్య పతక పోరులో నెదర్లాండ్స్‌కు చెందిన జోనీ గీలెన్‌పై విజయం సాధించి కాంస్య పతకాన్ని గెలుచుకుంది. అంతకుముందు, చనంబమ్ తన చివరి గ్రూప్ డి మ్యాచ్‌లో జపాన్‌కు చెందిన సోమోరిచికా చేతిలో ఓడిపోయింది. మోరిచికా మహిళల 63 కిలోల ఫైనల్‌కు చేరుకున్న తర్వాత మణిపూర్‌కు చెందిన జూడోకా రెపిచేజ్ మార్గం ద్వారా పతక పోరులోకి ప్రవేశించింది. రెపిచేజ్ రౌండ్‌లో, చనంబమ్ మొదట స్లోవేకియాకు చెందిన ఇలారియా సుర్కాన్‌ను ఓడించి, గీలెన్‌తో కాంస్య పతక పోటీకి సిద్ధమైంది. ఇది చానంబంకు లభించిన రెండవ వయసు గ్రూప్ ప్రపంచ ఛాంపియన్‌షిప్ పతకం. క్యాడెట్ ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచిన తొలి భారతీయ జూడోకాగా కూడా ఆమె గుర్తింపు పొందింది. ఆమె మూడు సంవత్సరాల క్రితం 2022లో ఆ ఘనతను సాధించింది. కాగా గత సంవత్సరం కాలంగా, చనంబం గాయాలతో ఇబ్బంది పడింది. తిదిలి గాయంతో ఆమె చాలా కాలం పాటు ఆటకు దూరంగా ఉండి, ఈ సంవత్సరం ప్రారంభంలోనే పోటీ జూడోకు తిరిగి వచ్చింది.

### ఆస్ట్రేలియా పర్యటనలో..

## భారత్ హిట్ ఇన్నింగ్స్



**టాప్5లో 2 సార్లు రోహిత్**





**న్యూఢిల్లీ:** భారత్, ఆస్ట్రేలియా మధ్య మూడు వన్డేల సిరీస్ ప్రారంభం కానుంది. ఈ సిరీస్ ఈ నెల 19 నుండి ఆస్ట్రేలియా గడ్డపై జరుగుతుంది. ఆస్ట్రేలియాతో తలపడే టీమిండియాలో మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీకి చోటు కల్పించారు. అయితే ఇవ్వటి వరకూ ఆస్ట్రేలియాపై జరిగిన వన్డేల్లో అత్యధిక ఇన్నింగ్స్‌లు ఆడిన పలువురు బ్యాట్స్‌మెన్‌లు ఉన్నారు. టాప్ ఐదు ఇన్నింగ్స్‌ల్లో రోహిత్ శర్మ పేరు రెండు సార్లు రికార్డయింది. జనవరి 2016లో పెర్త్‌లో ఆస్ట్రేలియాపై రోహిత్ 171 పరుగుల అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. ఇది అతని వన్డే కెరీర్‌లో అత్యుత్తమ ఇన్నింగ్స్‌లలో ఒకటిగా ఉంది. ఆ సమయంలో పిచ్ వేగంగా మరియు బౌన్సీగా ఉండేది. పరుగులు చేయడం కష్టతరం చేసింది. అయితే, భారత ఇన్నింగ్స్‌ను స్థిరంగా ఉంచడానికి రోహిత్ అద్భుతమైన ఓర్పు మరియు సమయస్ఫూర్తిని ప్రదర్శించాడు. తర్వాత సౌరవ్ గంగూలీ 2000లో అడిలైడ్‌లో పాకిస్థాన్‌పై 141 పరుగుల చిరస్మరణీయ ఇన్నింగ్స్ ఆడాడు. ఈ ఇన్నింగ్స్ కార్లన్ యునైటెడ్ సిరీస్‌లో భాగం. 267 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో గంగూలీ కెప్టెన్‌గా ఆడి జట్టును నడిపించాడు. అతని ఇన్నింగ్స్ అద్భుతమైన పోరాట స్ఫూర్తిని ప్రదర్శించింది. ఇక జనవరి 2004లో యువరాజ్ సింగ్ ఆస్ట్రేలియాతో సిడ్నీలో జరిగిన మ్యాచ్‌లో 139 పరుగుల అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. ఈ ఇన్నింగ్స్ ఒత్తిడిలో కూడా ఆడగల అతని సామర్థ్యాన్ని ప్రదర్శించింది. 5వ స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన యువరాజ్, భారత్ 80 పరుగులకే 3 వికెట్లు కోల్పోయినప్పుడు జట్టును స్థిరపరిచి ఇన్నింగ్స్‌ను నడిపించే బాధ్యతను స్వీకరించాడు. జనవరి 2015లో మెల్‌బోర్న్‌లో ఆస్ట్రేలియాపై 138 పరుగులు చేసిన రోహిత్ రెండో సారి ఈ లిస్ట్‌లో స్థానం సంపాదించాడు. ప్రారంభ వికెట్లు కోల్పోయిన తర్వాత, రోహిత్ ఓపికగా ఇన్నింగ్స్‌ను నిలబెట్టాడు. అతను సింగిల్స్‌తో పరుగులు సాధించాడు. తన విలక్షణమైన శైలిలో ఫోర్లు, సిక్సర్లు కొట్టాడు.

2015 ప్రపంచ కప్‌లో మెల్‌బోర్న్‌లో దక్షిణాఫ్రికాపై శిఖర్ ధావన్ 137 పరుగుల అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. ఇది అతని కెరీర్‌లో అత్యుత్తమ ఇన్నింగ్స్‌లలో ఒకటి. ఇన్నింగ్స్ ప్రారంభించిన ధావన్ దక్షిణాఫ్రికా ఫాస్ట్ బౌలర్లను ఆత్మవిశ్వాసంతో ఎదుర్కొన్నాడు.

## జ్వెరెవ్ సంచన ఓటమి

### అగ్రస్థానానికి రిండర్‌క్నెచ్



**న్యూఢిల్లీ:** షాంఘై మాస్టర్స్ 2025లో అలెగ్జాండర్ జ్వెరెవ్ సంచలన ఓటమి చెందాడు. ఫ్రాన్స్‌కు చెందిన రిండర్‌క్నెచ్ చేతిలో ఘోర పరాజయం పాలయ్యాడు. షాంఘై మాస్టర్స్ టోర్నమెంట్‌లో ప్రపంచ మూడో నంబర్ అలెగ్జాండర్ జ్వెరెవ్‌ను ఫ్రాన్స్‌కు చెందిన ఆర్థర్ రిండర్‌క్నెచ్ 4-6, 6-3, 6-2 తేడాతో ఓడించి, టోర్నమెంట్‌లో అగ్రస్థానంలో చేరుకున్నాడు. క్లిష్ట పరిస్థితుల్లో, 54వ ర్యాంక్‌లో ఉన్న ఫ్రెంచ్ ఆటగాడు ఒక సెట్ నుండి తిరిగి వచ్చి, మరింతగా ఉక్కిరిబిక్కిరి అయిన జ్వెరెవ్‌ను గందరగోళానికి గురయ్యేలా చేశాడు. షాంఘైలో తన చివరి మ్యాచ్ ముగిసే సమయానికి జ్వెరెవ్ బొటనవేలికి గాయమైంది. కానీ అతను ఈ టోర్నీ మూడవ గేమ్‌లో ఫోర్‌హ్యాండ్‌తో రిండర్‌క్నెచ్‌ను బ్రేక్ చేయడంలో ఇబ్బందులు పడలేదు. రెండవ సెట్ ప్రారంభంలోనే అతను దాదాపు ముందుకు వెళ్ళాడు. అయితే రిండర్‌క్నెచ్ పుంజుకుని సరైన సమయంలో, తెలివిగా దాడి చేయడంతో జ్వెరెవ్ ఒకింత ఇబ్బందికి గురయ్యాడు. నాల్గవ గేమ్‌లో ఒత్తిడిని పెంచి చివరికి బ్రేక్ చేశాడు. అదే జోరును కొనసాగిస్తూ, మూడవ సెట్‌లో 30 ఏళ్ల అతను మూడవ గేమ్‌లో బ్రేక్ చేశాడు. ఏడో గేమ్‌లో డబుల్ ఫాల్ట్ రిండర్‌క్నెచ్‌ను మళ్ళీ బ్రేక్ చేయడానికి దారితీసేలా ప్రయత్నించాడు. కానీ రిండర్‌క్నెచ్ జ్వెవ్‌ను ఓడించడంతో ప్రపంచ నెంబర్ 3 టోర్నమెంట్ నుండి నిష్క్రమించక తప్పలేదు.

## రూ.2700 పెరిగిన బంగారం!



**ముంబయి, అక్టోబరు 7:** బంగారం ధరలు రోజు రోజుకూ పెరుగుతున్నాయి. పసిడి పరుగులు ఆగడం లేదు. ప్రతిరోజు సరికొత్త గరిష్టాలకు చేరుకుంటూ రికార్డులు నమోదు చేస్తోంది. తాజాగా బంగారం ధర మళ్లీ పెరిగింది. మంగళవారం హైదరాబాద్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం రూ.1, 23, 850కు చేరింది. అలాగే 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం రూ.1, 15, 500ను తాకింది. మరోవైపు కిలో వెండి ధర రూ.1, 54, 350కు చేరింది.పండగల సీజన్ కావడం, అంతర్జాతీయంగా మార్కెట్ల అస్థిరత, డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి పతనం బంగారం పెరుగుదలకు కారణంగా కనిపిస్తోంది. భౌగోళిక రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలో పెట్టుబడిదారులు సురక్షిత ఆస్తుల వైపు మొగ్గు చూపుతుండడంతో బంగారానికి డిమాండ్ పెరుగుతోంది బంగారం ధర మరింత పెరిగే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. మరోవైపు వెండి కూడా పరుగులు తీస్తోంది. వెండి కిలో రూ.2 లక్షలకు చేరే అవకాశం ఉందని ఇటీవల మార్కెట్ పండితులు అంచనా వేసిన సంగతి తెలిసిందే.

## కనీస పింఛన్ రూ.2500..

### ఇపిఎఫ్ఒ ట్రస్టీ సమావేశంలో వెలువడనున్న నిర్ణయం

**ముంబయి, అక్టోబరు 7:** ప్రైవేట్ రంగంలోని ఉద్యోగులకు అదిరే శుభవార్త. ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్ఓ)కు చెందిన అత్యున్నత నిర్ణయాధికార కమిటీ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ ఈనెల 10, 11 తేదీల్లో బెంగళూరులో సమావేశం కానుంది. ఈ సమావేశంలో కనీస పెన్షన్ పెంపుపై ప్రధానంగా చర్చ ఉండనుందని తెలుస్తోంది. కనీస పెన్షన్ రూ. 1000 నుంచి రూ. 2500లకు పెంచే ప్రతిపాదనలపై చర్చించి ఓ నిర్ణయం తీసుకోనున్నారు. అదే జరిగితే లక్షల మందికి ప్రయోజనం చేకూరనుంది. ఎంప్లాయిస్ పెన్షన్ స్కీమ్ పరిధిలో కనీస పెన్షన్ ప్రస్తుతం నెలకు రూ. 1000గా ఉంది. దీనిని 2014లో నిర్ణయించారు. అప్పటి నుంచి అదే పెన్షన్ కొనసాగిస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో వివిధ ఉద్యోగుల సంఘాలు కనీస పెన్షన్ రూ. 1000 అనేది చాలా తక్కువగా ఉందని, ప్రస్తుత ద్రవ్యోల్బణానికి అనుగుణంగా పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. కనీస పెన్షన్ రూ. 7500లకు పెంచాలని పలు ట్రేడ్ యూనియన్లు, పెన్షనర్ల అసోసియేషన్లు చాలా కాలంగా డిమాండ్ చేస్తున్నాయి. పలు నివేదికల ప్రకారం సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీలు కనీస పెన్షన్‌ను 7.5 రెట్లు పెంచేందుకు సుముఖంగా లేరు. అయితే, రూ.1000 నుంచి రూ.2500లకు పెంచేందుకు ఆమోదం తెలపవచ్చని తెలుస్తోంది. ఎంప్లాయిస్ పెన్షన్ స్కీమ్ (ఈపీఎస్) పరిధిలో పెన్షన్ లెక్కించేందుకు ఒక స్థిరమైన ఫార్ములా ఉంది. పెన్షన్ శాలరీ అంటే బేసిక్ శాలరీ ప్లస్ గత 60 నెలల డీఏ (గరిష్ఠంగా రూ. 15000)గా లెక్కలోకి తీసుకుంటారు. పెన్షనేబుల్ శాలరీ గరిష్ఠ పరిమితి రూ. 15000గా ఉంది. ఉదాహరణకు ఒక వ్యక్తి 35 సంవత్సరాలు సర్వీసులో ఉంటే అతనికి నెలకు రూ. 7500 వరకు పెన్షన్ లభిస్తుంది. 58 ఏళ్ల వరకు సర్వీసులో కొనసాగాల్సి ఉంటుంది. ముందే ఉద్యోగం వదిలేస్తే విత్‌డ్రాయల్ బెనిఫిట్స్‌తో పాటు తగ్గించిన పెన్షన్ లభిస్తుంది. అంటే చేతికి అందే పెన్షన్ భారీగా తగ్గిపోతుంది. పూర్తి సర్వీసులో ఉన్న వారికి గరిష్ఠ పెన్షన్ లభిస్తుంది.



## టాటా ఇన్వెస్ట్‌మెంట్ షేర్లలో భారీ పతనం!

**ముంబయి, అక్టోబరు 7:** టాటా గ్రూప్ నుంచి దాదాపు రెండేళ్ల తర్వాత మరో పెద్ద ఐపీఓ వస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే టాటా క్యాపిటల్ ఐపీఓ సబ్‌స్క్రిప్షన్ ప్రారంభమైంది. అయితే ఈ ఐపీఓ బజ్‌తో ఇటీవల భారీగా పెరిగిన టాటా గ్రూప్‌కే చెందిన టాటా ఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్ షేర్ ధర మంగళవారం భారీగా పతనమై ఇన్వెస్టర్లకు తీరని నష్టాల్ని మిగిల్చింది. ఇంట్రాడేలో దాదాపు 7 శాతం వరకు పడిపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఒక శాతానికిపైగా లాభంతోనే ప్రారంభమైంది. ఇంట్రాడేలో 2 శాతం వరకు పెరిగింది. అక్కడి నుంచి వరుసగా పతనమవుతూనే వచ్చింది. ఇంట్రాడేలో 8 శాతానికిపైగా పతనంతో రూ. 9,123 వద్ద కనిష్టాన్ని తాకింది. ఇక్కడ చూస్తే షేర్ ధర కిందటి క్లోజింగ్ నుంచి ఏకంగా రూ. 800కుపైగా పడిపోయింది. ఇంట్రాడే గరిష్టం నుంచి చూస్తే రూ. 1000కిపైగా పడిపోవడం గమనార్హం. టాటా ఇన్వెస్ట్‌మెంట్ స్టాక్ ఇటీవల భారీగా పుంజుకుంది. కొన్ని నెలలుగా50 శాతానికిపైగా స్థిరంగా రిటర్న్స్ ఇస్తూ వచ్చింది. ఐదేళ్లలో చూస్తే ఏకంగా 900 శాతానికిపైగా రాబడి అందించింది. స్టాక్ స్ప్లిట్, ఐపీఓ వంటివి ఉన్నాయి. ఇన్వెస్టర్లను ఊరించేలా టాటా క్యాపిటల్ ఐపీఓపై ప్రకటన వచ్చింది. మరోవైపు టాటా ఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్ తొలిసారిగా స్టాక్ స్ప్లిట్ కూడా ప్రకటించింది. స్టాక్ 52 వారాల గరిష్ట ధర రూ. 11,847 కాగా కనిష్ట ధర రూ. 5,145 గా ఉంది. కంపెనీ మార్కెట్ విలువ ప్రస్తుతం రూ. 47.61 వేల కోట్లుగా ఉంది. సెప్టెంబర్ నెలలో ఈ స్టాక్ ఏకంగా 50 శాతానికిపైగా పుంజుకుంది.





### రెండోరోజూ లాభాల్లోనే

## స్టాక్ మార్కెట్లు

**ముంబయి, అక్టోబరు 7:** భారత స్టాక్ మార్కెట్లు మంగళవారం రెండో రోజు కూడా పాజిటివ్ ధోరణిలో కొనసాగాయి. ఈ క్రమంలో ప్రధానంగా రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, భారతి ఎయిర్‌టెల్ వంటి దిగ్గజ కంపెనీల షేర్లలో భారీగా కొనుగోళ్లు జరిగాయి. మధ్యాహ్నం 2 గంటల సమయంలో బీఎస్‌ఈ సెన్సెక్స్ 462.15 పాయింట్లు ఎగసి 82,252.27 స్థాయికి చేరుకుంది. అదే సమయంలో ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ50 సూచీ 124.55 పాయింట్లు పెరిగి 25,197.70 వద్ద నిలిచింది. ఈ నిఫ్టీ రికార్డ్ స్థాయికి చేరుకోవడంతో ఇన్వెస్టర్లు పెద్ద ఎత్తున లాభపడ్డారు. సెన్సెక్స్‌లో టాప్ గెయినర్స్, లూజర్స్ ఈ క్రమంలో సెన్సెక్స్‌లోని కంపెనీల్లో భారతి ఎయిర్‌టెల్, హెచ్‌సీఎల్ టెక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, పవర్ గ్రిడ్ వంటి షేర్లు 1.9 శాతం వరకు లాభాలను అందుకోగా, యాక్సిస్ బ్యాంక్, టాటా మోటార్స్, ట్రెంట్, హిందుస్థాన్ యూనిలీవర్, కోటక్ బ్యాంక్ షేర్లు 2 శాతం వరకు నష్టపోయాయి. వీటి పనితీరు మార్కెట్‌లో మిశ్రమ ఫలితాలను చూపించింది. ఈ క్రమంలో మార్కెట్లలో నిఫ్టీ మిడ్‌క్యాప్100, స్మాల్‌క్యాప్100 సూచీలు వరుసగా 0.42 శాతం, 0.34 శాతం లాభాలతో ట్రేడయ్యాయి. సెక్టోరల్ సూచీల్లో నిఫ్టీ ఆయిల్ అండ్ గ్యాస్, నిఫ్టీ రియల్టీ, కన్స్యూమర్ డ్యూరబుల్స్ 0.8 శాతం వరకు పెరిగి అగ్రగామిగా నిలిచాయి. కానీ నిఫ్టీ ఎఫ్‌ఎమ్‌సీజీ, మీడియా, పీఎస్‌యూ బ్యాంక్ సూచీలు 0.3 శాతం వరకు తగ్గాయి. వొడాఫోన్ ఐడియా షేర్లు మంగళవారం అద్భుత జోష్‌తో దూసుకెళ్లాయి. బీఎస్‌ఈలో కంపెనీ షేరు 8 శాతం పెరిగి రూ. 9.2 వద్ద ఎనిమిది నెలల గరిష్ట స్థాయిని తాకింది. సెప్టెంబర్ నుంచి ఈ షేరు ధర ఏకంగా 42 శాతం పెరిగింది. బిఎస్ఇలో మిడ్‌ఖ్యాప్‌సూచీ 0.45శాతం లబ్దిపొందితే స్మాల్‌క్యాప్‌సూచీ మాత్రం 0.15శాతం క్షీణించింది.

## డిబిటితో రూ.4.31 లక్షల కోట్లు ఆదా

### కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్



**ముంబై, అక్టోబర్ 7:** వివిధ ప్రభుత్వ పథకాలకు సంబంధించిన నగదు మొత్తాల్ని ఆయా లబ్దిదారులకు నేరుగా వాళ్ల బ్యాంకు ఖాతాలకు బదిలీ చేస్తున్న విషయం విదితమే. ఇలా చేయడం వల్ల ప్రభుత్వానికి అక్షరాలా నాలుగు లక్షల 31 వేల కోట్ల రూపాయలు ఆదా అయిందని కేంద్రం చెపుతోంది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ వివరాలు స్వయంగా వెల్లడించారు. ముంబైలో జరుగుతున్న గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్టివల్‌లో ఆమె ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ కార్యక్రమం పాల్గొన్న కేంద్రమంత్రి ఈరోజు విదేశీ కరెన్సీ సెటిల్‌మెంట్ సిస్టమ్‌ను కూడా ప్రారంభించారు. ఈ ఆధునిక వ్యవస్థ విదేశీ కరెన్సీ లావాదేవీలను రియల్‌టైమ్ ప్రాతిపదికన పూర్తి చేస్తుందని ఆమె చెప్పారు. ప్రస్తుతం, ముంబైలో విదేశీ కరెన్సీని సెటిల్ చేయడానికి 36 నుండి 54 గంటలు పడుతుందని.. ఇవాళ ప్రారంభించిన గిఫ్ట్ సెటిల్ మెంట్ వ్యవస్థతో ఈ సమయం చాలా ఆదా అవుతుందని కేంద్రమంత్రి తెలిపారు. ఫలితంగా భారత్ ఇప్పుడు, హాంకాంగ్, టోక్యో, మనీలా సరసన చేరిందని మంత్రి తెలిపారు. దేశంలో బ్యాంకింగ్, ఫైనాన్స్, ఫిన్‌టెక్, ఆధార్, యుపిఐ డిజిలాకర్ వ్యవస్థల్ని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఉపయోగించి ఎలా ముందుకెళ్తున్నామన్న విషయాన్ని కూడా మంత్రి ఈ సందర్భంగా వెల్లడించారు. దేశంలోని అన్ని వ్యవస్థలు టెక్నాలజీ వారధిగా ముందుకు సాగాలని ఆమె పిలుపునిచ్చారు. గోప్యతను కాపాడుతూ, ప్రతి పౌరుడిని ఉద్ధరించేలా, టెక్నాలజీ దినదినాభివృద్ధి చెందాలని ఆమె సూచించారు. తద్వారా దేశం మరింత త్వరితగతిన అభివృద్ధి చెందుతుందని నిర్మలా సీతారామన్ అన్నారు. ఇప్పటి వరకూ భారత్‌లో ఉన్న బ్యాంకులు లేదా కంపెనీలు అమెరికా డాలర్లు, యూరోలు, యెన్ వంటి విదేశీ కరెన్సీల్లో లావాదేవీలు చేయాలంటే, అవి ఇప్పటివరకు హాంకాంగ్, టోక్యో లేదా లండన్ బ్యాంకుల ద్వారా సెటిల్ చేసేవి. ఈ ప్రక్రియకు 36 నుండి 54 గంటల సమయం పట్టేది. కానీ ఇప్పుడు,గిఫ్ట్ సిస్టమ్ ద్వారా భారత్‌లోనే ఈ లావాదేవీలను రియల్ టైమ్‌లో (తక్షణమే) పూర్తి చేయొచ్చు. గిఫ్ట్ ట్రాన్సాక్షన్స్ ద్వారా భారత్ ఇప్పుడు హాంకాంగ్, టోక్యో, మనీలా సరసన నిలిచింది. విదేశీ కరెన్సీ సెటిల్‌మెంట్స్‌లో సమయం, ఖర్చు రెండూ తగ్గుతాయి. బ్యాంకులు, కంపెనీలు, ఇన్వెస్టర్లకు తక్కువ సమయంలో సులభమైన లావాదేవీలు జరిగే వీలు. భారత్ అంతర్జాతీయ ఫైనాన్షియల్ హబ్‌గా ఎదగడంలో ఇది కీలకం.




### నేటి నుంచి యుపిఐ చెల్లింపుల్లో

## బయోమెట్రిక్ ఫీచర్

### ముఖ గుర్తింపు లేదా వేలిముద్రలతోనే చెల్లింపులు

**న్యూఢిల్లీ, అక్టోబరు 7:** డిజిటల్ చెల్లింపుల రంగంలో మరో అద్భుతమైన మార్పురాబోతోంది.రేపటి నుంచిబుధవారంనుంచి యూపీఐ (యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్) వినియోగదారులు పిన్ లేదా పాస్‌వర్డ్ నొక్కకుండానే చెల్లింపులు చేసుకోవచ్చు. మీ ముఖం లేదా వేలిముద్ర ద్వారా చేసుకునే ఛాన్సుంది. బయోమెట్రిక్ ఆధారిత గుర్తింపు విధానంతో యూపీఐ చెల్లింపులు ఇకపై మరింత సులభం కానున్నాయి. ఇప్పటివరకు యూపీఐ ద్వారా చెల్లింపులు చేయడానికి మనం నాలుగు లేదా ఆరు అంకెల పిన్‌ను ఎంటర్ చేయాల్సి వస్తుంది. కానీ ఇకపై ఆ పిన్ అవసరం లేదు. భారతదేశంలో ప్రత్యేక గుర్తింపు వ్యవస్థ అయిన ఆధార్ ఆధారంగా నమోదైన మీ బయోమెట్రిక్ డేటా (ముఖ గుర్తింపు లేదా వేలిముద్ర) ద్వారా చెల్లింపులు చేసుకోవచ్చు. ఈ సాంకేతికత మీ గుర్తింపును త్వరగా ధృవీకరించి, సురక్షితంగా లావాదేవీలను పూర్తి చేస్తుంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ఇటీవల డిజిటల్ చెల్లింపులకోసం పిన్‌తో పాటు ఇతర గుర్తింపు పద్ధతులను అనుమతించింది. దీనిలో భాగంగా బయోమెట్రిక్ ఆధారిత ధృవీకరణ విధానం అమల్లోకి వస్తోంది. ఈ కొత్త ఫీచర్ యూపీఐ చెల్లింపులను మరింత వేగవంతం చేయడమే కాకుండా, వినియోగదారులకు సౌలభ్యాన్ని అందిస్తుంది. పిన్‌ను గుర్తుంచుకోవడం లేదా టైప్ చేయడం వంటి ఇబ్బందులు ఇక ఉండవు. మీరు యూపీఐ యాప్ ద్వారా చెల్లింపు చేయాలనుకున్నప్పుడు, పిన్ ఎంటర్ చేయడానికి బదులు మీ స్మార్ట్‌ఫోన్ కెమెరా ద్వారా ముఖ గుర్తింపు లేదా వేలిముద్ర స్కానర్ ద్వారా ధృవీకరణ చేయాలి. ఈ డేటా ఆధార్ డేటాబేస్‌తో సరిపోల్చబడి, క్షణాల్లోనే మీ లావాదేవీ పూర్తవుతుంది. ఈ ప్రక్రియ వేగవంతం కావడమే కాదు, ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ డేటా కారణంగా సురక్షితంగా ఉంటుంది. ఈబయోమెట్రిక్ ఫీచర్ ప్రతిఒక్కరికీ ఉపయోగపడుతుంది. ప్రధానంగా టెక్నాలజీ పెద్దగా పరిచయంలేనివారు, పిన్‌ను గుర్తుంచుకోవడంలో ఇబ్బంది పడేవారికి ఇది సౌలభ్యంగా ఉంటుంది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at Plot Nos. 56&58, 9th line, Ramnagar, Ongole - 523001, ph: 2312451, Fax: 08592-236879, RNI No, 64847/96, Editor.Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act, Regd. No.H/SD/337/12-14 Air Surcharge:Delhi:40 Ps